

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 4-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 79 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: త్రయోదశి ఉ. 5.54, చతుర్దశి తె. 4.57 వరకు; నక్షత్రం: మృగశిర తె. 3.54 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: ఉ. 9.39-11.15; దుర్ముహూర్తం: ఉ. 10.09-11.01, మ. 3.21-4.13; అమృతఘడియలు: రా. 7.10-8.45; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





కొకొ గాఫ్

రూడ్‌కు షాక్

అల్కారజ్, గాఫ్ ముందంజ
వింబుల్డన్

లండన్: వింబుల్డన్‌లో మరో సంచలనం చోటుచేసుకుంది. 8వ సీడ్ కాస్పెర్ రూడ్‌కు రెండో రౌండ్‌లో చుక్కెదురైంది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఇటలీకి చెందిన అన్ సీడెడ్ ఫాగియెూ ఫోగ్నిని 6-4, 7-5, 6-7 (7), 6-3తో రూడ్ (నార్వే)కు షాకిచ్చాడు. డిఫెండింగ్ చాంప్ అల్కారజ్ 7-6 (5), 6-2, 6-2తో ఉకిక్‌పై సులువుగా నెగ్గి మూడోరౌండ్లో ప్రవేశించాడు. అయితే ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ రెండో రౌండ్ దాటేందుకు నాలుగు సెట్లపాటు పోరాడాల్సి వచ్చింది. ముల్లెర్‌తో జరిగిన మ్యాచ్‌లో మెద్వెదెవ్ 6-7 (7), 7-6 (4), 6-4, 7-5తో నెగ్గి గట్టెక్కాడు. మహిళల రెండో రౌండ్‌లో కొకొ గాఫ్ 6-2, 6-1తో టొడోనిని చిత్తు చేసింది. కాగా, డయానా (రష్యా) 6-1, 6-1తో యూఎస్ ఓపెన్ మాజీ చాంప్ స్లొన్ స్టీఫెన్స్‌కు షాకిచ్చి మూడో రౌండ్ చేరింది. లోకల్ స్టార్ ఎమ్మా రదుకాను 6-1, 6-2తో మెర్టెన్స్‌పై, బియాంక ఆండ్రెస్కూ 6-3, 7-6(5)తో 26వ సీడ్ నొస్కోవాపై గెలిచి మూడో రౌండ్లో అడుగుపెట్టారు. ఇక, కొలిన్స్, స్విటోలినా, క్రజికోవా రెండోరౌండ్ చేరారు.

డబుల్స్‌లో బోపన్న బోణీ.. నగాల్ అవుట్

డబుల్స్‌లో బుధవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. వెటరన్ స్టార్ రోహన్ బోపన్న-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 7-5, 6-4తో నెదర్లాండ్స్ జోడీ రాబిన్ హస-సాండెర్ అరెన్స్‌పై గెలిచి రెండోరౌండ్ చేరింది. ఇక, ఆరంభరౌండ్లో సుమిత్ నగాల్-డుసాన్ లజోవిక్ (సెర్బియా) జంట 2-6, 2-6తో స్పెయిన్ జోడీ మునార్/మార్టినేజ్ చేతిలో ఓడింది. నగాల్ సింగిల్స్‌లోనూ తొలి రౌండ్‌లోనే ఓడిన సంగతి తెలిసిందే.

ప్రజ్ఞానందకు మరో డ్రా

బుఖారెస్ట్ (హంగేరి): సూపర్ బెట్ క్లాసిక్ చెస్ టోర్నీ ఏడో రౌండ్‌లోనూ భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందకు డ్రా ఎదురైంది. బుధవారం జరిగిన ఈ రౌండ్‌లో ఇయాన్ నెపోమ్నియాచి (రష్యా)తో తలపడిన ప్రజ్ఞానంద 24 ఎత్తుల్లో పాయింటును పంచుకున్నాడు. గత రౌండ్ గేమ్‌నూ ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. కాగా, గుకేశ్-కరువానా, అనీష్ గిరి-లగ్రావ్ ఏడో రౌండ్ గేమ్‌లు కూడా డ్రాగా ముగిశాయి.

‘టాప్’లేపిన హార్దిక్ పాండ్యా

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్



దుబాయ్: భారత జట్టు వరల్డ్‌కప్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన హార్దిక్ పాండ్యా.. టీ20 ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో టాప్ లేపాడు. బుధవారం తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఆల్‌రౌండర్ల విభాగంలో రెండు స్థానాలు మెరుగుపర్చుకొన్న పాండ్యా.. శ్రీలంక ఆటగాడు వనిందు హసరంగ (222 పాయింట్లు)తో సమంగా అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో ఆల్‌రౌండర్ల విభాగంలో టాప్ ర్యాంక్‌లో నిలిచిన తొలి భారత ఆటగాడిగా కొత్త రికార్డు సృష్టించాడు. స్టొయినిస్ (ఆస్ట్రేలియా), సికందర్ రజా (జింబాబ్వే), షకీబల్ (బంగ్లాదేశ్) 3,4,5 ర్యాంకుల్లో ఉన్నారు. ఇక బౌలర్ల విభాగంలో బుమ్రా 12 స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో నిలిచాడు. అక్షర్ పటేల్ ఒక స్థానం మెరుగుపర్చుకొని ఏడో ర్యాంక్‌ను, కుల్దీప్ ఎనిమిదో స్థానాన్ని దక్కించుకొన్నారు. అర్ష్‌దీప్ 4 మెట్లెక్కి 13వ స్థానానికి చేరాడు. సౌతాఫ్రికా పేసర్ అన్రిచ్ నోకియా ఏడు స్థానాలు ఎగబాకి రెండో స్థానం సొంతం చేసుకొన్నాడు. ఆదిల్ రషీద్ (ఇంగ్లండ్) టాప్‌లో కొనసాగుతున్నాడు.



పారుల్ అరుదైన ఘనత

పారిస్‌లో.. రెండు ఈవెంట్ల బరిలో

న్యూఢిల్లీ: భారత అథ్లెట్ పారుల్ చౌధురికి అరుదైన ఘనత దక్కింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ స్టార్ అథ్లెట్ పారిస్ ఒలింపిక్స్‌లో రెండు ఈవెంట్లలో పోటీపడనుంది. ఇప్పటికే మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో విశ్వక్రీడలకు అర్హత సాధించిన పారుల్.. తాజాగా 5000 మీటర్ల రేసులోనూ పోటీపడేందుకు బెర్త్ దక్కించుకుంది. దీంతో పారిస్ ఒలింపిక్స్‌లో రెండు ఈవెంట్లలో బరిలోకి దిగుతున్న తొలి భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా పారుల్ అరుదైన ఘనతను సాధించింది. వరల్డ్ అథ్లెటిక్ సమాఖ్య తాజాగా విడుదలచేసిన ఆటోమేటిక్ క్వాలిఫికేషన్స్, కటాఫ్ ర్యాంకింగ్స్‌లో పారుల్‌కు 5వేల మీటర్ల విభాగంలో 34వ స్థానం దక్కింది. 40లోపు ర్యాంకులో ఉండడంతో పారుల్‌కు ఈ ఈవెంట్‌లోనూ బెర్త్ ఖరారైంది.

చాంపియన్లు వచ్చేస్తున్నారు..
సంబరాలకు సిద్ధమా!

ముంబైలో టీమిండియా విక్టరీ పరేడ్ నేడు
భారీగా హాజరుకావాలని రోహిత్ పిలుపు
భారత జట్టును సత్కరించనున్న మోదీ

ముంబై: టీ20 వరల్డ్‌కప్ చాంపియన్ భారత్‌కు స్వదేశంలో అపూర్వ స్వాగతం లభించనుంది. సుదీర్ఘ విరామానంతరం జగజ్జేతగా నిలిచిన భారత జట్టు రాక సందర్భంగా గురువారం భారీగా విజయోత్సవ సంబరాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓపెన్ టాప్ బస్‌లో రోడ్ షో అనంతరం వాంఖడే స్టేడియంలో జట్టు సభ్యులను సత్కరించనున్నారు. బార్బడోస్ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరిన రోహిత్ సేన గురువారం ఉదయం 6 గంటలకు న్యూఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటుంది. హరికేన్ కారణంగా టీమిండియా ప్రయాణం కొంత ఆలస్యమైంది. ‘ఎయిరిండియా ప్రత్యేక విమానంలో టీమ్ స్వదేశానికి బయల్దేరింది. హరికేన్ కారణంగా చిక్కుకుపోయిన భారత జర్నలిస్టులు, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా కూడా అదే విమానంలో ఉన్నార’ని బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా చెప్పాడు. ఢిల్లీలో ల్యాండ్ అయిన తర్వాత.. ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో ఆటగాళ్లు మర్యాదపూర్వకంగా కలవనున్నారు. ఆ తర్వాత విక్టరీ పరేడ్‌లో పాల్గొనేందుకు ముంబై బయల్దేరతారని శుక్లా చెప్పాడు. సాయంత్రం నారీమన్ పాయింట్ నుంచి వాంఖడే వరకు రోడ్ షో నిర్వహించిన అనంతరం సత్కార కార్యక్రమం జరుగుతుంది. నజరానాగా ప్రకటించిన రూ. 125 కోట్ల చెక్‌ను అక్కడే ఆటగాళ్లకు అందజేయనున్నారు. విక్టరీ పరేడ్‌కు క్రికెట్ ఫ్యాన్స్ భారీ సంఖ్యలో హాజరుకావాలని జై షా పిలుపునిచ్చాడు. ‘టీమిండియా గెలుపు సంబరాల్లో భాగమవ్వండి. మెరైన్ డ్రైవ్ నుంచి వాంఖడే వరకు జరిగే జైత్రయాత్రలో పాలుపంచుకోండి’ అని షా ఎక్స్‌లో పోస్టు చేశాడు. 2007లో ధోనీ సేన తొలిసారి టీ20 వరల్డ్‌కప్ నెగ్గినప్పుడు నిర్వహించిన సంబరాల ఫొటోను షేర్ చేస్తూ.. మళ్లీ ఇలాంటిదే జరుగుతుందని రాశాడు.

సంబరాలు చేసుకుందాం: రోహిత్

కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఫ్యాన్స్‌ను ఆహ్వానిస్తూ సోషల్ మీడియాలో సందేశాన్ని పోస్టు చేశాడు. ‘వెస్టిండీస్ నుంచి వచ్చేస్తున్నాం. వరల్డ్‌కప్ ఇంటికి వస్తోంది. ఈ ప్రత్యేక సందర్భాన్ని మీతో పంచుకోవాలనుకొంటున్నాం. అందరం కలసి మెరైన్ డ్రైవ్, వాంఖడేలో విక్టరీ సంబరాలు చేసుకొందాం’ అని రోహిత్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. విమానంలో వరల్డ్‌కప్ ట్రోఫీని పట్టుకొని ఉన్న ఫొటోను అతను షేర్ చేశాడు. జట్టులోని మిగతా ఆటగాళ్లు కూడా విమానంలో ఉన్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. కాగా, విండీస్ నుంచి జట్టు రాక కోసం బోయింగ్ 777 విమానాన్ని బీసీసీఐ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.



టీమిండియా షెడ్యూల్ ఇలా...

ఉదయం 6 గం.	ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు రాక
ఉదయం 9 గం.	హోటల్ నుంచి ప్రధాని నివాసానికి
10-12 గం వరకు	ప్రధాని నివాసంలో సత్కారం
మధ్యాహ్నం 2 గం.	ముంబైకి ప్రయాణం
సాయంత్రం 5 గం.	వాంఖడే స్టేడియానికి రాక
5 నుంచి 7 గం వరకు	ఓపెన్ బస్‌లో విక్టరీ పరేడ్
రాత్రి 7 నుంచి 7.30	వాంఖడేలో సత్కార కార్యక్రమం

లాహోర్‌లో భారత్-పాక్ మ్యాచ్!

చాంపియన్స్ ట్రోఫీ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో జరగనున్న చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌ను ఆ దేశ క్రికెట్ బోర్డు పీసీబీ, ఐసీసీకి సమర్పించింది. ఫిబ్రవరి 19న టోర్నీ ఆరంభమై, మార్చి 9వ తేదీన ఫైనల్ నిర్వహించేలా పీసీబీ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. గ్రూప్-ఎలోని భారత్-పాక్ మధ్య మార్చి 1వ తేదీన లాహోర్‌లో మ్యాచ్ నిర్వహిస్తామని పీసీబీ షెడ్యూల్‌లో తెలియజేసింది. మొత్తం 15 మ్యాచ్‌ల్లో ఏడు లాహోర్, మూడు కరాచీ, ఐదు మ్యాచ్‌లు రావల్పిండిలో నిర్వహిస్తామని పీసీబీ తెలిపింది. చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌పై బీసీసీఐకి ఐసీసీ సమాచారమిచ్చింది. అయితే, రాజకీయ కారణాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, నిర్ణయం వెల్లడిస్తామని బీసీసీఐ బదులివ్వడంతో పాక్‌లో భారత జట్టు పర్యటనపై సస్పెన్స్ కొనసాగుతోంది.

క్వార్టర్స్‌కు టర్కీ

2-1తో ఆస్ట్రియాపై గెలుపు
యూరో కప్



డిమిరల్

లీప్‌జిగ్ (జర్మనీ): మెరిహ్ డిమిరల్ డబుల్ ధమాకాతో టర్కీ యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మంగళవారం రాత్రి జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో టర్కీ 2-1తో ఆస్ట్రియాను ఓడించింది. ఆట ఆరంభమైన తొలి నిమిషంలోనే లభించిన పెనాల్టీ కార్నర్ ద్వారా డిమిరల్ గోల్ చేసి ప్రత్యర్థికి షాకిచ్చాడు. 59వ నిమిషంలో మరో కార్నర్ కిక్‌ను మెరిహ్ హెడర్ ద్వారా గోల్‌లోకి పంపి టర్కీని 2-0తో నిలబెట్టాడు. అయితే, 66వ నిమిషంలో ఆస్ట్రియా ఆటగాడు మైకేల్ గ్రెగోరిష్ గోల్ చేసి ఆధిక్యాన్ని తగ్గించాడు.

క్వార్టర్స్‌లో ఎవరెవరు?

శుక్రవారం
స్పెయిన్ X జర్మనీ (రాత్రి 9.30)
పోర్చుగల్ X ఫ్రాన్స్ (రాత్రి 12.30)

శనివారం
ఇంగ్లండ్ X స్విట్జర్లాండ్ (రాత్రి 9.30)
నెదర్లాండ్స్ X టర్కీ (రాత్రి 12.30)

బాయ్‌కాట్‌కు తిరగబెట్టిన క్యాన్సర్

లండన్: ఇంగ్లండ్‌కు చెందిన దిగ్గజ క్రికెటర్, ప్రసిద్ధ కామెంటేటర్ సర్ జెఫ్రీ బాయ్‌కాట్ (83)కు గొంతు క్యాన్సర్ తిరగబెట్టింది. దీనికి రెండో వారాల్లో అతడికి శస్త్రచికిత్స చేయనున్నారు. ‘రెండోసారి క్యాన్సర్ నుంచి కోలుకోవాలంటే మంచి వైద్యం చేయించుకోవడంతో పాటు కొంచెం అదృష్టం కూడా కలిసిరావాలి. సర్జరీ విజయవంతమైనా తిరిగి సాధారణ జీవనం గడపడం కష్టమే. అంతా మంచే జరగాలని ఆశిస్తున్నా’ అని తెలిపాడు. కాగా ఈ మాజీ ఓపెనర్ 2002లో జెఫ్రీ తొలిసారి క్యాన్సర్ బారినపడ్డాడు.



జింబాబ్వే చేరిన గిల్ బృందం

హరారే: టీ20 సిరీస్ కోసం శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా బుధవారం జింబాబ్వే చేరుకుంది. ఇక్కడి ఎయిర్‌పోర్టులో అడుగుపెట్టిన కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, సారథి గిల్ సహా జట్టు ఆటగాళ్లందరికీ జింబాబ్వే క్రికెట్ అధికారులు ఘన స్వాగతం పలికారు. జట్టు సభ్యులంతా భారత్ నుంచి నేరుగా వచ్చేయగా, కెప్టెన్ గిల్ మాత్రం న్యూయార్క్ నుంచి ఇక్కడికి వచ్చి జట్టుతో కలిశాడు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా సికందర్ రజా సారథ్యంలోని ఆతిథ్య జింబాబ్వే జట్టుతో టీమిండియా ఈనెల 6న తొలి మ్యాచ్ ఆడనుంది. 14వ తేదీతో సిరీస్ ముగియనుంది.

శ్రీవారి సేవలో మహిళా క్రికెటర్లు

తిరుమల (ఆంధ్రజ్యోతి): టీమిండియా మహిళా క్రికెటర్లు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, షఫాలీ వర్మ, రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, దీప్తీ శర్మ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూల మూర్తిని దర్శించుకున్నారు.



బిజినెస్

రికార్డుల ర్యాలీ ఇలా...

57 ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 75,000 నుంచి 80,000 స్థాయికి చేరుకుంది. 70,000 నుంచి 75,000 మార్క్‌కు చేరేందుకు 80 ట్రేడింగ్ సెషన్లు పట్టింది.

థర్డ్ బెస్ట్ 5000 ర్యాలీ

సూచీకిది మూడో అత్యంత వేగవంతమైన 5,000 పాయింట్ల వృద్ధి.

138 ట్రేడింగ్ సెషన్లలో 70,000 నుంచి 80,000 స్థాయికి ప్రయాణం

ఫాస్టెస్ట్ 10,000

సూచీకిదే అత్యంత వేగవంతమైన 10,000 పాయింట్ల ర్యాలీ.

22.59% గడిచిన ఏడాది కాలంలో సూచీ వృద్ధి.

7,000 ఈ ఏడాదిలో ఇప్పటివరకు లాభపడిన పాయింట్లు

ఐదేళ్లలో డబుల్

కేవలం ఐదేళ్ల కాలంలోనే 40,000 నుంచి 80,000 స్థాయికి చేరుకుంది. అంటే, రెట్టింపైంది. 10,000 స్థాయి నుంచి 40,000 మార్క్‌కు చేరుకునేందుకు మాత్రం 19 సంవత్సరాలు పట్టింది.



సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు.. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్ల ర్యాలీ
రూ.445 లక్షల కోట్లు దాటిన స్టాక్ మార్కెట్ మదుపరుల సంపద

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో సెన్సెక్స్ తొలిసారిగా 80,000 కీలక మైలురాయిని దాటగా.. నిఫ్టీ 24,300 స్థాయిని చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. 80,000 ఎగువనే ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. ఒకదశలో 632.85 పాయింట్ల వృద్ధితో 80,074.30 వద్ద సరికొత్త ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి 545.35 పాయింట్ల లాభంతో 79,986.80 వద్ద స్థిరపడింది. సూచీకిది ఆల్‌టైం గరిష్ఠ ముగింపు. నిఫ్టీ విషయానికొస్తే, ఆరంభ ట్రేడింగ్‌లో 183.4 పాయింట్ల పెరుగుదలతో 24,307.25 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 162.65 పాయింట్ల లాభంతో 24,286.50 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. అప్రతిహతంగా కొనసాగుతున్న ర్యాలీలో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.445.43 లక్షల కోట్లకు చేరుకుంది. అమెరికన్ కరెన్సీలో ఇది 5.33 లక్షల కోట్ల డాలర్లకు సమానం. మరిన్ని ముఖ్యాంశాలు..

- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 23 లాభపడగా.. 6 నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్ షేరు యథాతథంగా ముగిసింది. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ షేరు 2.49 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది..
- ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఒకదశలో 3.54 శాతం పెరిగి రూ.1,791.90 వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి షేరు 2.18 శాతం లాభంతో రూ.1,768.35 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ విలువ మరో రూ.28,758 కోట్లు పెరిగి మొత్తం రూ.13.45 లక్షల కోట్లు దాటింది.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.86 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాలవారీ సూచీల్లో బ్యాంకెక్స్ 1.75 శాతం వృద్ధి చెందగా, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ 1.55 శాతం పెరిగింది. టెలికాం, సర్వీసెస్, ఇండస్ట్రియల్స్ సూచీలూ ఒక శాతానికి పైగా రాణించాయి.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక పైసా తగ్గి 83.49 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒకదశలో 86.25 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. కాగా, ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు 2,359 డాలర్లు, సిల్వర్ 30.62 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

వ్రజ్ ఐరన్‌కు 22 శాతం లిస్టింగ్ లాభం: వ్రజ్ ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్ లిస్టింగ్‌కు మంచి స్పందన లభించింది. కంపెనీ తనషేర్లను బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.207తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 15.94 శాతం ప్రీమియంతో రూ.240 వద్ద లిస్టయింది. తొలిరోజు ట్రేడింగ్ నిలిచేసరికి 21.71 శాతం లాభంతో రూ.251.95 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ ప్రస్థానం

మైలురాయి	తేదీ
10,000	2006 ఫిబ్రవరి 7
20,000	2007 డిసెంబరు 11
30,000	2017 ఏప్రిల్ 26
40,000	2019 జూన్ 3
50,000	2021 ఫిబ్రవరి 3
60,000	2021 సెప్టెంబరు 24
70,000	2023 డిసెంబరు 11
71,000	2023 డిసెంబరు 15
72,000	2023 డిసెంబరు 27
73,000	2024 జనవరి 15
74,000	2024 మార్చి 6
75,000	2024 ఏప్రిల్ 9
76,000	2024 మే 27
77,000	2024 జూన్ 10
78,000	2024 జూన్ 25
79,000	2024 జూన్ 27
80,000	2024 జూలై 3

వచ్చే మూడేళ్లు రిటర్నులు అంతంతే!

ఈక్విటీ మార్కెట్లు వచ్చే మూడేళ్ల ఇన్వెస్టర్లకు పంచే రిటర్నులు గత మూడేళ్ల స్థాయిలో ఉండకపోవచ్చని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఎంఎఫ్ ఎమర్జింగ్ మార్కెట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ ఆర్ జానకిరామన్ అన్నారు. అయినప్పటికీ, వచ్చే మూడేళ్లలో ఈక్విటీ మార్కెట్లు గణ్యమైన, ఇతర అసెట్ క్లాస్‌లతో పోలిస్తే మెరుగైన ప్రతిఫలాలు అందించగలవని ఆయన అభిప్రాయపడ్డారు.



ఆఫీసు స్పేస్ డిమాండ్
ఆల్‌టైమ్ హై

హైదరాబాద్‌లో 40 శాతం పెరిగిన లీజు ఒప్పందాలు

న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రథమార్ధంలో హైదరాబాద్ సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఆఫీసు లీజు ఒప్పందాలు రికార్డు స్థాయికి చేరాయి. ఈ కాలంలో ఈ నగరాల్లో 3,35,40,000 చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 29 శాతం ఎక్కువని ప్రముఖ రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. దీంతో ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో 6.5 కోట్ల నుంచి ఏడు కోట్ల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ లీజుకు ఒప్పందాలు జరిగే అవకాశం ఉందని సంస్థ అంచనా.

హైదరాబాద్ అదుర్స్: గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో ఆఫీసు స్పేస్ లీజు ఒప్పందాల వృద్ధిరేటు మరింత ఎక్కువగా నమోదైంది. 50 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ లీజుకు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 36 లక్షల ఎస్ఎఫ్‌టీతో పోలిస్తే ఇది 40 శాతం ఎక్కువని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ తాజా నివేదికలో తెలిపింది. ఎంఎన్‌సీలతో పాటు అనేక ప్రముఖ కంపెనీలు హైదరాబాద్‌లో తమ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఎగబడుతున్నాయి. దీంతో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్ కళకళలాడుతోంది.

రూ.21,047 కోట్ల పెట్టుబడులు : గత ఆరు నెలల్లో సంస్థాగత మదుపరులు భారత రియల్ ఎస్టేట్ రంగంలో 252 కోట్ల డాలర్లు (సుమారు రూ.21,047 కోట్లు) పెట్టుబడి పెట్టారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 20 శాతం ఎక్కువని కొలియర్స్ ఇండియా తెలిపింది.

అప్రావా ప్రాజెక్టుకు పీఈఎల్ మాడ్యూళ్లు

హైదరాబాద్: ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్, సోలార్ మాడ్యూళ్ల తయారీలోని ప్రీమియెర్ ఎనర్జీస్ లిమిటెడ్ 350 మెగావాట్ల మాడ్యూళ్ల సరఫరా కోసం అప్రావా ఎనర్జీతో ఒప్పందం కుదుర్చుకుంది. అప్రావా ఎనర్జీస్ రాజస్థాన్‌లో నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టుకు ఈ మాడ్యూళ్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. తమ అనుబంధ సంస్థలు ప్రీమియెర్ ఎనర్జీస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రీమియెర్ ఎనర్జీస్ ఫొటో వోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్టు పీఈఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. అప్రావా ఎనర్జీ, ప్రీమియెర్ ఎనర్జీ మధ్య ఇదే తొలి భాగస్వామ్యమని కంపెనీ వెల్లడించింది.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ రూ.230 కోట్ల పెట్టుబడులు

ప్లాంట్ల నవీకరణ, కొత్త టెక్నాలజీల కోసం వినియోగం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్యాకేజింగ్ గ్లాస్ ఉత్పత్తుల తయారీ కంపెనీ ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లిమిటెడ్ రూ.230 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. గ్రూప్‌లో ప్రధానంగా ఉన్న ఏజీఐ గ్లాస్‌ప్యాక్, ఏజీఐ ప్లాస్టిక్‌లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ సీఈఓ రాజేశ్ ఖోస్లా వెల్లడించారు. ఈ కంపెనీల్లోని ఫర్నేస్‌లను నవీకరించటం, కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలను అమలు చేసేందుకు ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ తెలంగాణలోని భువనగిరి, బోరబండ, ఇస్నాపూర్‌లతో పాటు కర్ణాటక, ఉత్తరాఖండ్‌లలో ప్లాంట్లను నిర్వహిస్తోందన్నారు. కాగా భువనగిరి ప్లాంట్ కంపెనీకి చాలా కీలకమైనదని, ఇందులో స్పెషాలిటీ గ్లాస్ ఉత్పత్తులతో పాటు ఫార్మా, ఆల్కహాల్ బెవరేజెస్, ఎఫ్ఎంసీజీ కంపెనీలకు అవసరమైన ఉత్పత్తులను తయారుచేస్తున్నట్లు ఖోస్లా చెప్పారు. భువనగిరి ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 154 టన్నులని ఆయన పేర్కొన్నారు. ఇంజక్షన్ వయల్స్‌కు అవసరమైన చిన్న గ్లాస్ బాటిళ్ల నుంచి కెమికల్ పరిశ్రమకు అవసరమైన పెద్ద సైజు గ్లాస్ ఉత్పత్తులను ఇక్కడ తయారు చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా గ్లాస్ ప్యాకేజింగ్ రంగం కోసం ప్రత్యేకంగా ఆర్ అండ్ డీ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏటా 25 శాతం వృద్ధి

గ్లోబల్ గ్లాస్ ఉత్పత్తుల పరిశ్రమ ప్రస్తుతం రూ.5.5 లక్షల కోట్ల స్థాయిలో ఉందని, 2032 నాటికి ఇది 8 లక్షల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా దేశీయంగా ఏటా 25 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందన్నారు. ప్రజల్లో పర్యావరణం పట్ల అవగాహన పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణమని ఆయన తెలిపారు. కాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా దివాలా ప్రక్రియలో ఉన్న హిందుస్థాన్ నేషనల్ గ్లాస్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఖోస్లా తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, త్వరలోనే ఇది కొలిక్కి వస్తుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.2,421 కోట్లుగా ఉందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ 25 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నట్లు ఖోస్లా తెలిపారు.

‘కూ’త ఆగింది

న్యూఢిల్లీ: ట్విట్టర్‌కు దేశీయ ప్రత్యామ్నాయంగా వచ్చిన సోషల్ మీడియా వెబ్‌సైట్ ‘కూ’ మూతపడింది. నిధుల కొరత, భాగస్వామ్యం కోసం ఇతర సంస్థలతో జరిపిన చర్చలు విఫలమవడం ఇందుకు ప్రధాన కారణమని కూ తెలిపింది. 2021లో ట్విట్టర్‌పై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయడంతో అనేక మంది రాజకీయ నేతలు, మంత్రులు, ఉన్నతాధికారులు, సెలబ్రిటీలు కూ సభ్యులయ్యారు. తర్వాత ఆ వివాదం సద్దుమణగడంతో ‘కూ’ హవా క్రమంగా సన్నగిల్లి చివరికి దుకాణం మూసేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

7సీస్‌లో ఏఐ డివిజన్

హైదరాబాద్: గేమింగ్ డెవలప్‌మెంట్‌లోని 7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ గేమ్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా ఏఐ (కృత్రిమ మేధ) డివిజన్ ఏర్పాటు చేసింది. 7 సీస్ ఏఐ పేరిట ఏర్పాటు చేసిన ఈ విభాగం ఏఐ ఆధారిత గేమింగ్ టూల్‌ను అభివృద్ధి చేస్తుంది. ఇప్పటికే ఈ విభాగంలో ప్రతిభావంతులైన నిపుణులను నియమించారు. వారు ఏఐ టెక్నాలజీలను గేమ్ డెవలప్‌మెంట్‌తో అనుసంధానం చేసే కృషి ప్రారంభించారని కంపెనీ సీఈఓ ఎల్.మారుతీ శంకర్ అన్నారు. ఈ వ్యూహాత్మక చర్య గేమ్ డెవలప్‌మెంట్‌లో నాణ్యతను, ఉత్పాదకతను పెంచుతుందన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,350 ▼	66,300 ▼	96,000 ▲
ముంబై	72,230 ▲	66,160 ▲	89,700 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	118
వరంగల్	107	గుంటూరు	118
కరీంనగర్	107	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	120
కర్నూలు	107	నెల్లూరు	120
విశాఖపట్నం	119	అనంతపురం	118
గోదావరి	118		


www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 4-7-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupati | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**

132 సీట్ల బస్సు



- విమానం తరహాలో సీట్లు.. 'బస్ హోస్టెస్' సేవలు కూడా
- డీజిల్ బస్సుతో పోలిస్తే నిర్వహణ వ్యయం తక్కువ
- కాలుష్యం, రవాణా ఖర్చు తగ్గించడమే లక్ష్యం
- పైలట్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

10



"అమరావతిలో ప్రభుత్వం కింద ఎనిమిది వేల ఎకరాల భూమి ఉంది. మేం దిగిపోయే సమయానికి అక్కడ ఎకరం రూ.పది కోట్లు పలుకుతోంది. రాజధాని కొనసాగి ఉంటే ఆ ధర రూ.ఇరవై కోట్లకు చేరేది. అంతవరకే లెక్క వేసినా ప్రభుత్వం వద్ద ఉన్న భూమికి రూ.ఒక లక్షా అరవై వేల కోట్ల ఆదాయం వచ్చి ఉండేది. ఎవరినీ అడగాల్సిన పని లేకుండా రాజధాని నిర్మాణం జరిగిపోయేది."

"గతంలో 132 సంస్థలు అమరావతికి వస్తామంటూ ముందుకు వచ్చాయి. ప్రభుత్వం మారిన తర్వాత 128 సంస్థలు వెనక్కు వెళ్లిపోయాయి. సింగపూర్ కన్సార్షియం కొనసాగి ఉంటే పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించేది. వాళ్లనూ పంపించివేశారు. వారినందరినీ మళ్లీ పిలుస్తున్నాం."

"పింఛన్ల పంపిణీ సమయంలో మావాళ్లు నా దగ్గరకు వచ్చారు. కొందరు వైసీపీ కార్యకర్తలు అక్రమంగా పెన్షన్లు తీసుకుంటున్నారనీ, వారిని ఆపాలని వారు కోరారు. వాళ్లు ఉన్నా ఫర్వాలేదని చెప్పి, నేను అందరికీ డబ్బులు ఇప్పించాను. మా ఆలోచనా విధానం ఇలా ఉంటుంది."

- చంద్రబాబు

ఆకాశమే హద్దుగా.. అమరావతి!

రాజధాని అభివృద్ధి నిరంతర ప్రక్రియ

వెళ్లిపోయిన సంస్థలను రప్పిస్తాం

- ఫలానా తేదీ లోపు నిర్మిస్తామని చెప్పబోం
- అందరి సహకారంతోనే ముందుకెళతాం
- సింగపూర్ కన్సార్షియంను ఆహ్వానిస్తాం
- ఎవరేమి సలహాలు ఇచ్చినా స్వీకరిస్తాం
- రాజధానిని ఎవరూ మార్చకుండా చట్టం
- రాజధాని కొనసాగిఉంటే ప్రభుత్వానికే రూ. 1.60 లక్షల కోట్ల ఆదాయం ఉండేది
- అప్పటి పనులకు బకాయిలు చెల్లించాలి
- కానీ, ఆర్థిక పరిస్థితి అధ్వానం.. ఖజానా ఖాళీ
- అయినా వెనుకాడం.. కష్టమైనా చేసి చూపుతాం
- అమరావతిపై శ్వేతపత్రం విడుదలచేసిన బాబు

● ఒరిజినల్ ప్లాన్ అమలుచేసి ఉంటే..



"2019-2024 మధ్య కాలంలో అమరావతి ఒరిజినల్ ప్లాన్ అమలు చేసి ఉంటే ప్రపంచస్థాయి రాజధాని రాష్ట్రానికి ఉండేది. 50 వేల నుంచి ఒక లక్ష మంది దాకా ప్రజలు రాజధాని ప్రాంతంలో నివసిస్తూ ఉండేవారు. ఏడు లక్షల ఉద్యోగాల కల్పన జరిగేది. రూ.రెండు లక్షల కోట్ల జీడీపీ కలిసేది. ఏటా రూ.10 వేల కోట్ల ఆదాయం పన్నుల ద్వారా రాష్ట్రానికి లభించేది. ఏటా ఆ రాబడి 15 శాతం పెరిగేది.. తద్వారా ఆస్తుల విలువ పెరిగి.. రాష్ట్రమంతా సంపద పెరిగేది"

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆకాశమే హద్దుగా రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజధాని ఫలానా తేదీకి పూర్తవుతుందని లక్ష్యాలు పెట్టలేమని, అదొక నిరంతర ప్రక్రియ అని వివరించారు. "హైదరాబాద్‌లో సైబరాబాద్ పేరుతో ఒక కొత్త నగరం నిర్మాణం జరిగింది. మొదట హైటెక్ సిటీ పేరుతో ఒక భవనం మాత్రమే నిర్మించాం. తర్వాత ఐటీ కంపెనీల కోసం అనేక భవనాలు వచ్చాయి. అవుటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం

మిగతా 11వ పేజీలో...

అమరావతి, పోలవరమే ప్రధాన ఎజెండా

- నేడు, రేపు చంద్రబాబు హస్తినలో బిజీబిజీ
- సీఎంగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఢిల్లీకి
- నేడు ప్రధాని, కేంద్ర హోం మంత్రితో భేటీ
- నిర్మలతో పాటు డజన్ మంది మంత్రులతోనూ
- పార్టీ ఎంపీలకు ఢిల్లీలో విభాగాల వారీ బాధ్యతలు

అరబిందో ఆటలు..

కట్టిస్తామని నాడు టీడీపీ హెచ్చరికలు

- దాని అక్రమాలపై మరిప్పుడు ఏం చేస్తారు?
- కాకినాడ సెజ్ కోసం జగన్ అరాచకపర్వం
- బల్క్‌డ్రగ్‌పార్కు ఏర్పాటుకు అడ్డగోలు వ్యూహం
- ఫార్మా కంపెనీ అరబిందోకు 10వేల ఎకరాల సెజ్
- వాటాలు అమ్మేలా సెజ్‌లోని కార్పొరేట్లకు బెదిరింపులు
- జీఎమ్ఆర్‌పై ఒత్తిడి తెచ్చి...51% వాటా లాగేశారు
- కేవీరావును బెదిరించి డీప్ వాటర్ పోర్టు స్వాహా
- కాకినాడ పోర్టులోని వాటాలూ లాగేసుకున్నారు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

అ... అమ్మ! జగన్‌కు మాత్రం అ... అంటే అరబిందో! అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఇదే మంత్రం! ఫార్మా సెజ్ కట్టబెట్టారు. డీప్ వాటర్ పోర్టును రాసిచ్చారు. కాకినాడ పోర్టులో వాటాలూ లాగేసుకున్నారు. ఇతర పారిశ్రామికవేత్తలను బెదిరించి మరీ అరబిందోకు అడ్డగోలుగా మేళ్లు చేశారు. పదివేల ఎకరాల్లో విస్తరించిన కాకినాడ సెజ్‌ను

మిగతా 9వ పేజీలో...

వైసీపీ పాలనలో అధికారం అండతో చేయని అరాచకం లేదనీ, అస్మదీయులకు దోచిపెట్టారని ఐదేళ్లూ టీడీపీ నేతలు గట్టి స్వరం వినిపించారు. అదానీ, అరబిందోల కన్నుపడిన ప్రతిదీ వారి పరం అయిపోతోందని ఆనాడు ఆగ్రహించారు. ఏదైనా బెదిరించి తన్నుకుపోవడమే తెలిసిన జగన్.. అదే పద్ధతుల్లో కాకినాడ పోర్టును అరబిందోకు రాసి ఇచ్చేవారని తెలుగుదేశం నేతలు అప్పట్లో మండిపడ్డారు. చివరకు కార్పొరేట్లను సైతం బెదిరించి, లొంగదీసుకునే తెంపరితనానికి వైసీపీ నాయకులు దిగజారారని ధ్వజమెత్తారు. అనుభవం లేని అరబిందోకు 108 అంబులెన్స్ స్టీరింగ్ అప్పగించి, రోగుల ప్రాణాలతో ఆటాడుకుంటున్నారనీ, తాము అధికారంలోకి రాగానే వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపిస్తామని ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ నేతలు ప్రకటించారు. మరిప్పుడు అధికారంలోకి వచ్చారు. అడ్డగోలుగా రూ.వందల కోట్లను అరబిందోకు దోచిపెట్టిన వ్యవహారాలపై ఏం చేస్తారు? ఐదేళ్లుగా చెబుతున్నట్టు అరబిందో అక్రమాలపై చర్యలకు సిద్ధమవుతారా.. లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



జగన్ అక్రమాస్తుల కేసుల్లో
రోజువారీ విచారణ
- సీబీఐ కోర్టుకు తెలంగాణ హైకోర్టు ఆదేశం
- ఇప్పటిదాకా పురోగతి లేదని వ్యాఖ్య 12
- దశాబ్దం దాటినా తేలని 'డిశ్చార్జి పిటిషన్లు'



11

సవాంగ్ గుడ్ బై
- ఏపీపీఎస్సీ చైర్మన్ పదవికి రాజీనామా
- వెంటనే ఆమోదించిన ప్రభుత్వం
- గౌతం సవాంగ్‌పై అనేక ఆరోపణలు
- 2018 గ్రూప్-1లో భారీగా అక్రమాలు



పోలీసుల అదుపులో వైసీపీ కార్యకర్తలు

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో
అప్పిరెడ్డి అనుచరుల అరెస్ట్
- రెండేళ్ల కిందట పట్టపగలే టీడీపీ ఆఫీసుపై దాడి
- గుంటూరులో ఐదుగురు అదుపులోకి
- న్యాయాధికారి ఎదుట హాజరు 12
- నిందితుల తరఫున 10 మంది లాయర్ల వాదనలు
- నేడో రేపో లేళ్ల, నందిగం, అవినాశ్ వంతు!?

పీసీబీ ఫైళ్లు దహనం

కృష్ణా కరకట్టపై చీకట్లో కాల్చివేత.. గమనించి మంటలార్పిన స్థానికులు

- ప్రభుత్వ కారులో వచ్చి సిబ్బంది నిర్వాకం
- వారిని వెంబడించి పట్టుకున్న టీడీపీ శ్రేణులు
- కారును, అందులోని వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనా స్థలానికి కృష్ణా కలెక్టర్, ఎస్పీ

పెనమలూరు, జూలై 3: అక్రమాల గుట్టు బయటకు వస్తుందన్న భయంతో అధికారిక ఫైళ్లను తగులబెట్టేస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఇంతకు బరితెగించడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేశ్‌లకు సంబంధించి

మిగతా 10వ పేజీలో...



తగులబడుతున్న ఫైళ్లు, సగం కాలిన డాక్యుమెంట్లు



11

ఉచితంగా ఇసుక
త్వరలో నూతన పాలసీ ప్రకటన
- 8 లేదా 9 తేదీన ఉత్తర్వులు
- ప్రజలందరికీ అందుబాటులోకి
- రవాణా, లేబర్ చార్జీలు భరించాలి
- 3 నెలలకు కోటి టన్నులు అవసరం
- స్టాక్‌యార్డుల్లో 35 లక్షల టన్నులే ఉంది
- జేపీ వెంచర్స్ బకాయి రూ.700 కోట్లు
- అక్రమాలను బయటకు తీస్తాం
- బాబు సమీక్ష తర్వాత మంత్రి కొల్లు ప్రకటన

టెట్, డీఎస్సీకి మరింత గడువు
12
- ఒక్కో పరీక్షకు మూడు నెలల సమయం
- అభ్యర్థులు సన్నద్ధం కావడానికి అవకాశం
- టెట్ ముగిశాక మెగా డీఎస్సీ నోటిఫికేషన్
- ఉపాధ్యాయుల అప్రెంటీస్ విధానం రద్దు
- అభ్యర్థుల విజ్ఞప్తులపై ప్రభుత్వ నిర్ణయం




పట్టిసీమ నుంచి ప్రవహిస్తున్న గోదావరి నీళ్లు

ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం..
- ప్రాధాన్యతాక్రమంలో ప్రాజెక్టులన్నీ పూర్తి
- బాబు ముందుచూపునకు పట్టిసీమే నిదర్శనం
- గోదారి జిల్లాలకు, సీమకు కలిసివచ్చేలా నిర్మాణం
- జల పథకాలను భ్రష్టు పట్టించిన జగన్ నిర్వాకం
- పట్టిసీమ, తాడిపూడి, పుష్కర 1, 2, పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు నీరు విడుదల చేసిన మంత్రి నిమ్మల 11

అందుకే ఓడించారు

తప్పుదోవ పట్టించినందుకు తిరస్కరించారు.. అభివృద్ధికే ప్రజలు ఓటేశారు





రాజ్యసభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ; సభ నుంచి వాకౌట్ చేస్తున్న ప్రతిపక్ష ఎంపీలు

- రాజ్యాంగాన్ని అవమానించింది కాంగ్రెస్సే..
- మూడోసారి ఓడినా తీరు మారలేదు!
- అబద్ధాలు ప్రచారం చేసే వారికి.. నిజాలను వినే శక్తి ఉండదు
- మణిపూర్ చిచ్చును రాజేసిన వారే.. ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు
- రాజ్యసభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- ప్రతిపక్ష సభ్యుల వాకౌట్
- ప్రమాదకర సంప్రదాయమన్న ధన్‌ఖడ్
- మోదీ అబద్ధాలు చెబుతున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బూటకపు ప్రచారాన్ని తిరస్కరించారని, తమను తప్పుదోవ పట్టించేవారిని ఓడించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. పని చేసే వారినే గెలిపించారన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చకు బుధవారం ఆయన సమాధానం ఇచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం ఆరు దశాబ్దాల తర్వాత ఇదే మొదటి సారి అని మోదీ చెప్పారు. భారతదేశం స్వయంసమృద్ధి, అభివృద్ధి సాధించేందుకే ప్రజలు మళ్లీ ఎన్డీయేకు అధికారం కట్టబెట్టారని తెలిపారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకే ఈ తీర్పు ఇచ్చారన్నారు. అధికారంలో ఎవరున్నా దేశం అభివృద్ధి చెందుతుందని, అందులో ఎవరి గొప్పతనమూ లేదని కాంగ్రెస్ చేసిన ప్రకటనను ఆయన తప్పుపట్టారు. పరాజయాల్లో హ్యాట్రిక్ కొట్టినా.. వారి తీరు మారలేదని ఎద్దేవా చేశారు. గతంలో పరిపాలనను గాలికొదిలేసి రిమోట్ కంట్రోల్ ద్వారా అధికారం చలాయించారని కాంగ్రెస్ నేత సోనియాను ఉద్దేశించి

మిగతా 10వ పేజీలో...

నీట్‌పై నేడు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్





పిఠాపురంలో వారాహి విజయోత్సవ సభలో పవన్

అసెంబ్లీ గేటు తాకలేవన్నారు

ప్రజలే సీరియస్‌గా తీసుకుని గెలిపించారు: పవన్

- ఎన్నికల్లో కూటమికి వచ్చిన బలం దేశ రాజకీయాలను మార్చేసింది
- రక్తం చిందించకుండా ఓటుతో అరాచక ప్రభుత్వాన్ని నేలకూల్చారు
- చంద్రబాబు అపార అనుభవంతోనే ఒకటో తేదీన పింఛన్లు, జీతాలు
- కొన్నాళ్ల తర్వాత షూటింగ్‌లకు వెళ్తా
- డిప్యూటీ సీఎం పదవి ప్రజలకు అంకితం
- పిఠాపురం సభలో జనసేనాని

కాకినాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ గేటు తాకలేవని వైసీపీ నేతలు నన్ను ఎద్దేవా చేశారు.. సభలో ఎలా అడుగుపెడతావో చూస్తామని సవాళ్లు విసిరారు. కానీ గేట్లు బద్దలు కొట్టుకుంటూ వస్తానన్న మాటలను పిఠాపురం ప్రజలు నిజం చేశారు. వైసీపీ నేతల బెదిరింపులను వారే సీరియస్‌గా తీసుకుని గెలిపించారు' అని ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను భారీ మెజారిటీతో గెలిచిన పిఠాపురంలో బుధవారం జరిగిన వారాహి విజయోత్సవ సభలో

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అతివృష్టి... అనావృష్టి...

గత రెండేళ్లుగా ఆలస్యంగా వస్తున్న నైరుతీ రుతుపవనాలు ఈ ఏడాది చాలా త్వరగా వచ్చాయి. వర్షాలు సమృద్ధిగా పడతాయని అందరూ ఆశించారు. కానీ జూన్‌లో ఆశించిన మేర వర్షాలు కురవలేదు. దేశవ్యాప్తంగా జూన్‌లో వర్షపాతం సాధారణంతో పోలిస్తే 11 శాతం తక్కువగా ఉందని తాజా గణాంకాలు చెబుతున్నాయి. అయితే వర్షపాతం లోటు కంటే వివిధ ప్రాంతాల్లో వర్షపాత స్థాయిల్లో ఉన్న భారీ వ్యత్యాసాలు ఎక్కువగా కలవరపెడుతున్నాయి. దేశంలో 49 శాతం జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. వాటిలో 18 శాతం జిల్లాల్లో వర్షపాతం లోటు 60 శాతానికి పైగా ఉంది. అయితే ఇదే సమయంలో కొన్ని ప్రాంతాలను వరదలు ముంచెత్తుతున్నాయి. జూన్‌లో వర్షాలు తక్కువగా ఉండే లద్దాఖ్ ప్రాంతంలో ఈసారి సాధారణం కంటే 385 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైంది. మొన్నటిదాకా తీవ్రమైన కరువుతో నీటి ఎద్దడిని ఎదుర్కొన్న రాజధాని ఢిల్లీ ఇప్పుడు వరదలతో అతలాకుతలమవుతోంది. సాధారణంగా మంచి వర్షాలు పడే కేరళలో ఈ ఏడాది 25 శాతం లోటు కనిపిస్తోంది.

మొన్న వేసవిలో భారతదేశం గత వందేళ్లలో ఎన్నడూ ఎరుగనంత తీవ్రమైన ఎండల్ని చవిచూసింది. అనేక ప్రాంతాల్లో 50 డిగ్రీలు దాటిన రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాడ్పుల వల్ల వందల మంది ప్రాణాలు కోల్పోయారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఢిల్లీ, బెంగళూరు సహా అనేక ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్ర స్థాయికి చేరింది. ఇప్పుడు వర్షాకాలం వచ్చినా కొన్ని చోట్ల అతివృష్టి, కొన్నిచోట్ల అనావృష్టి కనిపిస్తున్నాయి. భూగోళం వేడెక్కడం, తద్వారా వస్తున్న వాతావరణ మార్పుల వల్లే ఈ వైపరీత్యాలు సంభవిస్తున్నాయని నేడు సామాన్య ప్రజలకు కూడా అర్థమవుతోంది. కానీ తాజా లోక్‌సభ ఎన్నికల్లో గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులపై రాజకీయ పార్టీల్లోగానీ, సామాన్య ప్రజల్లోగానీ ఎలాంటి చర్చ జరగలేదు. న్యూజిలాండ్‌లోను, కొన్ని ఐరోపా దేశాల్లోను పర్యావరణ సమస్యలు ఎన్నికల్లో ప్రధానాంశాలు అవుతుంటాయి. పర్యావరణపరంగా యాభై, అరవై ఏళ్ల తర్వాత జరగబోయే పరిణామాలు కూడా ఎన్నికల రాజకీయాల్లో చర్చకు వస్తుంటాయి. కానీ మన ఎన్నికలు మాత్రం ఎక్కువగా మతపరమైన, కులపరమైన అంశాల చుట్టే తిరిగాయి. బహిరంగ సభల్లో, రోడ్ షోల్లో వాతావరణ మార్పుల ఊసే ఎక్కడా వినిపించలేదు.

భారతదేశానికి మూడు వైపుల సముద్రం, ఒకవైపు హిమాలయాలు ఉన్నాయి. ఈ కారణంగా వాతావరణ మార్పులతో మన దేశం అత్యధిక నష్టాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. భూగోళం వేడెక్కడం వల్ల సముద్ర మట్టాలు పెరుగుతాయి. దానివల్ల తీర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు సాగు యోగ్యం కాకుండా పోతాయి. తాగునీటి సమస్య ఏర్పడుతుంది. డయేరియా, కలరా వంటి వ్యాధులు ప్రబలుతాయి. హిమానీనదాలు కరిగిపోవడం వల్ల సింధు, బ్రహ్మపుత్ర నదులు ఉగ్రరూపం దాల్చి వరదలతో ముంచెత్తుతాయి. తీవ్రమైన కరవులు, లేదంటే తీవ్రమైన వరదలు ఏర్పడతాయి. ఈ రకమైన వాతావరణాన్ని మనం ఇప్పటికే చవిచూస్తున్నాం. గత ఏడాది కాలంలో దేశంలోని 90 శాతం ప్రాంతాల్లో ఇటువంటి విపరీతపు వాతావరణ పోకడలు కనిపించాయని ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ తన తాజా నివేదికలో తెలిపింది. అయినా మన ఎన్నికల రాజకీయాల్లో ఇవి చర్చనీయాంశాలు కాలేదు.

ప్రధాన జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ తమ మేనిఫెస్టోల్లో గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల గురించి కొంత ప్రస్తావించాయి. శిలాజేతర ఇంధనాల వాడకం ఇప్పటికే 44 శాతం ఉందని, దీనిని మరింత పెంచుతామని ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ తన మేనిఫెస్టోలో తెలిపింది. 500 గిగావాట్ల పునర్వినియోగ ఇంధన ఉత్పత్తి తమ లక్ష్యమని చెప్పింది. కానీ అందుకు ఎలాంటి గడువునూ పేర్కొనలేదు. కాలుష్యాన్ని అరికట్టడం కోసం విద్యుత్ వాహనాలను విరివిగా వాడుకలోకి తెస్తామన్నది కానీ థర్మల్ విద్యుదుత్పత్తి ద్వారా ఏర్పడే కాలుష్యం గురించి మాట్లాడలేదు. దేశంలో బొగ్గు వినియోగం నానాటికీ పెరుగుతూనే ఉంది. 2023లో భారత్‌లో బొగ్గు వినియోగం మొత్తం ఉత్తర అమెరికా, ఐరోపాల వినియోగం కంటే ఎక్కువగా ఉంది.

గ్లోబల్ వార్మింగ్‌ను, వాతావరణ మార్పుల్ని అడ్డుకోవడానికి ప్రభుత్వాలు భవిష్యత్తులో భారీఎత్తున చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి చర్యలకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుంది. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఆయా అంశాలను ప్రజల్లో చర్చకు పెట్టకపోతే, వాటికి పరిష్కారాలను ఆలోచించకపోతే, వాటిపై ప్రజల్లో ఏకాభిప్రాయాన్ని నిర్మించకపోతే రేపు ఎలాంటి దిద్దుబాటు చర్యలైనా తీసుకోవడం చాలా కష్టమవుతుంది. కానీ మన పార్టీల్లో ఆ అవగాహన కానీ, ఆసక్తి గానీ కనిపించకపోవడం విచారకరం. ప్రకృతి వైపరీత్యాల అతివృష్టిని రాజకీయ శ్రద్ధాసక్తుల అనావృష్టితో ఎదుర్కోవడం అసంభవం.

ఆధునికులం, నాగరికులం కదా, అట్లా ఉండలేమా?



పార్లమెంటులో రాహుల్‌గాంధీ 'నఫ్రత్'ను వ్యతిరేకిస్తూ ప్రసంగాలు చేస్తారు కానీ, క్షేత్రస్థాయిలో ఆ వైఖరి అమలు కావడానికి కాంగ్రెస్ నేతలు ఏమి చేస్తున్నారు? రాత్రి పదకొండు దాటితే దుకాణాలు కట్టేయాలని కొత్త ప్రభుత్వం కట్టడి చేస్తుంటే, నైట్ లైఫ్ లేని హైదరాబాద్ ఎట్లా అభివృద్ధి చెందుతుందని ఆందోళన చెందే సిటీజనులు, నాగరిక జీవనంపై ఫత్వాల జారీని ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదు?



▪ కె. శ్రీనివాస్

సందర్భం

పోయిన శనివారం నాడు హైదరాబాద్‌లో డేనియల్ ఫెర్నాండెజ్ అనే హాస్యకళాకారుడి ప్రదర్శన చివరి నిమిషంలో రద్దు అయింది. "నువ్వు కనుక ప్రదర్శన నిర్వహిస్తే, నా అనుచరులు వచ్చి దేహశుద్ధి చేస్తారు, మరెప్పుడైనా తెలంగాణ రావాలనుకుంటే యాభైసార్లు ఆలోచిస్తావు" అని బీజేపీ శాసనసభ్యుడు టి. రాజాసింగ్ విడియో ప్రకటన ద్వారా ఆ కమెడియన్‌ను హెచ్చరించడమే ఆ రద్దుకు కారణం. రాజాసింగ్ ఆ ప్రకటనలో పోలీసులకు కూడా గట్టి హెచ్చరిక చేశారు. ఆ ప్రదర్శనకు అనుమతి రద్దు చేయకపోతే, "మరెవరన్నా జైన, హిందూ మతాల మీద జోక్ చేయాలంటే వణికిపోయేంతగా ఆ కమెడియన్‌కు బుద్ధి చెబుతాము" అని ఆయన అన్నారు. ఫెర్నాండెజే తన షోను రద్దు చేసుకున్నారు. తన తాజా విడియో జైనులను నొప్పించినందుకు మరోసారి క్షమాపణలు చెప్పారు.

ఇంతకూ ఆ నొప్పించిన విడియో ఏమిటి? బక్రీద్ సందర్భంగా ఢిల్లీలో కొందరు జైనమతస్థులు వీలయినంత జీవహింస నివారించడం కోసమని, ముస్లిముల వేషంలో వెళ్లి, కోతకు అమ్మకానికి ఉన్న 124 మేకలను కొన్నారు. అందుకోసం 15 లక్షల రూపాయలు సమీకరించుకున్నారు. ఈ వార్త అన్ని పత్రికల్లో, చానెళ్లలో ప్రముఖంగా ప్రచారమయింది కూడా. ఈ ఉదంతం మీద ఫెర్నాండెజ్ చేసిన విడియోలో కొన్ని ఛలోక్తులున్నాయి. దాని మీద వెంటనే ఎన్నో అభ్యంతరాలు ఆ విడియో పోస్టు కిందటే వెలువడ్డాయి. కొందరు బెదిరింపులు, దూషణలు కూడా చేశారు. ఆ హాస్య కళాకారుడు తన క్షమాపణలు కూడా అక్కడే చెప్పారు. అయినప్పటికీ, హైదరాబాద్‌లో మాత్రం రాజాసింగ్ ద్వారా స్పందన తీవ్రంగా వ్యక్తమైంది.

అనేక హాస్య స్ఫోరక ఉదంతాలను ప్రస్తావిస్తూ, అనర్గళంగా చమత్కారాలు గుప్పిస్తూ, ప్రేక్షకులను రంజింప చేసే ప్రదర్శనలు పదిపదిహేనేళ్లుగా ప్రాచుర్యం పొందాయి. ఆ విదూషకుల భాషా విన్యాసం, హాస్యప్రియత్వం చూస్తే ముచ్చట కలుగుతుంది. వీరిలో రాజకీయ నిశితత్వం ఉన్న కమెడియన్లు మరింతగా ఆకట్టుకుంటారు. వీరి కళలో వెక్కిరింత ఒక భాగం కాబట్టి, వివిధ భాషా, మత, ప్రాంత శ్రేణుల అలవాట్లను, సాంస్కృతిక విశేషాలను ప్రస్తావించకతప్పదు. హాస్యానికి, అపహాస్యానికి తేడా పాటించక, గీత దాటే కమెడియన్లు కొందరు ఉంటారు. వారు తరచు వివాదాస్పదమవుతారు. ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించేవారు కూడా, ప్రేక్షకులకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ లేకపోవడం వల్ల నిరసనలు ఎదుర్కొంటారు. విస్తృత ప్రజా వర్గాలను ఉద్దేశించి పనిచేసే రకరకాల సమాచార, ప్రసార సాధనాలు, సృజనాత్మక వ్యక్తీకరణలు అన్నీ కూడా ఎక్కడో ఒకచోట ఎప్పుడో ఒకప్పుడు పొరపాటు చేయడమో, కొన్ని వర్గాల నుంచి పొరపాటుగా దాడికి గురికావడమో సహజం. "హాస్య కళాకారుల వృత్తిలోనే ఈ ప్రమాదం ఉన్నది, అందరినీ సమానంగా రంజింపజేయలేము. ఎప్పుడో ఒకసారి అప్రియమైన స్పందనలు ఎదురవుతాయి" అని ఫెర్నాండెజ్ తమ రంగంలోని సమస్యల గురించి చెప్పారు. ఒక కళాకారుడి ప్రదర్శనతో విభేదించవచ్చు, "అభ్యంతరం చెప్పవచ్చు, కానీ, హింస ప్రయోగిస్తామని హెచ్చరించడం సరి కాదు కదా?" అని ఆయన ఆవేదన చెందారు.

నిజంగా మరో మార్గం లేదా? మనోభావాలు గాయపడిన వారు కళాకారులకు తమ నిరసన చెప్పడమూ, ఆ కళాకారుడు తన తప్పును గ్రహించి కానీ, తన చర్యను వివరించి కానీ సమాధానం ఇవ్వడం వంటి ప్రజాస్వామిక పరిష్కారాలు ఇటువంటి సమస్యలకు లభించవా? ఒక కళాకారుడి ప్రదర్శనను రద్దు చేయించడమే న్యాయమైన ప్రతిస్పందనా? తన నియోజకవర్గంలో జైనులు గణనీయంగా ఉండడం రాజాసింగ్ తీవ్ర స్పందనకు ఒక కారణమనుకుందాం. స్వయంగా జైన మతావలంబకులు సమస్యలను ఘర్షణపూర్వకంగా పరిష్కరించుకోవాలనుకునేవారు కాదు. బక్రీద్ బలుల కోసం అంగడిలో ఉన్న మేకలను మారువేషంలో కొనుగోలు చేసి, జీవరక్ష చేద్దామనుకున్నారంటే, వారి సున్నితమైన ఆలోచనా విధానం అర్థం చేసుకోవచ్చు. తమకు రుచించని తీరులో ఛలోక్తులు చెప్పిన కళాకారుడిని ఊళ్లోకి రాకుండా హెచ్చరించాలని వారు కోరుకుంటారా? వాళ్లే కాదు, సాంస్కృతిక జన వైవిధ్యం ఉన్న హైదరాబాద్ నగరం మనోభావాల సున్నితత్వాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను సమతుల్యతతో నిర్వహించ జాలదా? కళలకు, కళాకారులకు, ఎడతెగని సృజనాత్మకతా ఉత్సవాలకు వేదిక అయిన భాగ్యనగరాన్ని నిషేధాల ఆంక్షలతో మలినపరచడం సరిఅయినదేనా?

ప్రభుత్వం ఏమి చేసింది? నిమ్మకు నీరెత్తినట్టు ఊరుకుంది. కళాకారుడు తానే షో రద్దుచేసుకునేట్టు వ్యవహరించింది. గతంలో మరో హాస్యప్రదర్శకుడు మునావర్ ఫరూఖ్ విషయంలో రాజాసింగ్ ఇటువంటి నిషేధ ప్రకటనే చేసినప్పుడు, అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రి కేటీఆర్, మంచో చెడో, ఒక స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. వివిధ భావాల వ్యక్తీకరణకు ఆస్కారం ఇవ్వడం హైదరాబాదీ సంస్కృతిలో భాగమని భావిస్తూ, ప్రదర్శన జరగడానికి మద్దతు ఇచ్చారు. అప్పుడు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన మాట నిజమే కానీ, సాంకేతికంగా అయినా నిషేధం అమలు జరగలేదు. మరి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసింది? అసలు తనకు ఒక సాంస్కృతిక విధానం ఉన్నదా? పార్లమెంటులో వారి నాయకుడు 'నఫ్రత్'ను వ్యతిరేకిస్తూ ప్రసంగాలు చేస్తారు కానీ, క్షేత్రస్థాయిలో ఆ వైఖరి అమలు కావడానికి కాంగ్రెస్ నేతలు ఏమి చేస్తున్నారు? రాత్రి పదకొండు దాటితే దుకాణాలు కట్టేయాలని కొత్త ప్రభుత్వం కట్టడి చేస్తుంటే, నైట్ లైఫ్ లేని హైదరాబాద్ ఎట్లా అభివృద్ధి చెందుతుందని ఆందోళన చెందే సిటీజనులు, నాగరిక జీవనంపై ఫత్వాల జారీని ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదు?

మునావర్ ఫరూఖీ, డేనియల్ ఫెర్నాండెజ్‌ల భావ ప్రకటనా స్వేచ్ఛ బేషరతుదేమీ కాదు. వారు, ఒక సంస్కారాన్ని, మనోభావాల పట్టింపును కళాకారులుగా పాటించవలసిందే. కానీ, ఆ విలువలో సమస్య వచ్చినప్పుడు చట్టం దాన్ని పరిష్కరించాలి. పౌరసమాజం కూడా కల్పించుకుని, ఉభయ పక్షాలకు నచ్చచెప్పాలి. ఉద్రిక్తతలకు ఆస్కారమిచ్చే శక్తులను ఒంటరి చేయాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామనే హెచ్చరికలకు ఆస్కారం ఉండకూడదు. అది ఒక ధోరణిగా మారిపోకుండా చూడాలి.

బీఆర్‌ఎస్ పార్టీకి లోపాయికారీగా బీజేపీతో ఏదన్నా అవగాహన ఉండిందో లేదో కానీ, పైకి మాత్రం ఆ పార్టీ నేత కేసీఆర్ తెలంగాణ మిశ్రమ సంస్కృతిని, వైవిధ్య సామాజిక జీవనాన్ని గొప్పగా ప్రచారం చేసేవారు. అభివృద్ధికి, మత సామరస్యానికి ఉండవలసిన అనివార్య సంబంధం గురించి తనదైన పద్ధతిలో చెప్పేవారు. కొత్త ప్రభుత్వానికి సెక్యులరిజం అన్నది ఒక ఎన్నికల రాజకీయ విలువ మాత్రమేనా అన్న సందేహం కలుగుతున్నది. ఉదాహరణకు, బక్రీద్ ముందూ తరువాతా మెదక్‌లో ఏర్పడిన ఉద్రిక్తత.. ఆ పక్షం నుంచి ఇద్దరిని, ఈ పక్షం నుంచి ఇద్దరిని అరెస్టు చేసి కేసులు పెట్టడమే మతసమానత్వం అనుకుంటే ఎట్లా? జరిగినదానికి బాధ్యులెవరో నిష్పాక్షికంగా కనిపెట్టడం, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తపడడం, ఈ రెంటిలోనూ ప్రభుత్వ వైఫల్యమే కనిపించింది. వెటకారాలు చేసే వృత్తిలో అప్పుడప్పుడు నోరుజారడాలు ఉన్నట్టే, వేర్వేరు మతాలు నివసించే చోట అప్పుడప్పుడు సమస్యలు వస్తాయి. పైగా దేశవ్యాప్తంగా ఉన్న వాతావరణం ప్రభావం తెలంగాణలోనూ ఉంటుంది. ఈ ఉద్రిక్తతలలో జీవించేది, నష్టపోయేది ప్రజలు కదా? ఉభయ మతాల వారితో సంప్రదింపులు జరిపి, ఆవేశాలను చల్లార్చేపని ప్రజాప్రతినిధులు చేయాలి, ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహించాలి. లేదా, అందరికీ ఆమోదయోగ్యులైన పెద్దమనుషులకు ఆ బాధ్యత అప్పగించాలి. క్షేత్రస్థాయిలో సామరస్యాన్ని కాపాడడం అంటే, ప్రజలతో గాఢమైన సంబంధంలో ఉండి, ప్రమాదకర ధోరణులు కనిపిస్తే వాటిని మొగ్గలోనే తుంచేయడం. వాటి గురించిన అవగాహన కలిగించడం. సమానసంఖ్యలో అరెస్టులు చేయడం కాదు.

బీజేపీ వల్ల ప్రమాదం ఉంటుందని, దానిని గెలవనివ్వద్దని ప్రచారం చేస్తూ కొన్ని ప్రజాసంఘాలు లోక్‌సభ ఎన్నికల ముందు ప్రచారం చేశాయి. నేరుగా చెప్పకపోయినా, వారు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేయమని చెప్పినవారే. అది వారి ఇష్టం. దేశంలోని పరిస్థితుల రీత్యా అది అవసరమైన ఎంపిక అని వారనుకున్నారు. ఆ ప్రచారంలో భాగంగా వారొక బస్సు యాత్ర చేశారు. వివిధ ప్రజావర్గాలను వారున్నచోటునే కలుసుకుని తమ అభిప్రాయాలను వివరించడం పద్ధతిగా పెట్టుకున్నారు. రిటైర్డ్ ఐఏఎస్‌లు, ప్రొఫెసర్లు, సామాజిక కార్యకర్తలు ఆ బృందంలో ఉన్నారు. మహబూబ్‌నగర్, వరంగల్ పట్టణాలలో, ఆ బృంద సభ్యులకు అప్రజాస్వామికమయిన, అమర్యాదాకరమైన ఆటంకాలు ఎదురయ్యాయి. అట్లాగే, మత సామరస్యం కోసం గొంతెత్తే కవులు, రచయితలు 'సమూహ' అనే వేదికపై సంఘటితమై తమ రచనలను, అభిప్రాయాలను పంచుకుంటుంటే వరంగల్‌లోనే వారి మీద దౌర్జన్యం జరిగింది. ఈ అన్ని చోట్ల ఆయా అధికారులు తమ పాత్రను నిర్వహించనే లేదు. అప్పటికప్పుడు చెదరగొట్టడమో, బాధితులకే నచ్చచెప్పడమో తప్ప. ఒక వైఖరి తీసుకుని, సమస్య పునరావృతం కాకుండా పరిష్కరించడం లేదు. ఈ సంఘటనలన్నీ తెలంగాణలో సామాజిక దౌర్జన్యవాదం పెరిగిపోతోందన్న కలవరం కలిగిస్తున్నాయి. ఉత్తరాది అంతగా చెడిపోలేదు కానీ, హేతువాదుల మీద, ఉదారవాదుల మీద, రకరకాల ప్రగతివాదుల మీద నేరుగానో, సామాజిక మాధ్యమాలలోనో దాడులు జరుగుతూనే ఉన్నాయి. చాప కింద నీరులాగా వ్యాపిస్తున్న ఈ ధోరణులే, రేపు పెను ప్రమాదానికి కారణమవుతాయి.

విద్యుత్ రంగంలో ప్రైవేటు పాత్రధారులను తీసుకురావాలనుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విషయం బాహాటంగా చెప్పి చేస్తే బాగుంటుంది. పాతికేళ్ల కిందట, ఎప్పుడైతే విద్యుత్ బోర్డు, ఉత్పాదక, సరఫరా, పంపిణీ వ్యవస్థలుగా విభజితమయిందో అప్పుడే, ప్రైవేటు ఉద్దేశ్యాలు వెల్లడయ్యాయి. ఆయా సంస్థలు ప్రజల నిత్యావసరాలతో ముడిపడినవి కావడం, లాభదాయకత లేకపోవడంతో ఇంతకాలం ప్రైవేటు సంస్థలు రాలేదు తప్ప, విధానం లేక కాదు. ఇవాళ బిల్లింగ్‌తో ప్రారంభించి అదానీ తెలంగాణ విద్యుత్ రంగంలోకి ప్రవేశిస్తుంటే, దాని రాజకీయ పర్యవసానాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎదుర్కొనవలసి వుంటుంది. అదానీయే ఒక సమస్య. విద్యుత్ సంస్కరణల అమలుతో ముడిపడిన వ్యవసాయాది రంగాలు మరొక సున్నితమయిన సమస్య. అయితే, అదానీకి అందించిన మొదటి ప్రాంతం హైదరాబాద్ పాతబస్తీ కావడంతో ఒక చిత్రమైన పరిస్థితి ఏర్పడింది. పాతబస్తీలో విద్యుత్ బిల్లుల వసూళ్లు దాదాపుగా జరగవు అనేది ప్రాచుర్యంలో ఉన్న అభిప్రాయం. మైనారిటీల తుష్టీకరణ అంటూ చేసే వాదనల్లో ఇదొక అంశం. బహుశా, అక్కడ విద్యుత్ వినియోగానికి, బిల్లింగ్ జరిగే పరిమాణానికి కొంత అంతరం ఉండి ఉంటుంది. రాష్ట్రంలో ఏ ఏ చోట్ల ఆ అంతరం ఉన్నదో, పాతబస్తీలో ఎంత ఉన్నదో ప్రభుత్వాలు ఎప్పుడూ చెప్పలేదు. ఏది ఏమయినా పాతబస్తీ వాసులు తమ మీద ఉన్న ఆ అభిప్రాయాన్ని తొలగించుకోవడమే మంచిది. వాళ్ల తక్కిన సమాజంతో సంలీనం కావడానికి అది తోడ్పడుతుంది కూడా. అది ఒక అభాండమే గనుక అయితే, అది కూడా తేలిపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన మైనారిటీ అనుకూల ముద్రను కడిగేసుకోవచ్చు. మరి ఇంతటి చొరవ, రాష్ట్రమంతటా ఉన్న మతావేశాల విషయంలో కూడా చూపవచ్చును కదా?

మతపరంగా ఉన్న అన్ని ఉద్రిక్త ప్రాంతాలలోనూ సమస్యను సమూలంగా తొలగించి, శాంతియుత సహజీవన మార్గాలేమిటో అన్వేషించడం ప్రభుత్వం రాజకీయ కర్తవ్యంగా ఉండాలి. ఈ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తోడ్పడిన పౌరసమాజ ప్రతినిధులు కూడా ఆ బాధ్యత తీసుకోవాలి. లేకపోతే, వారి స్థానాన్ని మరెవరో ఆక్రమిస్తారు. చట్టాలను, సమష్టి నైతికతను కాదని రాజ్యాంగేతర శక్తులుగా అవతరిస్తారు. ఏ సమస్యనైనా నాగరికంగా, ప్రజాస్వామికంగా పరిష్కరించుకోవడంలోనే ప్రత్యామ్నాయ నమూనా రూపొందుతుంది.

రీ సర్వే ఆపండి

గత ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయానికి జగన్ ప్రభుత్వంలో తీసుకువచ్చిన టైటిల్ డీడ్ చట్టం రద్దు అంశం ప్రధాన అస్త్రంగా పని చేసింది. జగన్ ప్రభుత్వం తెచ్చిన మరో అనర్థదాయకమైన పథకం భూముల రీసర్వే. దానికి పెట్టిన ముద్దు పేరు జగనన్న భూసర్వే, జగనన్న భూహక్కు–భూరక్ష పథకం. తీరా ఆచరణలో అది రైతులను భుజించే పథకంగా మారింది. గతంలో చరిత్ర పుస్తకాల్లో అశోకుడు బాటసారుల కోసం చెట్లు నాటించెను.. బావులు తవ్వించెను అనే పాఠాలు ఉండేవి. బహుశా జగన్ మెప్పు పొందడానికి అధికారులు భవిష్యత్‌లో ఆయన పేరు కూడా జగన్ రాళ్లు పాతించెను అని అశోకుని సరసన చేరుతుందని చెప్పి ఉంటారేమో. అందుకే భూమిలో పాతే సర్వే రాళ్లపైన జగన్మోహన్ రెడ్డి బొమ్మలు చెక్కారు. ఆ తరువాత బొమ్మలు లేకుండా ఒట్టి పేరు ఉంచారు. గత వంద సంవత్సరాలుగా రీ సర్వే జరగలేదు.. మేము ఆ పనిచేస్తున్నామని, అదో గొప్ప పథకం అని జగన్ ప్రభుత్వంలో మంత్రులు అంతా అవగాహన లేకుండా పదేపదే మాట్లాడేవారు. కానీ రైతులను ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నామన్న ఇంగితం లేకుండా పోయింది. అసలు రీ సర్వే ఎందుకు చేయాలనేది ఆలోచించకుండా అధికారులు చెప్పిన దానికి తల ఊపి, డ్రోన్లు, సర్వే రాళ్లు అంటూ వందల కోట్లు బూడిదలో పోశారు. ఇప్పటిదాకా సుమారు 4 వేల గ్రామాల్లో సర్వే పూర్తయినట్లు చెబుతున్నారు. ఇప్పటివరకు పూర్తయిన గ్రామాల్లో అయినా సర్వే సరిగ్గా జరిపారా అంటే.. లేదనే చెప్పాలి. అంతా తప్పుల తడక. భవిష్యత్‌లో మరిన్ని వివాదాలకు దారితీసేలా సర్వే చేశారు.



రీ సర్వే జరిగిన గ్రామాల్లో డివిజన్‌కు ఒకటి చొప్పున గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో సర్వే ఎలా జరిగిందో పరిశీలించాలి. అలాగే రాష్ట్రంలో కొంతమంది అవగాహన కలిగిన తహశీల్దార్లు, రైతు సంఘాల ప్రతినిధుల అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలి. రీ సర్వే అనేది రెవెన్యూ శాఖకు ఉపాధి హామీ పథకంగా మారకూడదు.

జగ్గయ్యపేట మండలం, తక్కెళ్లపాడు గ్రామంలో మొట్టమొదటి రీ సర్వేను ప్రారంభించారు. తొలి గ్రామంలోనే ఎన్నో తప్పులు దొర్లాయి. దాన్ని సమగ్రంగా పరిశీలించకుండానే అప్పటి ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం కిందిస్థాయి సిబ్బందిని అధికారులు పరుగులు తీయించి తప్పుల తడకల సర్వే చేశారు. సర్వేలో తప్పులు రావడానికి ప్రధాన కారణాల్లో ఒకటి– భూ యజమానులు లేకుండా సర్వే చేయడం. రెండవది– అధికారుల ఒత్తిడితో సిబ్బంది ప్రమాణాలు పాటించకుండా హడావుడిగా సర్వే చేయడం. మూడోది– చేసిన సర్వేలో కూడా ఇద్దరు.. ముగ్గురు భూ యజమానులకు కలిపి ఒకే ఎల్‌పిఎం నెంబర్ ఇవ్వడం. దాని వల్ల మళ్లీ విడివిడిగా వారి భూములను విడగొడితే తప్ప, వారు తమ భూములను అమ్ముకోలేరు. అలా విడగొట్టకుండా రిజిస్ట్రేషన్ ఆఫీసులో దస్తావేజులు రిజిస్టర్ చేయరు. అందుకోసం విడివిడిగా ఎల్‌పిఎం నెంబర్ తీసుకోవాలి. దాని కోసం మరోసారి సర్వే చేయాల్సి ఉంటుంది. ఇది వృథా ప్రయాసే కాకుండా సర్వే సిబ్బంది భూ యజమానుల నుంచి లంచాల రూపంలో దోపిడీ చేసే అవకాశం ఏర్పడుతోంది. లంచాలు ఇవ్వకుంటే నెలల తరబడి తహశీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరగాలి.

ఇదోరకంగా దోపిడీ సర్వే. ఒకవిధంగా చెప్పాలంటే బాగున్న వ్యవస్థను చిన్నాభిన్నం చేయడమే. చేసిన పనే మళ్లీ చేయాల్సి రావడం, రైతులను అష్టకష్టాల పాలు చేసే విధంగా రీ సర్వే విధానం ఉంది. కాబట్టి రీ సర్వేను తక్షణమే ఆపాలి. లేకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. రైతులకు మేలు చేసే బదులు వారిని కష్టాల కడలిలోకి నెట్టేయడమే. (చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు సుమారు రెండేళ్ల క్రితం కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం, కరపల్లి పంచాయితీలో స్థలాన్ని కొనుగోలు చేయగా, భూ మార్పిడి కొరకు సబ్ డివిజన్ చేయడానికి చంద్రబాబు మనుషులే లంచం ఇచ్చారని తెలిసింది. అది ఇప్పుడు బయటపడి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆ సర్వేయర్‌ను సస్పెండ్ చేసినట్లు జూలై 2న అన్ని ప్రసార మాధ్యమాల్లో వచ్చింది. ఇలాంటి ఫిర్యాదులు ఒక సామాన్యుడు కలెక్టర్ దృష్టికి తీసుకువెళితే చంద్రబాబు విషయంలో స్పందించినట్లు అధికారులు స్పందిస్తారా? 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన వారి సొంత భూమికే లంచం తీసుకుంటే, సామాన్యులపై రెవెన్యూ సర్వే డిపార్ట్‌మెంట్ వారు జాలి చూపిస్తారా?)

ఇప్పుడున్న ఆర్‌ఓఆర్ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి, భూమి మీద వాస్తవంగా ఉన్న యజమాని పేరు అడంగల్‌లో చేరిస్తే చాలు. ఏదైనా గ్రామంలో విస్తీర్ణంలో పెద్దగా ఉన్న సర్వే నెంబర్, లేదా వివాదంలో ఉన్న సర్వే నెంబర్లను రీ సర్వే చేస్తే సరిపోతుంది. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలి. పట్టణాల్లో రీ సర్వే అనేది దండగమారి వ్యవహారం. మున్సిపాలిటీల్లో ఇళ్లు నిర్మించబడ్డాక పక్కా రికార్డు ఉంటుంది. అందువల్ల రీ సర్వే అవసరం లేదు. ఇప్పటికే సర్వే జరిపిన గ్రామాల్లో పాత రికార్డులను ఆన్‌లైన్ నుంచి తొలగించకుండా భద్రపరచాలి. లేకుంటే భవిష్యత్‌లో వివాదాలు చుట్టుముట్టి, రైతులు విపరీతమైన కష్టనష్టాలకు గురవుతారు.

రీ సర్వే జరిగిన గ్రామాల్లో డివిజన్‌కు ఒకటి చొప్పున గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో సర్వే ఎలా జరిగిందో పరిశీలించాలి. అలాగే రాష్ట్రంలో కొంతమంది అవగాహన కలిగిన తహశీల్దార్లు, రైతు సంఘాల ప్రతినిధుల అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలి. రీ సర్వే అనేది రెవెన్యూ శాఖకు ఉపాధి హామీ పథకంగా మారకూడదు. బ్రిటిష్ వారిని పొగడటం కాదు గానీ... వారి హయాంలో ఇన్ని సాంకేతిక పనిముట్లు లేని కాలంలో చేసిన సర్వే చాలా పకడ్బందీగా జరిగింది. ఇప్పుడు మన పాలకులు, అధికారులు తప్పుడు నిర్ణయాలతో ప్రచార పథకాల పేర చిక్కులు తెచ్చి పెడుతున్నారు. తెలంగాణలో కూడా ధరణి పేరుతో రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. అంతకంటే తీవ్రస్థాయిలో ఆంధ్రాలో రీసర్వే పేరుతో విధ్వంసం చేస్తున్నారు. రికార్డుల నవీకరణ అంటే అసలు యజమానులను అడంగల్‌లో చేర్చడం. దీనికి చిత్తశుద్ధితో పాటు, నిజాయితీ కూడా అవసరం. భూమి అనేది ఎక్కడికీ జరిగిపోదు. కాకుంటే వాటిపై జరిగిన లావాదేవీల దస్తావేజుల్లో కొన్ని తప్పులు జరిగి ఉండవచ్చు. దానికి రీ సర్వే అవసరం లేదు.

డాక్యుమెంట్లలో తేడాలు ఉన్నప్పుడు భూమిపై అనుభవాన్ని బట్టి సర్వే చేయాలి. దాన్నే ఎంజాయ్‌మెంట్(అనుభవ) సర్వే అంటారు. రీ సర్వే జరగకపోవడం వల్ల వివాదాలు పెరుగుతున్నాయని, అందుకే రీ సర్వే చేయాలని చెప్పడం సహేతుక కారణం కాదు. 90శాతం భూ వివాదాలకు కారణం ఏదో ఒక రాజకీయ పార్టీ ప్రతినిధి వారి వెనుక ఉండటం... దానికి రెవెన్యూ అధికారుల తోడ్పాటు కూడా కారణం. రీ సర్వేను కొనసాగిస్తూ ముందుకు వెళితే గత ప్రభుత్వం టైటిల్ డీడ్ చట్టం వల్ల మూల్యం చెల్లించుకున్నట్లే ఎన్డీఏ ప్రభుత్వం కూడా మూల్యం చెల్లించుకునే పరిస్థితులు ఏర్పడతాయి.

• మారిశెట్టి జితేంద్ర
విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్

ఉప మండల వ్యవస్థే ఉత్తమం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతమున్న సచివాలయ, వాలంటీరు వ్యవస్థలను తక్షణమే రద్దుచేసి, గతంలో ఎన్టీఆర్ ఆలోచించిన విధంగా ఉప మండల వ్యవస్థ ఏర్పాటు చేయాలి. దీనిలో అవసరమైన మేరకు మాత్రమే సచివాలయ సిబ్బందిని వినియోగించుకొని, మిగిలిన వారిని వేరొక చోటకు బదిలీ చేయాలి. గతంలో ఒక వీఆర్వో, ఒక విడీఓ, గ్రామ నౌకర్లు.. కేవలం ఐదు ఆరు మందికి మించకుండా ఉండి, ఒక పంచాయితీకి సంబంధించిన మొత్తం పనులు చేసేవారు. సచివాలయం వ్యవస్థ వచ్చాక వీఆర్వోలు, వీడీవోలు, గ్రామ నౌకర్లు కేవలం 'నామ్ కే వాస్తే'గా మిగిలిపోయి, తమకు కేటాయించిన కొద్దిపాటి పనులు చేస్తూ, జీతం మాత్రం యథావిధిగా తీసుకుంటున్నారు. మరోవైపు 50 కుటుంబాలకు ఒక వాలంటీరును నియమిస్తూ, ఆ కుటుంబాల సమగ్ర సమాచార సేకరణ ద్వారా తమ అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలన్న దురుద్దేశమే తప్ప, నిజంగా వారి సేవలను రాజకీయాలకతీతంగా వినియోగించుకోవాలన్న సదుద్దేశం గత పాలకులకు లేదు. అందువల్ల ఉప మండలాల వ్యవస్థను ఏర్పరచి, మండల వ్యవస్థలో ఉన్న ఉద్యోగులను, సచివాలయ ఉద్యోగులను అవసరమైన సంఖ్యలో నియమించి, వారి ద్వారా పంచాయతీ పరిధిలో అన్ని కార్యక్రమాలను చేయాలి. ప్రజల్లో అత్యధికులకు బ్యాంకు అకౌంట్లు ఉన్నందున వారికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో పెన్షన్లు బ్యాంకు అకౌంట్లకు జమ చేయవచ్చు. కేవలం వృద్ధులకు, దివ్యాంగులకు మాత్రం ఇంటి దగ్గర పెన్షన్లు పంపిణీ చేస్తే సరిపోతుంది.

వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తే.. కచ్చితంగా గ్రామంలో ఉన్న రాజకీయ నాయకులు, సర్పంచ్‌లు ఇతర ప్రజాప్రతినిధుల కన్నా వారే పట్టు సాధించే అవకాశం ఉంది. రాజీనామా చేయని వాలంటీర్లు ఎన్నికలకు రెండు, మూడు రోజుల ముందు నుంచి ఇల్లిల్లూ తిరిగి డబ్బులు పంచిన సంఘటనలు ఎన్నో వెలుగు చూశాయి. వాలంటీర్లుగా పాత వాళ్లను కొనసాగిస్తే వారిలో వైసీపీ పట్ల అభిమానం వల్ల కచ్చితంగా ప్రస్తుత ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు యత్నిస్తారు. కాబట్టి ఎన్టీఆర్ మానస పుత్రిక అయిన ఉప మండల వ్యవస్థను పంచాయితీకి ఒకటి చొప్పున ఏర్పాటు చేసి, సచివాలయ భవనాలను వాటికి వాడుకుంటూ, ఆ వ్యవస్థకు ఒక డిప్యూటీ తహసీల్దార్ స్థాయికి తగ్గ హోదా గల వ్యక్తిని నియమించి, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు జారీ, ఇతర పనులు జరిగేటట్లు చూస్తే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. సామాన్య ప్రజలకు కూడా అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలు వారి ఇంటి ముంగిటకే అందించాలన్న ఎన్టీఆర్ కల కూడా ఉప మండల వ్యవస్థతో సాకారమవుతుంది.

– కె. సురేష్‌బాబు, కన్వీనర్, ఫోరం ఫర్ బెటర్ ఆంధ్రప్రదేశ్

విషమ పరిస్థితుల్లో విద్యార్థిలోకం!

మంచీ చెడ్డా, పాపం పుణ్యం, చిన్నా పెద్దా, మర్యాదా మన్ననా, ప్రేమా అభిమానం, ఆప్యాయతా అనురాగం మొదలైన పదాలకు అర్థాలే మర్చిపోయే పరిస్థితులలోకి విద్యార్థులను మన విద్యావ్యవస్థ దిగజారుస్తోంది. రాజకీయ విధానాల వల్ల మాతృభాష స్వరూప స్వభావాలను కోల్పోతోంది. రాను రాను భాష ఉనికికే ప్రమాదం ఏర్పడుతోంది. ఆంగ్ల మాధ్యమంలో చదవడం వల్ల పిల్లలకు చదువు అర్థమే తెలియకుండా పోతోంది. ఆంగ్లమాధ్యమంలో బోధించే సత్తాలేని ఉపాధ్యాయుల వల్ల ఆంగ్ల భాషలోని మాధుర్యం తెలియదు. ఆంగ్ల భాష చదవడం రాక, అర్థం చేసుకోలేక పిల్లలు బట్టీ పడుతున్నారు. దీంతో పరీక్షలలో స్వయంగా ఆలోచించి రాయడానికి ఆస్కారం ఉండదు. సృజన, ఆలోచనలకు ఆస్కారం లేదు. మేధస్సుకు పదును పెట్టే అవకాశం ఉండదు. పిల్లల వయసు పెరిగే కొద్దీ వారి ఆలోచనా శక్తి తగ్గిపోతుంది. క్రియాశీల దృక్పథం నశించిపోతుంది. సృజనాత్మకశక్తి మృగ్యం అవుతుంది.

మాతృభాషకు ప్రాధాన్యత లేకపోవడం వల్ల భాషా జ్ఞానం తగ్గిపోతుంది. ఇంగ్లీషును అర్థం చేసుకునే సామర్థ్యం నశించిపోతుంది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు మొక్కుబడిగా పాఠాలు చెబుతున్నారు. పాఠం అయినా కాకపోయినా వెంటనే గైడు చూసి నోట్స్‌లు రాయిస్తున్నారు. అన్ని సబ్జెక్టులు గైళ్ళు చూసి రాయడం వల్ల సమర్థులైన పిల్లలకు చదువుకునే సమయం ఉండడం లేదు. టెక్స్ బుక్ చదవమని చెప్పే ఉపాధ్యాయులు చాలా తక్కువ. రాష్ట్ర స్థాయి నుండి పాఠశాల స్థాయి వరకు విద్యార్థుల మేధస్సుకు ఉపయోగపడే అవసరమైన పని ఏదీ చెయ్యడం లేదు. కోట్ల రూపాయల వ్యయం చేసి తయారుచేస్తున్న పాఠ్యపుస్తకాలు గైళ్ళు తయారు చేయడానికి మాత్రమే పనికి వస్తున్నాయి. విద్యావ్యవస్థలో జవాబుదారీతనం లేకపోవడానికి ఇదొక ఉదాహరణ.

చదువు వచ్చిన వాళ్ళకు మాత్రమే పాఠశాలల్లో చదువు చెబుతున్నారు. చదువు రాని వాళ్ళకు చదువు చెప్పే యంత్రాంగం మన వద్ద లేదు. ఎన్నో ట్రైనింగులు, పద్ధతులు వస్తుంటాయి పోతుంటాయి. కానీ సగం మంది పిల్లలకు చదవడం రాదు. సరైన స్కిల్స్ లేక గ్రామాలలో ఎందరో గ్రాడ్యుయేట్లు సైతం ఖాళీగా ఉంటున్నారు. వీళ్ళకు పనిచేయడం రాక కుటుంబాలకు భారంగా మారుతున్నారు. మరి మన విద్యావ్యవస్థ ఏమి నేర్పిస్తున్నట్లు? విద్యలో నైతికత లేదు. పాఠశాలల్లో నోట్స్ రాయడం అనే మాట తప్ప, ఎలాంటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. మోరల్ క్లాసులు, గ్రంథాలయం పుస్తకాల అధ్యయనం, సామాజిక అంశాలపై అవగాహన, పర్యావరణం పట్ల శ్రద్ధ, మహిళల పట్ల గౌరవభావం చూపే కార్యక్రమాలు, దేశభక్తి పెంపొందించే కార్యక్రమాలు వంటివి జరగడం లేదు. దీంతో పిల్లల్లో నైతిక భావనలు పెంపొందడం లేదు. పాఠశాలల్లో కూడా సెల్‌ఫోన్ వాడకం పట్ల సరైన నియంత్రణ లేకపోవడంతో ఉపాధ్యాయుల బోధనా సమయంలో సగం కాలం దుర్వినియోగం అవుతోంది. ఇది విద్యార్థుల జీవితాలకు బాధ్యత కలిగిన ఉపాధ్యాయులే తీరని ద్రోహం చెయ్యడం అవుతుంది.

పాఠశాలల్లో నోట్స్ రాయడం అనే మాట తప్ప, ఎలాంటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. మోరల్ క్లాసులు, గ్రంథాలయం పుస్తకాల అధ్యయనం, సామాజిక అంశాలపై అవగాహన, పర్యావరణం పట్ల శ్రద్ధ, మహిళల పట్ల గౌరవభావం చూపే కార్యక్రమాలు, దేశభక్తి పెంపొందించే కార్యక్రమాలు వంటివి జరగడం లేదు. దీంతో పిల్లల్లో నైతిక భావనలు పెంపొందడం లేదు.



పిల్లలకు సెల్‌ఫోన్లు ఇంటి వద్ద కూడా అందుబాటులో ఉంటున్నాయి. ఇంటికి పోతే ఇంతకుముందు ఆటలాడుకునే పిల్లలు, ఇప్పుడు ఫోన్‌లలో హింసా ప్రవృత్తిని పెంచే వీడియో గేమ్స్ ఆడుతున్నారు. పోర్నోగ్రఫీకి అలవాటు పడుతున్నారు. తద్వారా సెల్‌ఫోన్లకు బానిసలవుతున్నారు. జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. పెద్ద పిల్లలు పాఠశాలలకే ఫోన్లు తీసుకొస్తున్నారు. అమ్మాయిల ఫోటోలు తీసి ట్రాప్ చేసి, బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఇది సమాజానికి ప్రమాదకరమైన సంకేతం. తెలిసీ తెలియని వయస్సులో ప్రేమలు పెళ్లిళ్లు కూడా ఈ ఫోన్ల వల్లే జరుగుతున్నాయి. పాఠశాలల్లో ఫోన్ల వినియోగంపై అవగాహన కలగజెయ్యాలి. పాఠశాలలకు ఫోన్లను అనుమతించకూడదు.

పాఠశాలలు, కళాశాలల్లో ప్రతి చిన్న విషయానికీ పార్టీలు జరిపే సంస్కృతి పెరిగిపోయింది. కేకులు కోయడం దగ్గర మొదలై బ్రాందీ, విస్కీ పార్టీలు చేసుకునే స్థాయి వరకూ పోయింది. ఈ పార్టీలు అల్లర్లకు, గొడవలకు, చివరికి హత్యలకు కూడా దారి తీస్తున్నాయి. బస్టాండ్లలో వీళ్ళు చేసే అల్లరి రౌడీమూకలను తలపిస్తుంటుంది. పాఠశాల స్థాయి వరకు కనీసం యూనిఫామ్ ఉంటుంది. కళాశాలకి వచ్చేసరికి ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఎలాంటి యూనిఫామ్ లేకపోవడం వల్ల వాళ్ళు ధరించే దుస్తులు, వాళ్ళ క్రాపులు రౌడీలను మించి ఉంటున్నాయి. కాలేజీ విద్యార్థులు మత్తు మందులు, మాదకద్రవ్యాలకు కూడా అలవాటు పడుతున్నారు. కొన్నిచోట్ల పాఠశాల నుంచే ఈ అలవాటు మొదలవుతోంది. గతంలో కళాశాలల్లో స్టూడెంట్ యూనియన్స్ ఉండేవి. వారికి కొంత అధ్యయనం ఉండేది. కొన్ని విలువలుండేవి. కానీ ఇప్పుడు విద్యాలయాలల్లో సరైన దిశానిర్దేశం చేసే వ్యవస్థలు లేకపోవడంతో యువత పెడత్రోవ పడుతున్నారు.

ఇక ఇళ్ళ దగ్గర తల్లిదండ్రుల మాటకు లెక్కే ఉండదు. ఏడు ఎనిమిది తరగతి పిల్లలకు సెల్‌ఫోన్లు కొనివ్వాల్సిందే. లేదంటే గోలచేస్తారు, చస్తామని బెదిరిస్తారు. ఈ విధంగా ఎదుగుతున్న యువతలో నుండి మానవీయ లక్షణాలు కలిగిన మనుషులెలా వస్తారు. సమాజం గురించి ఆలోచించే ఆలోచనాపరులు ఎలా తయారవుతారు? సృజనశీలురెలా వస్తారు. భాషా సంస్కృతి, సాహిత్యం ఊసే ఉండదు. ఒక తరం మన కళ్ళముందు ఛిద్రమైపోతున్న వైనం చూశాం. రాబోయే తరాల గురించి ఆలోచించాల్సిన తక్షణ కర్తవ్యం మన ముందుంది.

▪ మంచికంటి
మరో గ్రంథాలయ ఉద్యమం





ఎత్తిపోతల పథకం వద్ద విడుదలైన నీటిని పూజ చేసి పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల, కలెక్టర్, ఎమ్మెల్యేలు

హమ్మయ్యా.. నీరొదిలారు!

ఒకేసారి పట్టిసీమ, తాడిపూడి నుంచి నీటి విడుదల

* లాంఛనంగా ఆరంభించిన జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు
* కృష్ణాడెల్టా రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గోదావరిలో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఎత్తిపోతల నుంచి నీటి విడుదలకు అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీన్ని గమనించి, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వేగంగా కదిలింది. పోలవరం సమీపాన ఉన్న పట్టిసీమ నుంచి 8వేల క్యూసెక్కుల నీటి విడుదలకు బుధవారం శ్రీకారం చుట్టింది. మరో రెండు, మూడు రోజుల్లోనే కాల్వల్లో 8 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యం మేర ప్రవాహం ఉంటుందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇప్పటికే కృష్ణానదిలో నీరు అతితక్కువగా ఉండటంతో గోదావరి వరద జలాలు పట్టిసీమ ద్వారా ప్రకాశం బ్యారేజీకి చేరుకోనున్నాయి.

● సంబరమే సంబరం

ఒకేసారి పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల నుంచి గోదావరి జలాలు విడుదల కావడంతో ఆయా ప్రాంతాల్లో రైతుల్లో హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే తొలకరి ఆరంభమైనా రైతులకు సంతృప్తికరంగా సాగునీరు అందడం లేదు. పగటి ఉష్ణోగ్రతలు తగ్గకపోవడమే దీనికి ప్రధాన కారణం.

ఖరీఫ్ ఈసారి అనూహ్యంగా ఆలస్యమైంది. ఈ పరిణామ క్రమంలోనే ప్రకాశం బ్యారేజీ నుంచి పట్టిసీమ నీరు కృష్ణాడెల్టాకు జీవం పోయనుండటంతో ఆ ప్రాంత రైతుల్లో ఆనందం వెల్లివెరిసింది. ఇన్నాళ్లలో ఎప్పుడూ లేనంత పట్టిసీమ, తాడిపూడి నుంచి ఒకేసారి నీటి విడుదల సహజంగానే రైతుల్లో ఆనందాన్ని రెట్టింపు చేసింది.

కూటమి ప్రభుత్వ రాకతో పట్టిసీమ కుడి కాల్వ పరిధిలోని రైతుల్లో మళ్లీ ఆనందం నెలకొంది. ఐదేళ్ల పాటు జగన్ హయాంలో ఈ ఎత్తిపోతల నుంచి సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారో, ఎప్పుడు ఆపేస్తారో తెలియక రైతులు కొట్టుమిట్టాడారు. పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల ద్వారా జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం నీటిని వదిలారు.

ఇదంతా చంద్రబాబు దయే : మంత్రి నిమ్మల

'సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోస్తున్నారు. ఇంతకు ముందు నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టినట్లే ప్రాధాన్యత క్రమంలో సాగునీటి పథకాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మరింత చొరవ తీసుకుంటున్నారు. ఆ క్రమంలోనే రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల ద్వారా నేడు గోదావరి జలాలను విడుదల చేశాం' అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పట్టిసీమ, తాడిపూడి నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన ఆయన అనంతరం గోదారమ్మకు ప్రత్యేక పూజలు చేసి పూలు, వస్త్రాలు సమర్పించారు.

పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో మరో అవినీతి బాగోతం బయటపడింది. 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పినట్టు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణానదిలో పర్యాటకుల విహారం కోసం కొన్న పాత బోట్లు ఉపయోగించటానికి పనికిరావని తేలిపోయింది. వీటిని ఉపయోగించటం వల్ల పర్యాటకుల భద్రతకు ప్రమాదమని తెలిసి పక్కన పెట్టేశారు. రూ.15 లక్షలతో కొన్న ఈ పాత బోట్ల కొనుగోలు, మరమ్మతుల పేరిట చాలా మొత్తాన్ని కమిషన్ రూపంలో జేబులో వేసుకున్నారని తెలుస్తోంది.



భవానీపురంలోని బెరం పార్కులో మూలనపడి ఉన్న బోట్లు

బోట్ల కొనుగోలులో బొక్కేశారు..!

- వైసీపీ ప్రభుత్వ హయాంలో గుజరాత్ నుంచి కొనుగోలు
- పనికిరాని బోట్లకు రూ.15 లక్షల ఖర్చు
- వాటి రిపేర్లకు మరింతగా..
- చక్రంతిప్పిన కీలక అధికారి
- కమీషన్ల మాటున దోపిడీ
- ప్రస్తుతం మూలకు చేరిన బోట్లు

ఏపీటీడీసీలో పాతబోట్ల కొనుగోల్‌మాల్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గత ప్రభుత్వ హయాంలో కృష్ణానదిలో తిప్పేందుకు ఏపీటీడీసీ అధికారులు ఎందుకూ పనికిరాని పాత బోట్లను గుజరాత్ నుంచి కొన్నారు. ఎలాంటి టెండర్ లేకుండా, ఆసక్తి వ్యక్తీకరణ కోరకుండా, ఎలాంటి భద్రతా ప్రమాణాలను కూడా చూడకుండా ఇష్టానుసారంగా ఓ ఉన్నతాధికారి గుజరాత్ వెళ్లి అక్కడి వారితో ఒప్పందం కుదుర్చుకుని వీటిని తెచ్చారు.

పనికిరాని బోట్లు కొన్నారు

గత ప్రభుత్వ హయాంలో మొత్తం ఐదు పాత బోట్లను కొన్నారు. వీటిలో రెండు మెకనైజ్డ్, మూడు స్పీడ్ బోట్లు. వీటిలో మెకనైజ్డ్ బోట్లు సరైనవి కాదని తెలుస్తోంది. నీటి లోతు తక్కువగా ఉండే చెరువుల్లో, పెద్ద పెద్ద స్విమ్మింగ్ పూల్స్‌లో ఉపయోగించటానికి తప్ప ఇవి ఎందుకూ పనిచేయవు. వీటిని మెకనైజ్డ్ చేయడానికి రూ.లక్షలు ఖర్చు చేశారు. ఇక స్పీడ్ బోట్లు అయితే, సముద్రాల్లో ప్రయాణించే ఓడల్లో తీసుకెళ్లేవి. భద్రతా ప్రమాణాల రీత్యా వీటి కాలపరిమితి ఏనాడో ముగిసింది. వీటిని రెస్క్యూ బోట్లుగా ఉపయోగించటం సాధ్యం కాదని తీసివేయగా, ఏపీటీడీసీ అధికారులు కొన్నారు. మోటార్లు బిగించినా కూడా ఇవి గాలికి ఊగిపోతుండటంతో మొదటి నుంచీ అనుమానాలు వ్యక్తమయ్యాయి. గుజరాత్‌లో ఇవి ఎందుకూ పనికిరావని పక్కన పడేశారు. అలాంటి బోట్లను కొనటం వల్ల ఉన్నతాధికారులకు భారీగా కమీషన్లు ముట్టినట్టు తెలిసింది.

లెక్క తేల్చాలి

వాస్తవంగా ఈ బోట్లకు పెట్టిన ఖర్చులో పావువంతు కూడా గుజరాత్‌లో డబ్బు చెల్లించలేదని తెలుస్తోంది. మిగిలిన డబ్బును ఏం చేశారు? ఎవరి సొంత జేబుల్లోకి వెళ్లిందో లెక్క తేల్చాల్సిన అవసరం ఉంది. అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అండతో, నాటి మంత్రి రోజా సిఫారసులతో ఏపీటీడీసీ ఉన్నతాధికారులు చెప్పినట్టు వాటర్ ఫ్లీట్ జీఎం ఈవిధంగా చేశారు. ఏపీటీడీసీలో జరిగిన ఈ కుంభకోణంపై టీడీపీ ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించి బాధ్యులైన వారి నుంచి సొమ్మును రాబట్టాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

సహకార శాఖలో ఊసరవెల్లులు

● నిన్నటి వరకు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ● నేడు తెలుగునాడు ట్రేడ్ యూనియన్ జెండా

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సహకార శాఖలో ఊసరవెల్లులు తయారయ్యాయి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ జెండా మార్చేసి తమ పబ్బం గడుపుకొనేందుకు సిద్ధమైపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం యూనియన్లను ఏర్పాటు చేసుకున్నారు. అలాంటి వాటిలో ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఒకటి. ఈ యూనియన్ నెల రోజుల క్రితం వరకు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌కు అనుబంధంగా ఉండేది. ఎప్పుడైతే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిందో ఈ యూనియన్ నాయకులు సైతం తమ విధేయతను మార్చేసుకున్నారు. పసుపు కండువా కప్పుకొని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు తమ యూనియన్‌ను అనుబంధ సంస్థగా మార్చేశారు. ఆగమేఘాలపై టీడీపీ నాయకులను కలిసి పసుపు కండువాలు కప్పించుకున్నారు. ఈ యూనియన్ నాయకుల తీరుతో తటస్థ యూనియన్‌గా ఉద్యోగుల సమస్యలపై పోరాడిన నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం వారి వేధింపులకు గురయ్యామని, మళ్లీ ఇప్పుడు అదే నాయకులు తమను వేధింపులకు గురి చేసేందుకు ఊసరవెల్లుల్లా పార్టీ మార్చి అధికార పార్టీ చెంతన చేరారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్క్రూడ్రైవర్‌తో 8 సార్లు

గొంతులో పొడిచి..

కించపరిచే విధంగా మాట్లాడాడని క్షణికావేశంలో భర్తను హతమార్చిన భార్య

బంటుమిల్లి, జూలై 3 : బంటుమిల్లి మండలం చినతుమ్మిడిలో భార్య చేతిలో భర్త హత్యకు గురయ్యాడు. ఘటన మంగళవారం రాత్రి జరిగింది. భర్తను భార్య స్క్రూ డ్రైవర్‌తో 8 సార్లు గొంతులో పొడవడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటన బంటుమిల్లి మండలంలో సంచలనం కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చినతుమ్మిడి గ్రామానికి చెందిన గుసిమి అప్పారావు (30)కు, నెల్లూరు జిల్లా జలబంకి మండలం కొత్తపాలేనికి చెందిన కీర్తనకు తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమైంది. అప్పారావుకు కీర్తన స్వయానా మేనకోడలు. చినతుమ్మిడి పరిసర గ్రామాల్లో పొలంలో పురుగుమందులు పిచికారీ చేసే స్ప్రేయర్లకు మరమ్మతులు చేస్తూ అప్పారావు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా కీర్తన ప్రవర్తనపై అనుమానంతో ఆమె భర్త కాపురం సక్రమంగా సాగాలంటే పద్ధతులు మార్చుకోవాలని తరచూ హెచ్చరిస్తున్నాడు. ఈ విషయంపై భార్యాభర్తలకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. ఆ సమయంలో భార్యను కించపరిచే విధంగా అప్పారావు తీవ్రవ్యాఖ్యలు చేశాడు. ఇరువురి మధ్య పెనుగులాట తీవ్రస్థాయికి చేరింది. కీర్తన క్షణికావేశంలో అందుబాటులో ఉన్న స్క్రూడ్రైవర్‌తో భర్త గొంతులో 8 సార్లు పొడిచింది. ఈ దాడిలో గాయపడిన బాధితుడు తీవ్ర గాయాలయ్యాయి. స్పృహతప్పి పడిపోయాడు. కొంతసేటికి కీర్తన ఇద్దరికీ గొడవ జరిగిందని, తన భర్త పడిపోయాడని ఆసుపత్రికి తీసుకెళ్లాలని సమీపంలో ఉన్న బంధువులకు సమాచారం ఇచ్చింది. బంధువులు వచ్చేసరికి అప్పారావు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి చూసి అప్పారావు మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి సోదరి పి.అచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటుమిల్లి ఎస్సై వాసు కేసు నమోదు చేశారు.



మృతురాలు మాధవి (ఫైల్), కవల పిల్లలు

కాన్పు కోసం వచ్చి.. తల్లీ కవలల మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బాధితుల ఆందోళన
- ఆసుపత్రి ప్రమాణాలపై కమిటీ నియామకం
- నివేదిక వచ్చాక చర్యలు : డీఎంహెచ్‌వో

పొత్తిళ్లలో పండంటి బిడ్డలు ఉండాలని ఆ తల్లి ఎన్నో కలలు కన్నది. తన కడుపులో పెరుగుతున్నది కవలలు అని తెలిసి మరింత సంబరపడిపోయింది. ప్రసవ వేదనను సైతం భరించింది. కొద్దిక్షణాల్లో తన బిడ్డలను చూస్తానని మురిసిపోయింది. విధి ఎంత బలీయమైందో. బిడ్డలను చూడకుండానే ఆ తల్లి కన్నుమూస్తే, కళ్లు కూడా తెరవలేని స్థితిలో ఆ పసికందులు ప్రాణాలొదిలారు. గంగూరుకు చెందిన తల్లి మాధవి విషాదగాథ ఇది.



రాష్ట్రానికే మోడల్‌గా మల్లవల్లి

- అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దుతాం : మంత్రి భరత్ హామీ
- మల్లవల్లి పారిశ్రామికవాడ సందర్శన

4లో..

అమెజాన్ ఆర్డరే పట్టించింది..!

యువతి అదృశ్యం కేసులో అదే కీలకం

- ఎనిమిది నెలలుగా పోలీసుల దర్యాప్తు
- యువతిని తీసుకెళ్లిన యువకుడి కోసం గాలింపు
- జమ్మూకశ్మీర్‌లో ఆన్‌లైన్ ఆర్డర్ పెట్టిన యువకుడు

ట్రాక్ చేసి చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

విజయవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది నెలల కిందట అదృశ్యమైన యువతిని ఓ అమెజాన్ ఆన్‌లైన్ ఆర్డర్ పట్టించింది. ఒక యువకుడితో జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఆమెను మంగళవారం అర్ధరాత్రి విజయవాడకు తీసుకొచ్చారు. మాచవరం పోలీసులు బుధవారం ఆ యువతిని తల్లికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడలో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న తన కుమార్తె కనిపించడం లేదని తల్లి గతంలో మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా స్పందించడంతో దర్యాప్తులో వేగం పెంచారు.

దక్షిణాది టు ఉత్తరాది

గత నవంబరులో అంజాద్ అలియాస్ షణ్ను అనే యువకుడు.. ఆ యువతిని తీసుకుని వెళ్లిపోయాడు. తొలుత పోలీసులు హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించినా ఫలితం లేకపోయింది. పోలీసులు ట్రాక్ చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న అంజాద్ తనతో పాటు యువతి ఫోన్‌ను అమ్మేశాడు. అక్కడ విస్సయిన ఈ ఇద్దరూ కలిసి దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలను చుట్టుముట్టేశారు. హైదరాబాద్ నుంచి రైల్లో బెంగళూరు వెళ్లారు. అక్కడి నుంచి కేరళకు చేరుకున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్ వెళ్లారు. బెంగళూరులో స్నేహితుల వద్ద వారం పాటు ఉన్నారు. అక్కడి నుంచి కేరళ వెళ్లి, ఆ తర్వాత రాజస్థాన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి జమ్మూకశ్మీర్‌కు వెళ్లారు. ఈ ప్రయాణాలన్నీ రైల్లోనే చేశారు. ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లినా టికెట్ కొనకుండా జనరల్ బోగీల్లో ప్రయాణించారు. జమ్మూకశ్మీర్ వెళ్లాక అంజాద్ అక్కడ సెకండ్ హ్యాండ్ ఫోన్ కొన్నాడు. అందులో సిమ్‌కార్డు వేసి బెంగళూరులో ఉన్న స్నేహితులతో మాట్లాడటం మొదలుపెట్టాడు. సాంకేతికంగా ఈ వివరాలను గుర్తించిన పోలీసులు బెంగళూరుకు వెళ్లారు. వారిని విచారణ చేయగా, అక్కడికి వచ్చి వెళ్లిపోయారని తెలుసుకున్నారు. కాగా, ఇదే ఫోన్‌ను యువతి ఉపయోగించడం మొదలుపెట్టింది. అంజాద్ తన ఆధార్‌కార్డు నెంబర్‌ను ఉపయోగించి అమెజాన్‌లో ఆన్‌లైన్ ఆర్డర్ ఇచ్చాడు. దీన్ని సైబర్ క్రైం పోలీసులు ట్రాక్ చేశారు. ఈ లోకేషన్‌ను తెలుసుకున్న పోలీసులు దాన్ని అక్కడి పోలీసులకు షేర్ చేశారు. అసలు విషయాన్ని అక్కడి పోలీసులకు వివరించారు. జమ్మూకశ్మీర్ పోలీసులు అంజాద్‌తో పాటు యువతిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో ఉంచారు. అక్కడి నుంచి మాచవరం పోలీసులు ఇక్కడికి తీసుకొచ్చి, యువతిని క్షేమంగా తల్లి చెంతకు చేర్చారు. అంజాద్‌పై ఆమె తల్లి మరో ఫిర్యాదు చేయనుంది. దీనిని బట్టి పోలీసులు అతడిపై కేసు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం అంజాద్ పోలీసుల అదుపులో ఉన్నాడు.

కదల్లేని స్థితిలోనూ.. దుర్గమ్మకు 95 ఏళ్ల వృద్ధురాలి విరాళం

» అన్నదానం, బంగారు తాపడం పనులకు రూ.3 లక్షలు

» ఇంటికి వెళ్లి విరాళం స్వీకరించిన ఈవో



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ భవానీపురానికి చెందిన వి.అనుసూయమ్మ (95) వృద్ధురాలు తాను దాచుకున్న రూ.3 లక్షల పొదుపు సొమ్మును దుర్గమ్మకు కానుకగా ఇచ్చారు. మంచంపై నుంచి కదల్లేని స్థితిలో ఉన్న ఆమె చెంతకు బుధవారంనాడు దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు వెళ్లి ఆ మొత్తాన్ని తీసుకుని రశీదులు అందజేశారు. తాను ఇచ్చిన మొత్తంలో రూ.1.5 లక్షలను అన్నదానానికి, మరో రూ.1.5 లక్షలు బంగారు తాపడం పనుల కోసం వినియోగించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అనుసూయమ్మ కొడుకు, ప్రముఖ న్యాయవాది వీఎస్ఆర్ ఆంజనేయులు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విరాళాన్ని ఈవో రామారావుకు అందిస్తున్న వై.శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

గర్భాలయ గోపుర స్వర్ణతాపడానికి రూ.5లక్షలు..

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం గర్భాలయ గోపురం స్వర్ణతాపడానికి విజయవాడ గణేశ్‌నగర్ కాలనీకి చెందిన వై.శ్రీనివాసరావు ఆయన కుటుంబసభ్యులు యంత్రాతి దర్శన్ పేరిట రూ.5లక్షలు, అన్నవితరణ కార్యక్రమానికి రూ.1,01,116లు, ఒక రోజున 500 మందికి అన్నవితరణ చేసేందుకు రూ.21వేలు విరాళాలను అందజేశారు. బుధవారం ఆలయానికి విచ్చేసిన శ్రీనివాసరావు, ఆయన కుటుంబసభ్యులు ఈవో కేఎస్ రామారావు ద్వారా దేవస్థానానికి చెక్కు రూపంలో మొత్తాన్ని అందజేశారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. దాతకు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

31 నుంచి శ్రావణమాస రైలు యాత్ర

ధర్నాచౌక్, జూలై 3 : ఇండియన్ రైల్వే ప్రత్యేకంగా ఈ నెల 31 నుంచి 10 రోజుల పాటు శ్రావణమాసం అమావాస్య రైలు యాత్ర చేపడుతున్నట్టు భారత్ గౌరవ్ స్టార్ రైల్ ప్రొడక్ట్ డైరెక్టర్ విగ్నేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో పాద గయ, నాభి గయ, శిరో గయ, పూరీ జగన్నాథుడు, కాశీ విశ్వనాథుడు, అన్నపూర్ణదేవీ దర్శనం, గయలో శ్రావణ అమావాస్య రోజు పిండ తర్పణం, అయోధ్యలో రాముని దర్శనం, త్రివేణి సంగమంలో పుణ్యస్నానం, పురుహూతిక దేవీ, విమలాదేవీ, బిరాజా దేవీ, మంగళగౌరి, కాశీ విశాలాక్షి, అలోపిదేవి శక్తి పీఠాలను సందర్శించవచ్చన్నారు. వసతి, భోజనం, బస్సుతో కలిపి ఏసీ థర్డ్‌క్లాస్ కంఫర్ట్ రూ.32,500, స్లీపర్ క్లాస్ రూ.19,500లు అన్నారు. టికెట్ల బుకింగ్ కోసం 93550 21516 ఫోన్‌నంబర్‌ను, డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ డాట్ ట్రైన్‌టూర్ డాట్ ఇన్‌లో సంప్రదించాలన్నారు.

వంశపారంపర్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేయండి

అవనిగడ్డ, జూలై 3 : అర్చక స్వాములకు వంశపారంపర్య ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని రాష్ట్ర అర్చక సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి డా.టి.అనంతాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితం అర్చక స్వాముల నుంచి ఆధార పత్రాలు నోటరీ ద్వారా తీసుకోవటం జరిగిందని, అందుకు సంబంధించి హక్కు పత్రాలు జారీ చేసేందుకు సిద్ధం చేసినప్పటికీ ఇవ్వకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకోవలసిందిగా అర్చకులకు సమాచారం ఇచ్చి వెంటనే పత్రాలు జారీని వాయిదా వేయటంలో ఆంతర్యం తెలియటం లేదని, కేవలం అర్చకులను వేధింపులకు గురి చేయటమే సస్పెన్షన్‌కు గురైన సహాయ కమిషనర్ శాంతి ధ్యేయంగా పెట్టుకున్నారని. తక్షణమే నూతనంగా బాధ్యతలు చేపట్టే సహాయ కమిషనర్ హక్కు పత్రాలు జారీ చేయాలని కోరారు. అవినీతి ఆరోపణలతో జిల్లా దేవదాయశాఖ కమిషనర్ శాంతిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటం పట్ల దివి తాలూకా అర్చక సమాఖ్య సభ్యులు హర్షం ప్రకటించారు.

దివ్యాంగుల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, జూలై 3 : జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ) న్యూఢిల్లీ వారు దివ్యాంగుల రుణాలకు 2024-25 సంవత్సరానికిగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.9.15 కోట్లు కేటాయించారని ఎన్టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ వాడ్రేవు కామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఆసక్తి గల దివ్యాంగులు 40 శాతం, ఆపైన అంగవైకల్యం కలిగి వయస్సు 18 నుంచి 60 సంవత్సరాలు కలవారు (ఎంఆర్ అయితే 14 సంవత్సరాలు) ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీలోనుకు అర్హులు. మంజూరైన రుణం మొత్తం తిరిగి వడ్డీతో చెల్లించాల్సి వుంటుంది. ఎటువంటి సబ్సిడీ ఉండదు. (10 వేల నుంచి 50 వేల వరకు వడ్డీ 5 శాతం, 50,001 నుంచి రూ.5 లక్షల వరకు వడ్డీ 6 శాతం)లోను దరఖాస్తు కొరకు కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తుకు సదరం సర్టిఫికెట్, యుడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, విద్యా/శిక్షణ ధృవీకరణ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం కాపీ, అంగవైకల్యం కనిపించేలా 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, లోను లక్ష రూపాయలు దాటిన యెడల ప్రాజెక్టు రిపోర్టు సంబంధిత పరిశ్రమల శాఖ వారి నుంచి తీసుకొని సమర్పించాలని తెలిపారు. ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనుటకు, ఉన్న వ్యాపారాలు అభివృద్ధి చేసుకొనేందుకు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. లక్ష రూపాయల వరకు ష్యూరిటీగా ప్రభుత్వ ఉద్యోగి (ఐదేళ్ల సర్వీసుకలిగి) వుండాలని తెలిపారు. లక్ష దాటిన వారికి ష్యూరిటీగా ప్రభుత్వ ఉద్యోగి, బ్యాంకు గ్యారంటీ లేదా ఆస్తి తాలూకు ఒరిజినల్ దస్తావేజులు ష్యూరిటీగా పెట్టవచ్చునని పై మూడింటిలో ఏదో ఒక దానిని ష్యూరిటీగా ఇవ్వాల్సి వుంటుందని తెలిపారు. రూ.లక్షకు మూడేళ్ల కాలపరిమితి, రూ.5 లక్షలకు ఐదేళ్ల కాలపరిమితిగా నిర్ణయించడమైందని తెలిపారు. జాయింట్ కలెక్టర్/ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా మేనేజర్ జాయింట్ అకౌంట్‌కు ఈసీఎస్ చేయాలన్నారు. లబ్ధిదారుడు సంతకం చేసిన మూడు చెక్కులు ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, ఎంపిక లోను మంజూరు కార్యక్రమాలు జేసీ అధ్యక్షతన జిల్లా స్క్రీనింగ్ కమిటీ (డీఎల్ఎస్‌సీ) ద్వారా జరుగునని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం కార్యాలయం ఫోన్ నెం.08672-252637కు సంప్రదించాలని తెలిపారు.



పొలాలు దాటి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

గుక్కెడు నీటి కోసం.. గట్లు దాటాల్సిందే

» నంగేగడ్డలో తాగునీటి అవస్థలు

నాగాయలంక : గుక్కెడు నీటి కోసం పొలాల మధ్య నడిచి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నంగేగడ్డ గ్రామంలో నెలకొంది. మండలంలోని నంగేగడ్డ పంచాయతీ రక్షిత మంచినీటి పథకం ద్వారా కుళాయిల నీరు రంగుమారింది. వాడుకునేందుకు కూడా పనికి రాకుండా ఉండటంతో తాగునీటి కోసం సుదూరంలో ఉన్న చేతి పంపుల నుంచి నీరు తెచ్చుకుని దాహార్తిని తీర్చుకుంటున్నామని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ రక్షిత మంచినీటి పథకంలోని ఫిల్టర్ బెడ్లు సరిగా పని చేయటం లేదని, వాటర్ ట్యాంక్ క్లీనింగ్ సరిగా ఉండటం లేదని వారు విమర్శిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పి.మల్లికార్జునరావును వివరణ కోరగా, ఇటీవల ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేశామని అధికారులతో సంప్రదించి ఫిల్టర్ బెడ్లు సరిగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ హైర్ బస్సు ఆపరేటర్ల మెరుపు సమ్మె



బస్సులు ఆపేసి కూర్చున్న డ్రైవర్లు

» ఆర్ఎం తీరుపై యజమానుల ఆగ్రహం.. జగ్గయ్యపేట డిపోలో 30 బస్సుల నిలిపివేత

» విజయవాడ బస్సుల యజమానులకు వెసులుబాట్లపై ఆగ్రహం

» బస్సులు నిలిపివేతతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

బడా అద్దె బస్సుల యజమానుల ప్రయోజనాల కోసం సమయవేళలు మార్చుతూ ఆర్టీసీ అధికారులు రాత్రికి రాత్రి జారీచేసిన సర్క్యులర్ ఎన్టీఆర్ జిల్లాలో తీవ్ర వివాదాన్ని సృష్టించింది. మిగిలిన అద్దె బస్సుల యజమానుల ఆగ్రహానికి కారణమైంది. అద్దె బస్సులను స్తంభింప చేయటం వరకు వెళ్లింది. అద్దె బస్సులు నిలిచిపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆర్టీసీ ఉన్నతాధికారుల గొంతులో పచ్చివెలక్కాయపడినట్టయింది. ఊహించని పరిణామానికి సాయంత్రం నాటికి సర్క్యులర్‌ను అమలు చేయటం లేదని హామీ ఇవ్వటంతో తాత్కాలికంగా వివాదం సమసింది.

ఆంధ్రజ్యోతి, విజయవాడ/జగ్గయ్యపేట, జూలై 2 : అద్దె బస్సుల యజమానుల ఆందోళనతో 'ఆర్టీసీ'లో చీకటి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట డిపో పరిధిలో అద్దె బస్సుల యజమానులు బుధవారం మెరుపు సమ్మెకు దిగారు. బస్సులను నిలుపుదల చేయటంతో జగ్గయ్యపేట-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ-జగ్గయ్యపేట మార్గంలో జగ్గయ్యపేట డిపో పరిధిలో తొంభైశాతం పైగా అద్దె బస్సులు నడుస్తున్నాయి. స్వల్ప సంఖ్యలో విజయవాడ నుంచి వచ్చేవి ఉన్నాయి. విజయవాడ నుంచి వచ్చే అద్దె బస్సులకు గత ఐదేళ్లుగా ఆర్టీసీ ఉన్నతాధికారులు పెద్దపీట వేస్తూ వస్తున్నారు. అద్దెబస్సుల సమయాలను తరచూ మార్చుతున్నారు. మొదట్లో జగ్గయ్యపేటకు చెందిన అద్దె బస్సుల యజమానులకు ఇది అర్థం కాక.. ఈ అంశంపై వారు దృష్టి సారించారు. విజయవాడ నుంచి వచ్చే బస్సులను ట్రాఫిక్, రద్దీ లేని సమయంలో టైమింగ్స్ ఇస్తున్నారు. జగ్గయ్యపేటకు చెందిన వారికి మాత్రం రద్దీ సమయాలలో నడిచేలా టైమింగ్‌ను సవరిస్తూ షెడ్యూల్ చేస్తున్నారు. ఐదేళ్లుగా ఇదే తంతు నడుస్తున్నా జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన అద్దె బస్సుల యజమానులు ప్రశ్నించలేదు. మంగళవారం అర్ధరాత్రి ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఒక సర్క్యులర్ జారీచేశారు. ఈ సర్క్యులర్ ప్రకారం విజయవాడకు చెందిన బస్సులను తెల్లవారుజామున టైమింగ్ ఇస్తూ, మిగిలిన వాటిని ఎనిమిది గంటల తర్వాత సవరించారు. విజయవాడకు చెందిన ఓ బడా అద్దె బస్సు యజమాని కోసం చాలా కాలంగా సమయాలను మార్చుతున్నారు. తాజాగా అదే వ్యక్తికి చెందిన బస్సులను బుధవారం నుంచి తెల్లవారుజామున తిరిగేలా సవరిస్తూ సర్క్యులర్‌ను జారీ చేశారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద మతలబే ఉంది. విజయవాడకు చెందిన తమకు అన్నీ చూసిపెట్టే ఇష్టమైన అద్దె బస్సు యజమాని కోసం ఈ సమయాలను సవరించారన్న విమర్శలు వస్తున్నాయి. ఇలా సవరించటం వల్ల బస్సులో రద్దీ ఉండదు.. తెల్లవారుఝాము సమయంలో ప్రయాణికులు పెద్దగా ఎక్కరు. ఆయిల్ ఖర్చు కూడా తగ్గుతుంది. బస్సు ఏమాత్రం నలగదు. తమకు ఇష్టమైన అద్దె బస్సు యజమాని ప్రయోజనాల కోసం ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏకంగా సర్క్యులర్‌నే జారీచేశారు. జగ్గయ్యపేట స్థానిక అద్దె బస్సుల యజమానులకు తాజా సర్క్యులర్‌తో కడుపు మండింది. అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బస్సులను నిలుపుదల చేశారు. దాదాపుగా 30కి పైగా బస్సులు ఆగిపోయాయి. ఒక్క విజయవాడకు చెందిన అద్దె బస్సు యజమాని మాత్రమే తన బస్సులు తిప్పాడు. అద్దె బస్సుల నిలిపివేతతో ప్రయాణికులు గొడవ పెట్టడంతో.. చివరికి ఉన్నతాధికారులు దిగి వచ్చి సర్క్యులర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దీంతో అద్దె బస్సుల యజమానులు తాత్కాలికంగా ఆందోళనను విరమించారు.



జగ్గయ్యపేట డిపో సమీపంలో నిలిచిపోయిన ఆర్టీసీ అద్దె బస్సులు

అద్దె బస్సుల యాజమాన్యాల నుంచి ఆర్టీసీ ఉన్నతాధికారులకు మామూళ్లు

సంస్థలో అద్దె బస్సుల ముసుగులో ఆర్టీసీ అధికారులు కొందరు కాసుల వేట సాగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో గడువు ముగిసిన అద్దె బస్సుల స్థానంలో కొత్త వాటికి టెండర్లు పిలవాల్సి ఉండగా.. పాతవాటినే పర్సంటేజీ పెంచి నడిపే విధంగా ఆదేశాలు ఇవ్వటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అద్దె బస్సుల యజమానులు ఆర్టీసీ బంకుల్లోనే డీజిల్ కొట్టించుకోవాలనే షరతు విధించారు. ముందే వారికి ఇచ్చే బిల్లుల నుంచి డీజిల్ బిల్లులను మినహాయించుకోవటం.. నెల నెలా ఆర్టీసీ అధికారులకు మామూళ్లు కూడా ముందే చెల్లించాలని షరతు విధించటంతో ఆ ప్రకారం జరిగిపోతోంది. డీజిల్ బిల్లుల పేరుతో కూడా మోసాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. జగ్గయ్యపేట వంటి స్థానిక అద్దె బస్సుల యజమానులు ఆర్టీసీ ఎప్పుడు కోరితే అప్పుడు సంక్రాంతికి స్పెషల్ బస్సులు ఇవ్వాల్సి ఉంటుంది. గత సంక్రాంతి బిల్లులు ఇప్పటి వరకు చెల్లించలేదు. ఇలా.. అద్దె బస్సుల యజమానులతో అన్నీ చేయించుకుంటూ అందినకాడికి ఉన్నతాధికారులు ప్రయోజనాలు పొందుతున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం తక్షణం విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తోట చిన్నారి వంటిపై కత్తి గాయాలు

మురుగునీటి వివాదం.. కత్తితో దాడి

గుడ్లవల్లేరు, జూలై 3 : గుడ్లవల్లేరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట చిన్నారిపై వైసీపీకి చెందిన ఊసా దశరథ రామయ్య కుటుంబసభ్యులతో కలిసి కత్తితో దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుడు మెడపై, వెన్ను, ఛాతి భాగంలో కత్తి పోట్లతో రక్త గాయాలు కాగా గుడివాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గతంలోనూ చిన్నారిపై ఒకసారి దాడి చేయగా పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేక పోవడం వల్లనే మళ్లీ కత్తితో దాడి చేశారని బాధితుని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు తోట చిన్నారి, దాడికి పాల్పడిన ఊసా దశరథ రామయ్య కుటుంబం ఎదురెదురు ఇళ్లలోనే వడ్లమన్నాడు గ్రామంలో నివసిస్తున్నారు. దశరథ రామయ్య ఇంటికి సంబంధించిన మురుగు చిన్నారి ఇంటివైపు వదులుతున్న విషయంపై వీరిరువురికీ గతంలోనూ ఘర్షణ జరిగింది. తిరిగి బుధవారం ఉదయం 10 గంటల సమయంలో వివాదం చెలరేగింది. గొడవ జరుగుతుండగా దశరథ రామయ్య, అతడి భార్య రామలక్ష్మి దాడిచేస్తూ, కుమారుడు సాయికుమార్‌ని ప్రోత్సహించడంతో కత్తితో విచక్షణా రహితంగా పొడిచాడని, బాధితుల ఫిర్యాదు మేరకు గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రానికే మోడల్‌గా మల్లవల్లి

» అన్ని సౌకర్యాలతో పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతాం : మంత్రి భరత్

» సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 3 : మల్లవల్లి పారిశ్రామికవాడలో అవసరమైన మౌలికసదుపాయాలను కల్పిస్తూ, సమస్యలను త్వరతగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటూ రాబోయే కాలంలో రాష్ట్రానికే మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడను బుధవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి సందర్శించారు. పారిశ్రామికవేత్తగా తనకు పరిశ్రమను నడపడం ఎంత కష్టమో తెలుసని, యువతకు ఉపాధి కల్పించే పారిశ్రామకవేత్తలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉందని మంత్రి అధికారులకు సూచించారు. విద్యుత్, నీరు, లాంటి మౌలికసదుపాయాలతో పాటు భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ, జోనల్ మేనేజర్ సీతారాంకు ఆదేశాలు జారీ చేశారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో త్వరితగతిన పరిష్కరించాలని ఏపీఐఐసీ అధికారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వం మారిన తరువాత చాలామంది పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. చంద్రబాబు అంటేనే అభివృద్ధికి బ్రాండ్ అని.. మల్లవల్లి పారిశ్రామికవాడను రాష్ట్రానికే మోడల్‌లా చేసి చూపించాల్సిన బాధ్యత మనపై ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ అన్నారు. పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ప్రధాన సమస్య అని పారిశ్రామికవేత్తలు తెలపడంతో అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి భరత్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అశోక్‌లేలాండ్ లాంటి పెద్ద బ్రాండ్‌లు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు వస్తున్న సమయంలో మౌలికసదుపాయాలపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని మంత్రి అధికారులకు సూచించారు. కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో అన్ని సమస్యలను రోజుల వ్యవధిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మల్లవల్లి మోడల్ పారిశ్రామికవాడను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు, పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహికపారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం అవసరమైన సహకారమందించేందుకు సిద్ధంగా ఉందని పరిశ్రమలమంత్రి భరత్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, అధికారులు హాజరయ్యారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి భరత్

ఇంటర్ లాకింగ్ పనులు.. పలు రైళ్ల రద్దు



రైల్వేస్టేషన్, జూలై 3 : విజయవాడ కొత్త వెస్ట్ బ్లాక్ హట్ మధ్య మూడవ లైన్ నిర్మాణం నేపథ్యంలో ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఆగస్టు 3వ తేదీ నుంచి పలు రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేస్తున్నట్లుగా విజయవాడ డివిజనల్ పీఆర్వో నుస్రత్ ఎం మంద్రూప్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే సమయంలో కొన్ని రైళ్లను రూట్ మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ-భద్రాచలం రోడ్డు అప్ అండ్ డౌన్, తెనాలి-విజయవాడ అప్ అండ్ డౌన్ రైళ్లను ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. 07630 తెనాలి- విజయవాడ, 07500 విజయవాడ- గూడూరు రైళ్లను 3 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. 07458 గూడూరు- విజయవాడ, 07781 విజయవాడ- మచిలీపట్నం రైళ్లను 4 నుంచి 11వ తేదీ వరకు, మాచర్ల- విజయవాడ, విజయవాడ-తెనాలి, విజయవాడ-గుంటూరు, గుంటూరు- విజయవాడ, విజయవాడ-డోర్నకల్, డోర్నకల్-విజయవాడ రైళ్లను 5 నుంచి 10 వరకు రద్దు చేస్తున్నారు. నర్సాపూర్-విజయవాడ, విజయవాడ-బిట్రగుంట రైళ్లను 3 నుంచి 10వ తేదీ వరకు, బిట్రగుంట-చెన్నై సర్కిల్ అప్ అండ్ డౌన్ రైలును 4 నుంచి 11వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. బిట్రగుంట- విజయవాడ, విజయవాడ-నర్సాపూర్ రైళ్లను 5 నుంచి 12వ తేదీ వరకు, నర్సాపూర్-గుంటూరు రైలును 4 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. గుంటూరు-రేపల్లె అప్ అండ్ డౌన్, గుంటూరు-విజయవాడ, విజయవాడ- నర్సాపూర్ రైళ్లను 5 నుంచి 11వ తేదీ వరకు, విజయవాడ-సికింద్రాబాద్ అప్ అండ్ డౌన్ రైలును 5 నుంచి 10వ తేదీ వరకు, గుంటూరు-సికింద్రాబాద్, సికింద్రాబాద్-గుంటూరు అప్ అండ్ డౌన్ రైళ్లను 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. బొబ్బిలి-విజయవాడ రైలు 4 నుంచి 10వ తేదీ వరకు, విజయవాడ హుబ్లీ రైలు 5 నుంచి 11వ తేదీ వరకు, విశాఖపట్నం-కడప రైలును 5 నుంచి 10వ తేదీ వరకు, కడప-విశాఖపట్నం రైలును 6 నుంచి 11వ తేదీ వరకు, విజయవాడ-చెన్నై సెంట్రల్ అప్ అండ్ డౌన్ రైలు 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. మంగళవారం తప్ప మిగతా రోజుల్లో నడిచే చెన్నై సెంట్రల్- విజయవాడ రైలును 5, 7, 8, 9, 10 తేదీల్లో రద్దు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో ఇదే రైలును అదే రోజుల్లో రద్దు చేస్తున్నారు.

దారి మళ్లింపు..

సికింద్రాబాద్-విశాఖపట్నం రైలును ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు, రాయనపాడు-గుణదల బైపాసింగ్ ద్వారా మళ్లిస్తారు. వీటికి విజయవాడలో స్టాపింగ్ ఉండదు. రాయనపాడులో టెంపరరీ స్టాపింగ్ ఏర్పాటు చేశారు. గాంధీనగర్-విశాఖపట్నం రైలును ఆగస్టు 4వ తేదీన, ఒకాపూరీ ఎక్స్‌ప్రెస్‌ను 7వ తేదీన, నిజాముద్దీన్ విశాఖపట్నం రైలును 4, 7 తేదీల్లో, ఛత్రపతి శివాజీ టెర్మినస్ భువనేశ్వర్ రైలును 2 నుంచి 10వ తేదీ వరకు దారి మళ్లిస్తారు. రాయనపాడు-గుణదల బైపాసింగ్ ద్వారా ఈ రైళ్లను నడుపుతారు. విజయవాడలో స్టాపింగ్ బదులు రాయనపాడులో తాత్కాలికంగా స్టాపింగ్ ఏర్పాటు చేశారు. యశ్వంత్‌పూర్- టాటా 4వ తేదీన, హైదరాబాద్ -షాలీమార్ 3 నుంచి 11వ తేదీ వరకు, షిరిడీ సాయినగర్-కాకినాడ పోర్టు 4, 6, 8 తేదీల్లో, ఇదే రైలు షిరిడీ సాయినగర్- విశాఖపట్నం ఆగస్టు 2, 9 తేదీల్లో, న్యూఢిల్లీ- విశాఖపట్నం 2 నుంచి 10వ తేదీ వరకు, హైదరాబాద్-విశాఖపట్నం 3 నుంచి 11వ తేదీ వరకు, విశాఖపట్నం-సికింద్రాబాద్ రైలు 2 నుంచి 10వ తేదీ వరకు, విశాఖపట్నం-న్యూఢిల్లీ 2 నుంచి 10వ తేదీ వరకు, భువనేశ్వర్-ఛత్రపతి శివాజీ టెర్మినల్ 2 నుంచి 10వ తేదీ వరకు, కాకినాడ పోర్టు- షిరిడీ సాయినగర్ 3, 5, 7, 10 తేదీల్లో, షాలీమార్- హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ 2 నుంచి 10వ తేదీ వరకు, విశాఖపట్నం-నిజాముద్దీన్ 5, 9 తేదీల్లో, విశాఖపట్నం-షిరిడీ సాయినగర్ రైలు 8న, టాటా- యశ్వంత్‌పూర్ 8వ తేదీన, విశాఖపట్నం-హైదరాబాద్ రైలు 3, 11 తేదీల్లో, విశాఖపట్నం- గాంధీనగర్ రైలును 8న, పూరీ ఒకా రైలును 5వ తేదీన, విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్ రైలు 2 నుంచి 10వ తేదీ వరకు, మచిలీపట్నం-షిరిడీ సాయినగర్ 6వ తేదీన దారి మళ్లిస్తున్నారు. నర్సాపూర్, నాగర్ సోల్ 3, 5, 6, 7, 8, 10 తేదీల్లో, మచిలీపట్నం-బీదర్ రైలును 3 నుంచి 11వ తేదీ వరకు, లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖపట్నం రైలును 2 నుంచి 10వ తేదీ వరకు, షిరిడీసాయినగర్ మచిలీపట్నం రైలును 7వ తేదీన, నాగర్‌సోల్-నర్సాపూర్ రైలును 2, 4, 6, 7, 8, 9 తేదీల్లో, బీదర్-మచిలీపట్నం రైలును 2 నుంచి 10వ తేదీ వరకు రాయనపాడు-గుణదల బైపాసింగ్ ద్వారా నడుపుతారు. రాయనపాడులో మాత్రమే స్టాపింగ్ ఉంటుంది. హైదరాబాద్- తాంబరం ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు, సికింద్రాబాద్-తిరుపతి రైలును 2, 4, 5, 6, 8, 9 తేదీల్లో దారి మళ్లిస్తారు. సికింద్రాబాద్- గుడూరు 2 నుంచి 10వ తేదీ వరకు, ఆదిలాబాద్-తిరుపతి 2 నుంచి 10వ తేదీ వరకు, తాంబరం- హైదరాబాద్ 2 నుంచి 10వ తేదీ వరకు, తిరుపతి-సికింద్రాబాద్ 3, 5, 6, 7, 9, 10 తేదీల్లో, గూడూరు- సికింద్రాబాద్ 3 నుంచి 9వ తేదీ వరకు, తిరుపతి-ఆదిలాబాద్ 3 నుంచి 9వ తేదీ వరకు దారి మళ్లిస్తారు.



కవలలు, మృతురాలు జంపన మాధవి (ఫైల్‌ఫొటో)

కాన్పుకోసం వచ్చి.. తల్లీ కవలల మృతి!

» వైద్యుల నిర్లక్ష్యమేనని బాధితుల ఆందోళన

» ఆసుపత్రిలో ప్రమాణాలపై ప్రత్యేక కమిటీ

» నివేదిక వచ్చాక చర్యలు.. డీఎంహెచ్‌వో వెల్లడి

పటమట, జూలై 3 : గంగూరు గ్రామానికి చెందిన జంపన మాధవి(24) పురిటినొప్పులతో బాధపడుతుంటే సోమవారం కుటుంబసభ్యులు పద్మావతి ఆసుపత్రిలో ప్రసవం కోసం చేర్పించారు. మాధవి ఒక బిడ్డకు సహజ ప్రసవం ద్వారా జన్మనిచ్చింది. పుట్టిన బాబు వెంటనే చనిపోయాడు. రెండో బిడ్డను ఆసుపత్రి వైద్యులు సిజేరియన్ ద్వారా బయటకు తీశారు. పుట్టిన వెంటనే ఆ బాబు కూడా చనిపోయాడు. తల్లి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రి యాజమాన్యం నగరంలో ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. చికిత్స పొందుతూ.. ఆరోగ్యం విషమించంతో మాధవి బుధవారం కన్నుమూసింది. ఆమెకు రక్తహీనత, కామెర్లు, ఓవర్ బ్లీడింగ్ సమస్యలతో బాధపడుతున్నట్టు ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. ఆమె భర్త ప్రశాంత్ గంగూరు సచివాలయ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి 14 నెలలు బాబు ఉన్నాడు. మృతురాలి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. మాధవి మృతదేహాన్ని పటమట హాస్పిటల్‌కు తీసుకువచ్చి ఆందోళన నిర్వహించేందుకు సిద్ధపడగా, పోలీసులు వారికి సర్దిచెప్పి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడెప్రసాద్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పటమట సీఐ మోహనరెడ్డి, సెక్టార్ ఎస్ఐ వల్లి పద్మ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి ప్రమాణాలపై కమిటీ..

పద్మావతి ఆసుపత్రిలో వైద్యం తీరుపై తమకు ఇప్పటికే పలు ఫిర్యాదులు వచ్చాయని, ఈ మేరకు మాధవి మృతిపట్ల బంధువులు తమకు సమాచారం ఇవ్వడంతో కమిటీని వేయడం జరిగిందని ఎన్టీఆర్ జిల్లా వైద్య అధికారిణి సుహాసిని తెలిపారు. సరైన వైద్య ప్రమాణాలు పాటించని ఆసుపత్రులను సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించారు.

ఉప లోకాయుక్త ఆదేశాలు.. ఇంక్రిమెంట్లు కట్

కర్నూలు(లీగల్), జూలై 3 : నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ డాక్యుమెంట్లను, వెబ్‌ల్యాండ్ వివరాలను అప్పటి జిల్లా గన్నవరం తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్లు మార్పులు చేర్పులు చేశారనే ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరి ఇంక్రిమెంట్లలో కోత విధించినట్టు ఉప లోకాయుక్తకు తెలిపింది. అప్పటి గన్నవరం తహసీల్దార్ ములుగు మాధురి, సబ్ రిజిస్ట్రార్ బి.సాయికృష్ణారెడ్డిలపై గన్నవరానికి చెందిన మాజీ సైనికోద్యోగి ముప్పనేని రవికుమార్ రాష్ట్ర ఉప లోకాయుక్తకు 2016లో ఫిర్యాదు చేశారు. దీంతో ఫిర్యాదిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఉప లోకాయుక్త రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు విచారించి అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్ ములుగు మాధురికి రెండు ఇంక్రిమెంట్లు, సబ్ రిజిస్ట్రార్ బి.సాయికృష్ణారెడ్డికి ఒక ఇంక్రిమెంటును ఒక ఏడాదిపాటు కోత విధించినట్లు ఉప లోకాయుక్తకు తెలిపింది.



గౌరంపాలెంలో సర్వే చేస్తున్న అధికారులు

వైసీపీ నేత ఆక్రమిత భూమి సర్వే

విస్సన్నపేట, జూలై 3 : తాతకుంట్ల శివారు గౌరంపాలెం గ్రామంలో వైసీపీ నేత ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్ఎస్ నంబరు 378లో 10.24 ఎకరాల భూమిలో బుధవారం మండల సర్వేయర్ శంకర్రావు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. భూమి ఆక్రమణలకు గురైనట్టు సర్వేలో గుర్తించామని, ఆక్రణదారులకు నోటీసులు ఇస్తామని పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, జూలై 3 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈనెల 15లోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. జిల్లాలోని ఉప, మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సిఫార్సులతో షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. అధికారుల సిఫార్సులు లేని, మెయిల్ ద్వారా, మాన్యువల్‌గా వచ్చిన దరఖాస్తులు స్వీకరించరన్నారు.

ఇల్లు ఖాళీ చేయమన్నందుకు హత్యాయత్నం

» నిందితుడి అరెస్టు

జి.కొండూరు, జూలై 3 : ఇల్లు ఖాళీ చేయనని గొడవకు దిగడమే కాకుండా సర్ది చెప్పేందుకు వెళ్లిన పెద్దలపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన ఓప్రబుద్ధుని వైనమిది. పోలీసుల కథనం ప్రకారం.. తిరువూరుకు చెందిన సంక్రాంతి సత్యకృష్ణ భార్యతో కలిసి రెండు మాసాల క్రితం వెల్లటూరు వచ్చి మాడుగల లక్ష్మీకుమారి ఇంట్లో అద్దెకు ఉంటూ అక్కడే కర్రీ పాయింట్ నడుపుతున్నాడు. రోజూమద్యం సేవించి అల్లరి చేస్తుండటంతో ఇల్లు ఖాళీ చేయమని లక్ష్మీకుమారి అతడికి చెప్పింది. అతడు గొడవకు దిగడంతో విషయం పెద్దలకు చెప్పింది. గ్రామానికి చెందిన పచ్చిగోళ్ల బాలకృష్ణ మరో ఇద్దరు గొడవ సర్దుబాటు చేసేందుకు రాగా.. సత్యకృష్ణ వారిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టే ప్రయత్నం చేశాడు. ఇంటి యజమానురాలి ఫిర్యాదు మేరకు సత్యకృష్ణను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై షబ్బీర్ అహమ్మద్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

త్రిశక్తిపీఠంలో 6 నుంచి వారాహి నవరాత్రులు

కృష్ణలంక, జూలై 3: క్రోధి నామ సంవత్సరం ఆషాఢ మాసం సందర్భంగా ఈనెల 6 నుంచి 15 వరకు త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారిని వారాహి అమ్మవారిగా అలంకరించి నవరాత్రులను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ తెలిపారు. 6 నుంచి 15 వరకు కాళీమాత అమ్మవారు వారాహి దేవిగా భక్తులకు దర్శనమిస్తారని, వారాహి హోమం జరపనున్న భక్తులు పూజా రుసుముగా రూ.వెయ్యి దేవస్థానం ఆఫీసులో చెల్లించి రసీదు పొందాలని వారు కోరారు.



నిరుపయోగంగా పార్కు స్థలం

పాడుబడిన లేబర్‌కాలనీలో నెంబరు -2 పార్కు

భవానీపురం, జూలై 3 : 44వ డివిజన్‌లోని లేబర్ కాలనీలో పాడుబడిన నంబర్ 2 పార్కును అభివృద్ధి చేయాలన్న ఆలోచన పాలకులకు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. కార్మికశాఖ స్థలాల్లో మూడు దశాబ్దాలు క్రితం ఇక్కడ ఇళ్ల నిర్మాణం అయ్యాయి. అప్పట్లోనే లేబర్‌కాలనీలో రెండు పార్కుల నిమిత్తం స్థలాలు కేటాయించారు. నంబర్- 1 పార్కును వైసీపీ హయాంలో అభివృద్ధి చేశారు. నంబర్ -2 పార్కు స్థలం మొండిగోడలతో చాలా సంవత్సరాలుగా కళావిహీనంగా మారింది. చిన్నారులు ఆడుకోవడానికి, స్థానికులు సేద తీరడానికి ఎలాంటి వసతులు లేకపోవడంతో ఇది నిరుపయోగంగా మారింది. దీన్ని చిల్డ్రన్స్ పార్కుగా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ రత్నకుమారి ప్రజలకు హామీ ఇచ్చారు. ఇది జరిగి రెండేళ్లు అవుతోంది. అయినా ఈ పార్కు వ్యవహారమై అతీగతీ లేకుండా ఉంది. కార్పొరేటర్ పదవీ కాలం మరో రెండేళ్లు ఉంది. ఈ పార్కు చిన్నారులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా పాలకవర్గం ద్వారా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మొండి గోడలతో పార్కు స్థలం

మహానటుడు ఎస్వీ రంగారావు



ఎస్వీ రంగారావుకు నివాళి అర్పిస్తున్న జనసేన నాయకులు

భవానీపురం, జూలై 3 : సితార సెంటర్‌లోని జనసేన కార్యాలయంలో 42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సినిమా, నాటకరంగంలో ఎలాంటి పాత్ర అయినా సింగిల్ టేక్‌లో చేయగలిగిన మహోన్నత నటుడు రంగారావు అని వక్తలు అన్నారు. ఆయన చిత్రపటం వద్ద నాయకులు కొబ్బరికాయలు కొట్టి నివాళి అర్పించారు. విజయవాడ జనసేన ప్రచార కమిటీ కార్యదర్శి తిరుపతి సురేష్, ఆదిత్యరెడ్డి, గణేష్, మణికంఠ, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌లు తెలిపారు.



ఎస్వీ రంగారావుకు నివాళి అర్పిస్తున్న బొండా ఉమా, హజరత్తయ్య గుప్తా తదితరులు

విజయవాడ కల్చరల్: తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఉన్న ఎస్వీ రంగారావు విగ్రహం వద్ద బుధవారం నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా హాజరై ప్రసంగించారు. ఎస్వీ రంగారావును వర్ధమాన నటులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బడేటి ధర్మారావు, శ్రీనివాసరావు, నరసింహరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆగస్టు 30న పొట్టి శ్రీరాములు కాలేజీలో జాతీయ హ్యాకథాన్

వన్‌టౌన్, జూలై 3: పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో ఈ ఏడాది ఆగస్టు 30న జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విద్యాశాఖ, ఐటీ, మానవవనరులశాఖ మంత్రి లోకేశ్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ ప్రాక్టికల్ లెర్నింగ్‌ను ప్రోత్సహించడాన్ని మంత్రి అభినందించారు. ఇంజనీరింగ్, డిప్లొమో, ఆర్ట్స్, సైన్స్, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, మెడిసిన్, ఫార్మసీ విద్యార్థులను హ్యాకథాన్‌కు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రెసిడెంట్ చలువాది మల్లిఖార్జునరావు, ఉపాధ్యక్షుడు పొట్టి సురేంద్రకుమార్, కార్యదర్శి సీఏ చిట్టా అమర్ సుధీర్, జాయింట్ సెక్రటరీ గ్రంధి పవన్‌కుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలి శాస్త్రి, డేటా సైన్స్ హెడ్ డాక్టర్ ఎస్‌కే అక్బర్‌లు హ్యాకథాన్ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి లోకేశ్



కామాక్షి స్వర్ణకార సంఘం సభ్యుడికి ఆర్థిక సాయం

వన్‌టౌన్, జూలై 3: ఊపిరితిత్తుల కేన్సర్‌తో బాధపడుతున్న విజయవాడ శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం సభ్యుడు ఎస్‌కే ఖాజాకు వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో సంఘం తరపున రూ.1.40 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు శివభావనారాయణ, ప్రధాన కార్యదర్శి మందరపు పోతులూరి ఆచారి, కోశాధికారి ఎస్‌కే సలీం, కార్యనిర్వాహక కార్యదర్శి తాళాబత్తుల భాస్కరరావు, వర్కింగ్ కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయి, ఉపాధ్యక్షులు రవికుమార్, టేకి రామకృష్ణ, బాలు, ముంతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చివేత

విద్యాధరపురం, జూలై 3: పశ్చిమలోని 42వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో వాటర్ పైపులైన్‌ల కోసం తీసిన గోతులను కార్పొరేషన్ సిబ్బంది బుధవారం పూడ్చివేశారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరికి స్థానికులు ఈ గోతుల వలన కలుగుతున్న ఇబ్బందులను తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన

పాయకాపురం, జూలై 3 : 64వ డివిజన్ కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం నాణ్యతను బుధవారం టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన పదార్థాలతో పాటు రుచిగా అందించాలని సూచించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

● విద్యుత్ శాఖ ఏఈకి శివశక్తినగర్ వాసుల వినతి



చిట్టినగర్, జూలై 3: చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ శివశక్తినగర్ ప్రాంతంలో విద్యుత్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని పలువురు స్థానికులు బుధవారం రామరాజ్యనగర్ ఏఈ రామలింగేశ్వరరావును కలసి వినతిపత్రం అందజేశారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ అంతరాయంతో దోమలు బెడదతో నరకయాతన పడుతున్నామని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ఏఈ కలిసిన వారిలో సాయి అమరావతి హైట్స్ అసోసియేషన్ కార్యదర్శి కంచు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కే.వెంకట్రావ్, జమ్ము శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రేషన్ డిపోలు, వాహనాల ఆకస్మిక తనిఖీలు



మొగల్రాజపురం, జూలై 3: రేషన్ డిపోలను, రేషన్ సరుకులు డోర్ డెలివరీ చేస్తున్న వాహనాలను పౌరసరఫరాల అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఆధ్వర్యంలో సహాయ పౌరసరఫరాల అధికారి సర్కిల్-2 ఎన్ఎస్ఎస్ ఆచారి, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ భగీరథ మొగల్రాజపురం, సత్యనారాయణపురంలో రేషన్ డిపోలు 224, 213, 214 లతో పాటు ఆయా డిపోల పరిధిలో రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయు వాహనాలను కూడా తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల్లో రికార్డుల ప్రకారం ఉండాల్సిన స్టాకును ఈ పోస్‌తో పాటు, ఫీల్డు స్టాకు నిల్వలను తనిఖీ చేశారు. స్టాకు బోర్డు, దుకాణం బోర్డులను, ఆథరైజేషన్ తదితరాలను పరిశీలించారు. ఎండీయు వాహనాల వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని డీలర్‌లకు, ఎండీయు ఆపరేటర్‌లను హెచ్చరించారు.

సత్తెనపల్లివారి వీధి పేరు మార్పు

● గుణదల దళితవాడలో ఆందోళన ● పేరు మార్చిన వ్యక్తిపై చర్యలకు డిమాండ్



బోర్డు తొలగించిన విషయాన్ని వివరిస్తున్న టీడీపీ నేత పొట్లూరి రవి

గుణదల, జూలై 3: గుణదల మూడవ డివిజన్లోని దళితవాడలో ఉన్న సత్తెనపల్లివారి వీధి పేరు గల బోర్డును ఓ వ్యక్తి పగలకొట్టి దాని స్థానంలో కోనేరువారి వీధి అని బోర్డు ఏర్పాటు చేయడంతో స్థానికులు బుధవారం ఆందోళనకు దిగారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి కార్పొరేటర్ దేవినేని అపర్ణ కౌన్సిల్లో ఆమోదం చేయించి అధికారికంగా సత్తెనపల్లి వారి వీధి బోర్డును ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం మూడవ డివిజన్ పరిధిలో ఉన్న అంబేడ్కర్ కాలనీలోని వారంతా 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా పనిచేశారు. తూర్పు నియోజకవర్గానికి తమ ఏరియా నుంచి మంచి మెజారిటీ వచ్చినప్పటికీ ఇలాంటి వారు తమ ప్రాంతంలో బలప్రదర్శన చూపించాలన్న ఆలోచన చేయడం దురదృష్టకరమని తక్షణమే నగరపాలకసంస్థ అధికారులు తమకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్థానికంగా ఉంటున్న టీడీపీ నేత పొట్లూరి రవి మీడియాతో మాట్లాడుతూ ఓ వ్యక్తి తన బలం చూపించుకోవడానికి ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడటం దురదృష్టకరమని అన్నారు. అధికారులు దీనిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో అంబేడ్కర్ కాలనీవాసులు ఆందోళనకు దిగటం ఖాయమని చెప్పారు. ఇలాంటి చిల్లర పనులు మానుకుంటే మంచిదని బోర్డును పగలకొట్టిన వారికి హితవు పలికారు.

కాపులకు కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్ పదవులివ్వండి

● సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మానికొండ కోదండపాణి

భారతీనగర్, జూలై 3: కాపులకు గత ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోయాయని, రాజకీయాల్లో ఉన్న కాపు నాయకులకు కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్ పదవులు ఇవ్వడం వలన గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆ వర్గానికి పూర్తి న్యాయం జరుగుతుందని కాపు సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మానికొండ కోదండ పాణి అన్నారు. బుధవారం కరెన్సీనగర్ కాలనీలోని సమితి కార్యాలయంలో కాపు సంఘాల నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి బలపరిచిన జనసేన, టీడీపీ, బీజేపీ అభ్యర్థులకు మద్దతు తెలిపి వారి విజయానికి కాపులు, తెలగలు, బలిజలు, తూర్పుకాపులు, ఒంటరి, మున్నూరు కాపులు ఎంతో సహకరించారని అన్నారు. రాజకీయాల్లో ఉన్న కాపు నాయకులకు కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్ పదవులు ఇవ్వాలని రాష్ట్ర కాపు సేవా సమితి తరపున, 13ఉమ్మడి జిల్లాల కాపు సంఘాల ప్రతినిధుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. కాపు సేవాసమితి గౌరవ సలహాదారుడు కూనపురెడ్డి రమేష్ బాబు, కాపు నాయకులు అర్జ గజేంద్రరావు, 13 జిల్లాల కాపు సంఘాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను శాస్త్రవేత్తలు అందిపుచ్చుకోవాలి

జగ్గయ్యపేట రూరల్, జూలై 3: రైతుల సంక్షేమం కోసం శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలు అందించటంతోపాటు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు ప్రమీలారాణి తెలిపారు. గరికపాడు కేవీకేను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రంలోని భూసార పరీక్షా కేంద్రం, విత్తన ఉత్పత్తి కేంద్రం, ప్రదర్శనా కేంద్రాలను పరిశీలించి శాస్త్రవేత్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రమీలారాణి మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు శాస్త్ర, సాంకేతికంగా వ్యవసాయంలో వస్తున్న మార్పులపై రైతులకు సలహాలు, సూచనలు అందించాలన్నారు. ముకుందరావు, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



రత్నరాజును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

స్కేటింగ్ విజేత రత్నరాజుకు అభినందన

వన్‌టౌన్, జూలై 3: ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం పొందిన సీహెచ్ రత్నరాజును బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అభినందించారు. విద్యార్థిని ప్రోత్సహించిన క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావును అభినందించారు. కళాశాల సెక్రటరి తూనికుంట్ల శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కే.రామకృష్ణ తదితర అధ్యాపకులు రత్నరాజుని అభినందించిన వారిలో ఉన్నారు.

దాడి ఘటనపై నిరసన

భవానీపురం, జూలై 3 : 44వ డివిజన్‌లోని వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావుపై జరిగిన దాడిని నిరసిస్తూ పశ్చిమ వైసీపీ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్ ఆధ్వర్యంలో చెరువు సెంటర్ వద్ద జెండా దిమ్మ కూల్చిన ప్రాంతంలో బుధవారం నాయకులు నిరసన తెలిపారు. జనసేన నాయకుల దుశ్చర్యలను ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు చోటు లేదని ఆసిఫ్ అన్నారు. కార్పొరేటర్లు మహ్మద్ ఇర్ఫాన్, యరడ్ల ఆంజనేయరెడ్డి, అప్పాజీ, నరేంద్ర రాఘవ, బాపతి కోటిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



స్వప్నిల్ దినకర్‌కు అభినందనలు తెలియజేస్తున్న ఫ్లోర్‌లీడర్ ఎన్.బాలస్వామి, కార్పొరేటర్లు

కమిషనర్‌కు టీడీపీ కార్పొరేటర్ల అభినందనలు

చిట్టినగర్, జూలై 3: శ్రీకాకుళం కలెక్టర్‌గా పదోన్నతి పొంది బదిలీ అయిన నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్‌ను బుధవారం వీఎంసీలోని ఆయన ఛాంబర్‌లో టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎన్.బాలస్వామి, కార్పొరేటర్లు కలసి వీడ్కోలు పలికి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు. ఆయనను కలిసిన వారిలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, చెన్నగిరి రామ్మోహన్ రావు, టీడీపీ నాయకులు నవనీతం సాంబశివరావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సత్యనారాయణపురం, జూలై 3: సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, లెవన్‌కేవీ లైన్లు మరమ్మతుల కారణంగా ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు టీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చల్లపల్లి వారి వీధి, జీఎస్‌రాజు రోడ్డు, రాణాప్రతాప్‌వీధి, కొమ్మువారి వీధి, బీపీ స్ట్రీట్, సుమాణం వారి వీధి, అమలిస్కూల్ రోడ్డు, మారుతీ వ్యాయామశాల, భగత్ సింగ్‌రోడ్డు, జనార్ధనరావు వీధి, కనకరాజు వీధి, కావూరివారి వీధి, నర్రావారి వీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలన్నారు.

మర్యాదపూర్వక కలయిక



అజిత్‌సింగ్‌నగర్, జూలై 3 : స్థానిక టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో అజిత్‌సింగ్‌నగర్ ఫొటో గ్రాఫర్స్ అసోషియేషన్ నేతలు బుధవారం ఎమ్మెల్యే బొండా ఉమాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన ఉమాను శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని, అసోషియేషన్‌కు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వ రుణాలు మంజూరు చేసే విధంగా కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన బొండా ఉమా సానుకూలంగా స్పందించారు. సభ్యుడు ఏ. రవికుమార్, రామకృష్ణ, వాసు, కె. రామరాజు, రమేష్, సుభాని, కిరణ్ పాల్గొన్నారు.

● అజిత్‌సింగ్‌నగర్ వాసవీ క్లబ్ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే బొండా ఉమాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొండా ఉమాకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం ఆర్యవైశ్యుల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని, ఆర్యవైశ్యుల అభ్యున్నతికి తోడ్పడాలని ఆయనను కోరారు. బొండా ఉమాను కలిసిన వారిలో కొల్లి మల్లిఖార్జునకుమార్, రామాంజనేయులు, కేవీ భాస్కరరావు తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండి

భవానీపురం, జూలై 3 : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగంను తగ్గించి ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని జనసేన 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష కోరారు. ప్లాస్టిక్ రహిత దినం సందర్భంగా సితార సెంటర్‌లోని కార్యాలయంలో ఆమె బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్లాస్టిక్ ను దూరం పెట్టి జనపనార, క్లాత్‌తో తయారు చేసిన బ్యాగులను వాడాలని ఆమె కోరారు. నాయకులు పసుపులేటి నాగకృష్ణ, ఆదిత్యరెడ్డి, దాసి రామ్మోహన్‌లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 4 జూలై 2024
cinema@andhrajyothy.com


ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్

ఎఫ్ 2, ఎఫ్ 3 చిత్రాల సూపర్ హిట్ కాంబో విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి, దిల్ రాజు హ్యాట్రిక్ ఇవ్వడం కోసం మళ్లీ చేతులు కలిపారు. దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనరుపై శిరీష్ నిర్మించే ఈ చిత్రం షూటింగ్ బుధవారం రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. వెంకటేశ్, మీనాక్షి చౌదరిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్ ఆన్



చేయగా, మరో నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ ఇచ్చారు. సీనియర్ దర్శకుడు రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. మరో దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్ అందజేశారు. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల మధ్య తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. ఈ సినిమాలో వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్నారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేశ్, వి.టి. గణేశ్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, ఆనంద్‌రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేశ్ బాలరాజ్ ఇతర ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: సమీర్ రెడ్డి, ఎడిటింగ్: తమ్మిరాజు, సహ రచయితలు: ఎస్.కృష్ణ, జి.ఆదినారాయణ.

అమితాబ్ అశ్వత్థామ అయ్యారు ఇలా..





పాన్ ఇండియా లేటెస్ట్ సంచలనం 'కల్కి 2898 ఏ.డీ'. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులతో దూసుకుపోతోందీ చిత్రం. ఇందులో బాలీవుడ్ నటుడు అమితాబ్ 'అశ్వత్థామ' పాత్రను పోషించారు. 81 ఏళ్ల వయసులోనూ ఆయన చేసిన పోరాటాలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. ఈ సినిమాలో ఆయన లుక్ కోసం ప్రతీరోజు మేకప్ వేసుకోవడానికి మూడు గంటలు, తీయడానికి మరో మూడు గంటలు.. మొత్తంగా ఆరు గంటలు వెచ్చించేవారని చిత్ర బృందం తెలిపింది. తాజాగా, అమితాబ్, 'అశ్వత్థామ' క్యారెక్టర్ కోసం సిద్ధమయ్యేటప్పుడు తీసిన ఫొటోలను మేకప్ డిపార్ట్‌మెంట్ సభ్యులు ఇన్‌స్టాలో షేర్ చేశారు. "లెజెండ్ అమితాబ్ పోరాట యోధుడు 'అశ్వత్థామ'గా మారే సమయంలో తీసిన ఫొటోలివి" అంటూ బిహైండ్ ద సీన్స్‌ను పోస్ట్ చేశారు. కాగా, ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీ దత్ నిర్మించారు. జూన్ 27న విడుదలైన ఈ సినిమా ఇప్పటికే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.600 కోట్ల పైచిలుకు కలెక్షన్లు సాధించి.. మరింత భారీ విజయం దిశగా సాగుతోంది.



అదీ ఆయన గొప్ప మనసు

జానీమాస్టర్

టాలీవుడ్ డాన్సర్స్ యూనియన్‌లోని 500 మంది సభ్యులు, వారి కుటుంబాలకు ఆరోగ్యబీమా అందించేందుకు రామ్‌చరణ్ ముందుకొచ్చారు. ఈ విషయాన్ని జానీమాస్టర్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఎప్పుడో ఓ మాట అడిగితే గుర్తుపెట్టుకొని మరీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఇన్ని కుటుంబాలకు సాయం చేసేందుకు రామ్‌చరణ్ ముందుకు వచ్చారని అభినందించారు. చిరంజీవి సైతం తన ఆశీస్సులు అందించారని చెప్పారు. మా డాన్సర్స్ అసోషియేషన్ తరఫున అన్న, వదిన (రామ్‌చరణ్, ఉపాసన)కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. 'మీలాంటి గొప్ప మనసున్న వ్యక్తులతో కలసి పనిచేయడం నా అదృష్టం' అని జానీమాస్టర్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. నా పుట్టిన రోజు సందర్భంగా రామ్‌చరణ్ నన్ను స్వయంగా ఇంటికి పిలిచి అభినందనలు తెలిపారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్, ఉపాసన దంపతులతో దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.


ఇది మనందరి కథ



నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ ఇది. హృదయాలను కదిలించే భావోద్వేగాలతో దర్శకుడు నందకిశోర్ ఈ సినిమాను రూపొందించారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల్లో ఒకరైన రానా దగ్గుబాటి మాట్లాడుతూ 'నందు ఈ కథ చెప్పినప్పుడు నాకు నేను గుర్తుకు వచ్చాను. నా కోసం అమ్మ పడిన కష్టం స్ఫురణకు వచ్చింది. ఇది మన అందరి కథ. చాలా మంది లైఫ్ ఇలాగే ఉంటుంది. కమర్షియల్ సినిమాలు చాలా వస్తుంటాయి కానీ ఇటువంటి చిత్రాలు చాలా అరుదు. నివేదకి కథ నచ్చితే ఆ కథతోనే ఉంటుంది. సినిమా బాగా రావడానికి ఎంతో సపోర్ట్ చేస్తుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది' అన్నారు. 'నా కెరీర్‌లో బెస్ట్ అంతా రామానాయుడు స్టూడియోలోనే జరిగింది. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత నాకు రానా మొదట పరిచయమయ్యారు. నా కెరీర్‌లో చాలా స్పెషల్ ఫిల్మ్ '35.. చిన్న కథ కాదు'. ఇందులో మదర్ రోల్ పోషించా. ఇంతవరకూ నేను చేసిన పాత్రలకు చాలా భిన్నమైంది' అన్నారు. మనసుని కదలించే సినిమా ఇదని నటుడు విశ్వదేవ్ చెప్పారు. ఈ సినిమాను రానా నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లారని చిత్ర నిర్మాత సృజన్ యరబోలు చెప్పారు. ఇది చిన్న సినిమా కాదనీ.. చాలా పెద్ద సినిమా అని ఆయన తెలిపారు.

లేడీ క్యారెక్టర్‌లో విష్వక్‌సేన్





సినిమా సినిమాకు వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుని మెప్పిస్తున్న విష్వక్‌సేన్.. లేడీ క్యారెక్టర్‌లో కనిపించనున్న చిత్రం 'లైలా'. అయితే ఇందులో ఆయన సినిమా మొత్తం ఇదే గెటప్‌లో ఉంటారా.. కేవలం కొద్ది సేపు మాత్రమే ఈ లుక్‌లో కనిపిస్తారా అనేది సినిమా రిలీజ్ అయ్యేవరకు వేచి చూడాల్సిందే. ఫస్ట్ లుక్‌తోనే విపరీతమైన బజ్‌ను క్రియేట్ చేసిన ఈ 'లైలా' క్యారెక్టర్ థియేటర్లలోకి వచ్చాక ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు రామ్‌నారాయణ్ దర్శకత్వం వహిస్తున్నారు, సాహు గారపాటి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాని ప్రారంభించి ఇందులో విష్వక్‌సేన్ పోషించే 'లైలా' 'ఏ' లుక్‌ను విడుదల చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు కె. రాఘవేంద్రరావు క్లాప్ ఇవ్వగా, దర్శకుడు హరీశ్ శంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. వెంకట సతీశ్‌కిలారు, జెమిని కిరణ్ స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సినిమాలో కథానాయికగా ఆకాంక్ష శర్మ నటిస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్: అన్వర్ అలీ, డీఓపీ: రిచర్డ్ ప్రసాద్, సంగీతం: జిబ్రాన్.

ఆగస్టులో సెట్స్‌పైకి



'కల్కి 2898 ఏడీ' చిత్రం సూపర్‌హిట్ అయిన ఆనందంలో ఉన్న ప్రభాస్ అభిమానులకు మరో తీపి కబురు. ఆయన కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సలార్' ఫ్రాంఛైజీలో వస్తున్న 'సలార్ 2' చిత్రం సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధమైందని సమాచారం. ఆగస్టు 10 నుంచి ప్రశాంత్ నీల్ చిత్రీకరణ కొనసాగించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. 15 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ప్రభాస్, పృథ్వీరాజ్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. 'కల్కి 2898 ఏడీ' విడుదలవ్వడంతో ప్రభాస్ కూడా 'సలార్ 2' పై దృష్టి పెట్టనున్నారు. ఈ చిత్రం 2025లో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'సలార్' తొలి భాగం సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. మేకర్స్ ఈ చిత్రానికి కొనసాగింపుగా 'సలార్: శౌర్యాంగపర్వ' పేరుతో రెండో భాగాన్ని ప్రకటించారు. అయితే తొలిభాగాన్ని తెరకెక్కించే సమయంలోనే రెండో భాగానికి సంబంధించి దాదాపు 20 శాతం చిత్రీకరణ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. శ్రుతీహాసన్ కథానాయికగా నటిస్తుండగా, హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తోంది.

సైకో స్టోరీ



రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్నారు. రాధిక శరత్‌కుమార్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ పై 'ఎ సైకో స్టోరీ' అని క్యాప్షన్ పెట్టారు. యాక్షన్ సీక్వెన్స్‌లోని హీరో రక్షిత్ స్టిల్‌తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. ఈ చిత్ర విజయంపై యూనిట్ కాన్ఫిడెంట్‌గా ఉంది. చరణ్‌రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, విద్యాసాగర్, టీవీ 5 మూర్తి, కార్తీక్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: లక్ష్మీ లోహిత్ పూజారి, సంగీతం: శరవణ వాసుదేవన్, ఫొటోగ్రఫీ: నాని చమిడిశెట్టి, ఎడిటింగ్: సత్య గిద్దుటూరి , ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొల్లేటి.

ఆ సమయం వస్తే నేనే చెప్తా



'రన్ రాజా రన్' చిత్రంతో తెలుగుతెరకు పరిచయమయ్యారు సీరత్‌కపూర్. చాలా గ్యాప్ తర్వాత 'మనమే' చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో మెప్పించారు. నటిగా, గాయనిగా రాణిస్తోన్న సీరత్.. ఈ మధ్య లవ్‌లో పడ్డారని.. అమన్ సింగ్ అనే నటుడితో డేటింగ్‌లో ఉన్నారంటూ రూమర్స్ వస్తున్నాయి. ఈ విషయమై ఓ విలేఖరి ఆమెను ప్రశ్నించగా.. ఇలా సమాధానమిచ్చారు. 'ప్రస్తుతం నా ఫోకస్ అంతా కెరీర్, ఫ్యామిలీ పైనే ఉంది. నేను ఏ విషయాన్ని దాచుకునే వ్యక్తిని కాదు. ఒకవేళ నా వ్యక్తిగత జీవితం గురించి మీ అందరికీ ఏ విషయమైనా తెలియాల్సిన సమయం వస్తే నేనే ముందుగా చెప్తాను. సినిమాల ఎంపికలో నా మనసు మాట వింటా. సినిమాల్లో నేను పోషించే పాత్రలు చాలా బాగుంటాయని అభిమానులు ప్రశంసిస్తుంటారు. అది నాకెంతో ఆనందాన్నిస్తుంది. ఈ ప్రశంసలు.. గుర్తింపు.. నేను పోషించే పాత్రలను మరింతగా అచితూచి ఎంచుకునేలా చేస్తాయి' అని చెప్పారు. రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అమన్.. నటుడిగా సినిమాల్లో పలు సినిమాల్లో నటించారు. సీరత్ కపూర్ ఆలపించిన 'ఆవో నా' పాటలో సీరత్‌తో కలసి నటించారు. ఈ పాటలో వారిద్దరి కెమెస్ట్రీ అందరినీ ఆకట్టుకుంది.

బేబీజాన్‌కు అతిథిగా



తమిళ దర్శకుడు అట్లీ నిర్మాతగా రూపొందుతున్న బాలీవుడ్ చిత్రం 'బేబీ జాన్'. విజయ్ హీరోగా అట్లీ దర్శకత్వం వహించిన తమిళ బ్లాక్‌బస్టర్ 'థెరీ' చిత్రానికి ఇది రీమేక్. కలీస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో కీర్తి సురేశ్ కథానాయికగా బాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. అయితే హిందీ చిత్రసీమలోఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త వినిపిస్తోంది. 'బేబీజాన్'లో సల్మాన్‌ఖాన్ అతిథి పాత్రలో కనిపించనున్నారని టాక్. ఆయన కోసమే ప్రత్యేకంగా అట్లీ ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేశారట. దీన్ని ఆగస్టులో వరుణ్‌ధావన్, సల్మాన్‌ఖాన్‌పై చిత్రీకరించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఈ ఏడాది క్రిస్మస్‌కు 'బేబీ జాన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు సల్మాన్‌ఖాన్‌తో అట్లీ ఓ సినిమా చేస్తున్నట్లు కొన్నాళ్లుగా ప్రచారంలో ఉంది. ఇందులో కమల్‌హాసన్ కీలకపాత్రలో నటిస్తున్నారనే వార్తలు వినిపించాయి. కానీ ఈ కాంబినేషన్‌పై ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా రాలేదు.

తెలుగు అభిమానుల్ని మిస్ అవుతున్నా



నటి రకుల్ ప్రీత్ సింగ్ 'భారతీయుడు 2' చిత్రంతో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు. 12న విడుదలవుతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్ నిర్వహించారు. ఇందులో అభిమానులతో పలు విషయాలను ఆమె షేర్ చేసుకున్నారు.

'టాప్ డైరెక్టర్ శంకర్ సినిమాలో నటించడం నా అదృష్టం. ఆయనతో పనిచేయాలనే కోరిక ఈ సినిమాతో నెరవేరింది. ఈ సినిమా విడుదల కోసం చాలా ఆతృతగా ఎదురుచూస్తున్నాను. ఆయన తెరపై సృష్టించే క్యారెక్టర్స్ అద్భుతంగా ఉంటాయి. సెట్‌లో ఆయన ఆలోచనలు, దర్శకత్వ పటిమను చూసి ఆశ్చర్యపోయేదాన్ని. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. తెలుగులో నటించి చాలా కాలమైంది. తెలుగు అభిమానుల్ని మిస్ అవుతున్నా. ప్రస్తుతం తెలుగులో సినిమా చేయడానికే కొన్ని కథలు వింటున్నా. నచ్చిన స్క్రిప్ట్ దొరగ్గానే నటిస్తాను" అని చెప్పారు.

భయ పెడుతున్న భామ



అప్సరా రాణి, విజయ్‌శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'రాచరికం'. సురేశ్ లంకలపల్లి దర్శకత్వంలో ఈశ్వర్ నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం. హీరోయిన్ అప్సరా రాణి స్పెషల్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. కాళీ మాత ఉగ్రరూపం దాల్చితే ఎలా ఉంటుందో ఆ పోస్టర్‌లో అప్సర అంత భయంకరంగా కనిపించారు. థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో, సగటు ప్రేక్షకుడిని కట్టి పడేసే సన్నివేశాలతో చిత్రం రూపొందుతోందని దర్శకుడు చెప్పారు. వరుణ్ సందేశ్ పోషించిన మాస్ రోల్ పూనకాలు తెప్పిస్తుందన్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. హైపర్ ఆది, రంగస్థలం మహేశ్, విజయరామరాజు, శ్రీకాంత్ అయ్యంగార్, ప్రాచీ థాకర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: రామ్‌ప్రసాద్, సంగీతం: వెంగి, ఫొటోగ్రఫీ: ఆర్య సాయికృష్ణ.

ఆకట్టుకునే అన్నాచెల్లెళ్ల కథతో



అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే గ్రామీణ కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'చిట్టి పొట్టి'. భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా బేనర్‌పై భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే చిత్రబృందం గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కుటుంబ అనుబంధాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఒక ఆడబిడ్డకు పుట్టింటిపై ఉన్న మమకారాన్ని తెలిపే చిత్రమిది. మహిళల గొప్పతనం నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని చెప్పారు. కాంతమ్మ, ఆచారి, హర్ష కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీ వెంకట్, సినిమాటోగ్రఫీ: జోషీ, ఎడిటర్: బాలకృష్ణ బోయ

చౌకీదార్ చిత్రీకరణ మొదలు



పృథ్వీ అంబర్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'చౌకీదార్' చిత్రీకరణ బుధవారం ప్రారంభమైంది. బెంగళూరులోని బండే మహంకాళి ఆలయంలో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. నిర్మాత కల్లహళ్లి చంద్రశేఖర్ క్లాప్ ఇచ్చారు. కీలకపాత్ర పోషిస్తున్న సాయికుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ చిత్రంలో ధన్యా రామ్‌కుమార్ కథానాయికగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పృథ్వీ యాక్షన్ రోల్ చేస్తున్నారు. ఆయన పాత్ర కొత్త తరహాలో ఉండబోతోంది. తన పాత్రలో వైవిధ్యం చూపేందుకు ఆయన చాలా కష్టపడుతున్నారు. పృథ్వీ అంబర్ మాట్లాడుతూ 'ఒక్క రోజులో టీజర్‌ను చిత్రీకరించాం. చాలా సరదాగా అనిపించింది. ఈ చిత్రంలో చాలా జీవిత అనుభవాలు ఉన్నాయి. మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్ కథలో ఉన్నాయి' అన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ 'నాకు చాలా సంతోషంగా ఉంది. వచ్చే ఏడాది 50 ఏళ్లు పూర్తవుతున్నాయి. చౌకీదార్ కథ ఎమోషనల్ డ్రామా. ఇది చాలా మంచి సబ్జెక్ట్' అన్నారు. 'ఇది చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. షూటింగ్ త్వరలో ప్రారంభమౌతుంది. పలు భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని నిర్మాత చెప్పారు. సచిన్ బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

ఆ ఆలోచనలను కట్టడి చేసేదెలా?

నేను 19 ఏళ్ల కాలేజ్ స్టూడెంట్‌ని. మనసు లైంగిక ఆలోచ నల మీదకు పరుగులు తీస్తోంది. దాంతో చదువు మీద ధ్యాస తగ్గుతోంది. అసలు ఇదేమైనా జబ్బా? ఇలాంటి భావనల్ని ఎలా నియంత్రించుకోవాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

Q A

కౌన్సెలింగ్



యవ్వనంలో సెక్స్ గురించిన ఆలోచనలు కలగటం అత్యంత సహజం. ఇలా అందరికీ జరుగుతుంది. అయితే ఎప్పుడూ సెక్స్ గురించే ఆలోచిస్తూ ఉండటం మాత్రం కరెక్ట్ కాదు. అలా ఆలోచించే కొద్దీ అవే ఆలోచనలు పదేపదే కలుగుతూ ఉంటాయి. దాంతో కోరిక పెరిగి మీరేం పని చేస్తున్నా బ్యాక్‌గ్రౌండ్‌లో ఆ ఆలోచనలు నడుస్తూనే ఉంటాయి. సెక్స్ ఆలోచనలను నియంత్రించటానికి ఈ మార్గాలను అనుసరించండి.

- లైంగిక ఆలోచనల్ని ప్రేరేపించే అంశాలు ఎన్నో ఉంటాయి. వాటిని గుర్తించి ఆ అవకాశాలను నియంత్రించగలిగితే సెక్స్ ఆలోచనలు తగ్గుతాయి. ఒత్తిడి, పదే పదే సెక్స్ గురించి ఆలోచించటం లైంగిక ఆలోచనలకు ప్రధాన ప్రేరేపణలు. కాబట్టి వాటికి దూరంగా ఉండండి.
- విల్ పవర్ పెంచుకోండి. నిజంగానే సెక్స్ గురించి ఆలోచించకుండా ఉండాలనుకుంటే మీకు మీరే ఓ ఒప్పందం చేసుకోండి. దానికి కట్టుబడి ఉండండి.
- సెక్స్ గురించి ఆలోచించే సమయాన్ని ఏదైనా క్రియేటివ్ పనికి కేటాయించండి. రాయటం, చదవటం, పెయింటింగ్, స్కల్ప్‌టింగ్, సంగీతం వినటం, ఆటలాడటం... ఇలా ఇష్టమైన అభిరుచి వైపు మనసు మళ్లించండి.
- ఒకవేళ ఇలాంటి హాబీలకు అనువైన ప్రదేశంలో రోజులో ఎక్కువ సమయం గడిపే పనైతే చేసే పని మీద మనసు పెట్టండి. చేస్తున్న పని మీద ఇష్టం పెంచుకుంటే వేరే విషయాల మీదకు మనసు వెళ్లదు.
- ఖాళీ సమయం లేకుండా చూసుకోండి. ఖాళీ దొరికితే మనసు పరిపరివిధాల పోతుంది. కాబట్టి ఆ అవకాశం దొరక్కుండా రోజంతటినీ వీలైనన్ని ఎక్కువ యాక్టివిటీస్‌కు కేటాయించండి.

డాక్టర్. షర్మిల మజుందార్
కన్సల్టెంట్ సెక్సాలజిస్ట్,
mili77@gmail.com



హైదరాబాద్‌లో తొలి ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒకటైన ఫెర్నాండెజ్ ఆసుపత్రిది డెబ్భై ఆరేళ్ల చరిత్ర... ఆ వారసత్వాన్నే కాదు తన తల్లితండ్రులు నిర్దేశించిన విలువలను కూడా రాజీ లేకుండా కొనసాగిస్తున్నారు ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ **డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్**. మిడ్‌వైఫరీ (మంత్రసాని) వ్యవస్థను బలోపేతం చేసిన, ప్రభుత్వ వైద్య సంస్థల కోసం శిక్షణ అందిస్తున్న ప్రైవేటు ఆసుపత్రిగా ఘనతను అందుకున్నా... బిడ్డను కన్న తల్లి కళ్లలో కనిపించే ఆనందాన్ని చూడడం కన్నా గొప్ప అనుభూతి మరెక్కడా దొరకదంటున్న ఆమె 'నవ్య'తో ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలివి.

వాళ్లంతా నా పిల్లలే..

"నేనూ డాక్టర్ కావాలనుకుంటున్నా... ఎనిమిదేళ్ల వయసులో ఈ మాట నేను చెప్పగానే మా అమ్మ ఆశ్చర్యపోయారు. "నువ్వు డాక్టర్ అవ్వాలనుకుంటున్నావా? అది చాలా కష్టమైన జీవితం" అన్నారామె. "అవును! నేనూ మీలా డాక్టరే కావాలనుకుంటున్నాను" అన్నాను. కచ్చితంగానే చెబుతున్నావా? అది చాలా కష్టం. నిద్రలేని రాత్రులు ఎన్నో ఉంటాయి" అన్నారు. "లేదు! డాక్టరే అవుతాను" అని స్పష్టంగా చెప్పాను. నేను వేరే ఏదైనా చేస్తే బాగుంటుందని నా తల్లితండ్రులు అనుకున్నారు. నా సిస్టర్స్ డాక్టర్లు అవ్వాలనుకోలేదు. కానీ నేను దృఢంగా నిశ్చయించుకున్నాను. ఎందుకంటే వైద్యులుగా నా తల్లితండ్రుల్లో కనిపించే ఆనందాన్ని నేను గమనించాను. మా అమ్మ లూర్డ్ ఫెర్నాండెజ్, నాన్న లెస్లీ ఫెర్నాండెజ్ వైద్యులు. అమ్మ హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో పని చేశారు. తరువాత... 1948లో... బొగ్గులకుంటలో సొంతంగా ఆసుపత్రిని ప్రారంభించారు. ఇది హైదరాబాద్‌లో బహుశా రెండవ ప్రైవేట్ ఆసుపత్రి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి కొన్ని రోజులే అయింది. నైజాం రాష్ట్రంలో పరిస్థితులు అల్లకల్లోలంగా ఉన్నాయి. అటువంటి సమయంలో ఇద్దరు యువ వైద్యులు ఒక ప్రైవేట్ ఆసుపత్రిని ప్రారంభించడం ఊహకు అందని విషయం, ఎంతో సాహసోపేతమైన నిర్ణయం. వైద్యులుగా నా తల్లితండ్రులు క్షణం తీరికలేకుండా ఉండేవాళ్ళు. మా కుటుంబం కలిసి భోజనం చేయడానికి కేవలం రాత్రి పూట మాత్రమే వీలయ్యేది. ఆ సమయంలో వారి అనుభవాలను పంచుకొనేవారు. ప్రజలకు చికిత్స చేయడంలో ఉన్న ఆనందం, డబ్బు ఇచ్చుకోలేనివారికి సాయం చెయ్యడంలో ఉన్న సంతోషం, బాధలో ఉన్నవారికి స్వస్థత చేకూర్చడంలో ఉన్న సంతృప్తి... ఇవన్నీ వారి



మాటల్లో వ్యక్తమయ్యేవి. కొన్నిసార్లు ఏ శిశువైనా మరణించినప్పుడు... ఆ సంగతి చెబుతూ మా అమ్మ కన్నీళ్ళు పెట్టుకొనేవారు. ఇవన్నీ నాలో స్థిరంగా నాటుకుపోయాయి. వైద్యురాలు కావాలనే నా ఆకాంక్షకు ఇవన్నీ బీజం వేశాయి. ఆ నిర్ణయం తీసుకున్నందుకు నేను ఇప్పటికీ ఎంతో సంతోషిస్తూ ఉంటాను.

నన్ను చూసి చాలామంది నవ్వుకున్నారు...

నేను కాలేజీ చదువు పూర్తిచేసేసరికి తెలంగాణ ఉద్యమం మొదలైంది. తెలంగాణలో కాలేజీలన్నీ మూతపడ్డాయి. దాంతో వేరే రాష్ట్రాల్లో మెడికల్ సీటు కోసం అప్లై చేశాను. బెంగళూరు సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. అక్కడ చదువుకున్నాను. ఎంబీబీఎస్ పూర్తి చేశాక... హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో డిప్లమా చేశాను. ఏడాది పాటు సుల్తాన్ బజార్ ఆసుపత్రిలో పని చేశాను. ఆ తరువాత... "నువ్వు దేశం బయటకు వెళ్ళి... ప్రపంచ వైద్యరంగం ఎలా ఉందో పరిశీలించు" అని నా తల్లితండ్రులు సూచించారు. అప్పుడు నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం యుకెలోని 'రాయల్ కాలేజీ ఆఫ్ అబ్స్టెట్రిషన్ అండ్ గైనకాలజిస్ట్స్'కు అప్లై చేశాను. రెండేళ్ళ పాటు గాంధీ ఆసుపత్రిలో ఎవరి నేతృత్వంలో పని చేశానో... ఆయన రాయల్ కాలేజీలో మెంబర్‌గా ఉన్నారు. "మీరు ఇప్పటికే మా మెంబర్ దగ్గర పని చేశారు కాబట్టి... యూకే రానక్కర్లేదు. ఈ రెండేళ్ళ కోర్సు మీరు కొనసాగిస్తున్నట్టే పరిగణిస్తాం" అని కాలేజీ యాజమాన్యం చెప్పింది. నేను చేయాల్సిందల్లా పరీక్షకు హాజరు కావడమే. తరువాత యూకే వెళ్ళి... అక్కడి వైద్య వ్యవస్థపై అవగాహన సంపాదించాను. పరీక్ష రాసి, రాయల్ కాలేజీలో మెంబర్‌షిప్ తీసుకొని వచ్చాను. 1984లో మా ఆసుపత్రిలోనే వైద్యురాలుగా చేరాను. 1985లో ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలు తీసుకున్నాను. దాన్ని రెండు పడకలతో మా తల్లితండ్రులు ప్రారంభించారు. నేను బాధ్యతలు చేపట్టేసరికి 35 బెడ్స్ ఉన్నాయి. అప్పట్లో ఆర్థోపెడిక్స్, ఇఎన్‌టి, జనరల్ సర్జరీ... ఇలా అనేక ఇతర విభాగాల్లో సేవలు అందించేవారు. పూర్తిస్థాయి నర్సింగ్ హోమ్‌గా ఉండేది. నేను కేవలం ప్రెగ్నెన్సీ అండ్ చైల్డ్ బర్త్ కోసమే మా ఆసుపత్రిని ప్రత్యేకంగా రూపుదిద్దాలనుకున్నాను. ఆ మేరకు రెండేళ్ళలో పూర్తిగా మార్పులు తెచ్చాను. ఒక వైద్య బృందాన్ని తయారు చేసి... ఫెర్నాండెజ్ ఆసుపత్రిని మదర్ కేర్ సెంటర్‌గా మార్చాను. గర్భిణులకు, బాలింతలకు, నవజాత శిశువులకు 24 గంటలూ సేవలు అందించడం అవసరమనేది నా ఉద్దేశం. అప్పుడు చాలామంది నన్ను చూసి నవ్వుకున్నారు. ఎందుకంటే 'సింగిల్ స్పెషాలిటీ ఆసుపత్రి' అనే కాన్సెప్ట్ అప్పటికి లేదు. అదీ కాకుండా... గర్భిణులు, శిశువుల సంరక్షణ, ప్రసవాలు అనేవి లాభదాయకమైన సేవలుగా పరిగణించేవారు కాదు. పెద్ద ఆసుపత్రుల్లో అది కేవలం ఒక చిన్న విభాగంగా మాత్రమే ఉండేది. మహిళలకు, పిల్లలకు ప్రత్యేకించిన ఆసుపత్రులను నేను బ్రిటన్‌లో చూశాను. ఆ కాన్సెప్ట్‌ను ఇక్కడికి తెచ్చాను. 1992 నాటికి... పేషెంట్స్ సంఖ్య బాగా పెరగడంతో... పాత ఆసుపత్రి సరిపోని పరిస్థితి... దాని స్థానంలో ప్రస్తుతం (బొగ్గుల కుంట) ఉన్న ఆసుపత్రిని నిర్మించాం. 2007లో రెండో ఆసుపత్రిని, 2011లో మరో ఆసుపత్రిని నిర్మించాం. మూడు ఓపీ కేంద్రాలు నడుస్తున్నాయి.

> **గొప్ప గౌరవం**
>
> ఇతర ప్రాంతాలకు కూడా మా సేవలను విస్తరిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరిక మేరకు అక్కడ కూడా మిడ్‌వైఫరీ శిక్షణ ఇస్తున్నాం. అక్కడ రెండు ట్రైనింగ్ స్కూల్స్ ఉన్నాయి. ఇటీవల తెనాలిలో 'ఇ-సేఫ్' అనే పేరుతో కార్యక్రమాలు నిర్వహించాం. తెనాలి ప్రాజెక్ట్ విషయానికి వస్తే... డబ్ల్యూహెచ్‌ఓ, యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ యూకే, ఫెర్నాండెజ్ ఆసుపత్రి కలిసి... టాంజానియాలో, ఇండియాలో ఈ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నాం.

ప్రభుత్వాలతో చేతులు కలిపి...

మేము చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాల్లో మిడ్‌వైఫరీ (మంత్రసాని) వ్యవస్థ ఒకటి. సుమారు పాతికేళ్ళ క్రితం వందలో అరవై నుంచి డెబ్భై మంది తల్లులకు కాంప్లికేషన్స్ ఉండేవి. వారిని మేం జాగ్రత్తగా చూసుకొనేవాళ్ళం. ఈ సంగతి ఆనోటా ఈనోటా వ్యాపించింది. క్లిష్టమైన ప్రెగ్నెన్సీ కేసులను మా దగ్గరకు పంపించేవారు. కర్నూలు, విజయవాడ లాంటి ప్రాంతాల నుంచి కూడా మాకు పేషెంట్స్ వచ్చేవారు. కొన్ని కేసుల్లో తల్లులను మేము కాపాడలేకపోయేవాళ్ళం. 'దీని గురించి ఏం చెయ్యాలా?' అని ఆలోచిస్తున్నప్పుడు... మిడ్‌వైఫ్స్ విధానాన్ని అమలు చేస్తే బాగుంటుందనిపించింది. ప్రసూతి వైద్యులు, మంత్రసానులు కలిసి పని చేస్తే... ప్రసూతి మరణాలను తగ్గించవచ్చని అనుకున్నాను. అప్పటికి ఆ వ్యవస్థ మన దేశంలోని ఆసుపత్రుల్లో అంతగా లేదు.

> **ఇది చాలా పెద్ద బాధ్యత...**
>
> 1992 నుంచి 2018 వరకూ... 'డాక్టర్ లెస్లీ జె ఫెర్నాండెజ్ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్' కింద మా కార్యకలాపాలు సాగాయి. 2018లో ఫెర్నాండెజ్ సంస్థలు... లాభాపేక్షలేని సంస్థలుగా... కొత్తగా ఏర్పాటు చేసిన 'ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్' కింద రిజిస్టర్ అయ్యాయి. 2011లోనే మా ఆసుపత్రిలో ఏడాదికి నాలుగు నుంచి అయిదువేల జననాలు జరిగేవి. అప్పుడు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, మినిస్ట్రీ ఆఫ్ హెల్త్... మేం ఏం చేస్తున్నామో పరిశీలించడానికి ఒక బృందాన్ని పంపించాయి. ఎందుకంటే మాది కాంప్లికేటెడ్ కేసులకి రిఫరల్ ఆసుపత్రిగా ఉంది. వాళ్ళు పరిశీలించిన తరువాత... "ఇప్పుడు మీది ఒక టీచింగ్ హాస్పిటల్. కాబట్టి వైద్యులకు, ఇతర సిబ్బందికి మీరు బోధన చేయాల్సి ఉంది" అని చెప్పారు. దాంతో గత పదకొండు, పన్నెండేళ్ళ నుంచి బోధనను కొనసాగిస్తున్నాం. ఈ విధంగా చేస్తున్న ఏకైక ఆసుపత్రి దేశంలో మాదే. ఇది చాలా పెద్ద బాధ్యత. దాదాపు దశాబ్దంగా మా కార్యక్రమాల్ని ఇతర ఆసుపత్రుల్లో అమలు చేస్తున్నందుకు మేం చాలా సంతోషిస్తున్నాం.



కాబట్టి... మా నర్సులకు మిడ్‌వైఫరీలో శిక్షణ ఇచ్చే పైలెట్ ప్రాజెక్టును 2011లో మా ఆసుపత్రిలోనే ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. ప్రెగ్నెన్సీ విషయంలో వైద్యుల దృక్పథానికి, మంత్రసానుల దృక్పథానికి చాలా తేడా ఉంటుంది. వైద్యులకు ఎమర్జెన్సీ కేసులు, ఓపీతో సహా అనేక విధులు ఉంటాయి. వారు ప్రతి తల్లికీ కొన్ని నిమిషాలు మాత్రమే కేటాయించగలరు. అదే మంత్రసానులైతే పేషెంట్స్‌తో ఎక్కువసేపు ఉంటారు. వారిలో ఆందోళన తగ్గిస్తారు. ఎక్సర్ సైజుల్ని సూచిస్తారు. దాంతో... తమకు ఇబ్బందులు లేకుండా ప్రసవం జరుగుతుందనే ధీమా, నమ్మకం వారిలో కలుగుతాయి. ఇది మేము ఫెర్నాండెజ్‌లో తెచ్చిన గుణాత్మకమైన భారీ మార్పు. దీనికోసం 200 ఏళ్ళ నుంచి మిడ్‌వైఫ్స్ వ్యవస్థ నడుస్తున్న యూకే నుంచి సహకారం తీసుకున్నాం. నిజానికి 1990ల చివర్లోనే, 2000లలోనే కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్రాల్లో ఈ దిశగా ప్రయత్నాలు చేసినా... విజయవంతం కాలేదు. మా ఆసుపత్రిలో ప్రారంభించిన మిడ్‌వైఫరీ ప్రోగ్రాం సఫలం కావడంతో... తెలంగాణలోని నర్సులకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ సంగతి ఢిల్లీలోని పెద్దలకు తెలిసి... పరిశీలన కోసం ఒక బృందాన్ని పంపారు. ప్రసవాలలో, గర్భిణుల సంరక్షణలో మిడ్‌వైఫ్స్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలను, దాని వల్ల ప్రభుత్వాసుపత్రుల్లో మారిన వాతావరణాన్ని వారు గమనించారు. ఆ తరువాత దేశవ్యాప్తంగా ఉన్న వైద్య సంస్థల్లో మిడ్‌వైఫరీని ప్రవేశపెట్టాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 14 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దేశంలోని మొట్టమొదటి మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ మాదే. ఇప్పటివరకూ పది రాష్ట్రాల్లో మేము శిక్షణ ఇచ్చాం. ప్రతి రాష్ట్రంలో ఆరు నుంచి పది మంది ఈ శిక్షణ తీసుకొని... ఒక్కొక్కరూ మరో పదిమందికి శిక్షణ అందిస్తారు. ప్రభుత్వాలతో కలిసి పని చెయ్యడం ఒక ప్రైవేటు ఆసుపత్రిగా మాకు దక్కిన గౌరవం.

> **ఇంటర్నెట్ లేని ప్రదేశాలకు వెళ్తా...**
>
> నేను ఒంటరిగా, వివాహానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఆసుపత్రే గత ముప్పై, నలభై ఏళ్ళుగా నా కుటుంబం. మా ఆసుపత్రుల్లో పుట్టిన వారంతా నా పిల్లలే కదా! వాళ్ళ సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఇక నాకు సంగీతమన్నా, ప్రయాణాలన్నా ఇష్టం. పుస్తకాలు బాగా చదువుతాను. ఇంటర్నెట్ కూడా అందుబాటులో లేని ప్రదేశాలకు వెళ్ళడాన్ని ఇష్టపడతాను. లాంగ్ డిస్టెన్స్ డ్రైవింగ్ ఇష్టం. కేరళ, కన్యాకుమారి... ఇలా పలు ప్రాంతాలకు డ్రైవర్ లేకుండా... ముగ్గురు, నలుగురు మహిళలం కలిసి వెళ్తా ఉంటాం. ఇవి నాలో ఒత్తిడిని తగ్గించడానికి దోహదం చేస్తాయి. నా భవిష్యత్ ప్రణాళికలంటారా... ప్రతి చోటా మా ఆసుపత్రిని ఏర్పాటు చేయడమే నా ఆశయం. యాభై పడకలున్న చిన్న ఆసుపత్రుల్ని ఏర్పాటు చేయాలి, హైదరాబాద్ బయటి ప్రాంతాలకు విస్తరించాలి... ఇదీ నా కోరిక.

పేదలే నిజమైన వివిపీలు...

76 ఏళ్ళ క్రితం ఏ విలువలతో మా తల్లితండ్రులు ఆ ఆసుపత్రిని ప్రారంభించారో... ఆ విలువలు ఇప్పటికీ మా సంస్థలో సజీవంగా ఉన్నాయి. అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నాయి. ప్రాణాలకు విలువ ఇవ్వాలి, డబ్బు లేకపోవడం అనే కారణంతో ఎవరినీ వెనక్కి పంపకూడదు. దయతో, ఆప్యాయతతో వ్యవహరించాలి. ఇవీ వారు నిర్దేశించిన విలువలు. ఆ విలువలే మమ్మల్ని నిలబెడుతున్నాయి. మా ఆసుపత్రికి కొందరు మహిళలు వస్తూ ఉంటారు. "ఇరవయ్యేళ్ళ క్రితం మీరే మా డాక్టర్. మా అమ్మాయిని మీరే చూడాలి" అంటారు. ఇలా మూడు... కొన్నిసార్లు నాలుగు తరాల వారికి కూడా మేము సేవలు అందిస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్‌లో ఎన్నో ఆసుపత్రులున్నాయి. కానీ కొందరు వ్యక్తులు ఇప్పటికీ ఆ విశ్వాసంతో, నమ్మకంతో మా దగ్గరకే వస్తూ ఉంటారు. మాకు ఇంతకన్నా గొప్ప గౌరవం, ప్రశంస మరేం ఉంటుంది? ఇన్నేళ్ళలో మేము కేవలం మూడు ఆసుపత్రులే ఎందుకు నడుపుతున్నామంటే... మేము దీనిలో గొప్ప లాభాలు ఆశించడం లేదు. మా ఆదాయం పెరిగినప్పుడు దాన్ని చూపించి... బ్యాంకుల్లో రుణాలు తీసుకొని, తరువాతి ఆసుపత్రిని ప్రారంభించాం. కాబట్టి మా విస్తరణ చాలా నెమ్మదిగా జరిగింది. అయినప్పటికీ, నాణ్యతలో, విలువలలో ఏమాత్రం రాజీ పడకుండా చూసుకుంటున్నాం. మా బొగ్గులకుంట ఆసుపత్రిలో... డబ్బు చెల్లించలేని వారికీ, చెల్లించేవారికీ కూడా సేవలు అందిస్తాం. చెల్లింపు చేయలేనివారి కోసం ఎప్పుడూ 11 బెడ్స్ ప్రత్యేకంగా ఉంటాయి. మా ఆసుపత్రుల్లో వేరే వాటికి అలాంటి పేషెంట్స్ వచ్చినప్పుడు... వారిని ఇక్కడికి రిఫర్ చేస్తారు. మా దృష్టిలో పేదలే నిజమైన వివిపీలు. ఎందుకంటే వారు గట్టిగా తమ గొంతు వినిపించలేరు. వారికి చిన్న సాయం చేసినా... ఎంతో సంతోషిస్తారు, కృతజ్ఞత చూపిస్తారు. వాళ్ళు చిన్న మొత్తాలైనా సరే... తమకు ఉన్నదానిలో కొంత చెల్లించి... తమ హుందాతనాన్నీ, కృతజ్ఞతనూ ప్రదర్శిస్తారు. ఇది చాలామంది సంపన్నులలో కనిపించదు. కాబట్టి సంపన్నుల మాదిరిగానే వారికీ తగిన సంరక్షణ, గౌరవం ఇవ్వాలి. దీన్ని మా ఆసుపత్రి సంస్కృతిలో భాగం చేశాం.

• కృష్ణశర్మ

ముఖేష్ అంబానీ గారాల కూతురు... **ఈషా అంబానీ పీరామల్.**
'అంబానీ' వారసురాలిగా ప్రపంచానికి పరిచయమైనా...
వ్యాపార రంగంలో తనదైన ముద్రతో తండ్రికి తగ్గ తనయ అనిపించుకొంటోంది.
కోరుకున్నది ఎంతటి విలువైన వస్తువైనా... క్షణాల్లో కళ్ల ఆమె ముందు ప్రత్యక్షం అవుతుంది.
కానీ వాటన్నిటి కంటే విలువైనది... అమూల్యమైనది... ఆమె 'ఆర్ట్ హౌస్'లో ఒకటుంది.
ఈషా కళాత్మక హృదయానికి... ఆమెలోని అమ్మతనానికి... నిలువెత్తు రూపం ఆ కళాకృతి.

కళాత్మక హృదయం

అమ్మానాన్నలతో విదేశాలు వెళ్లినప్పుడల్లా సాధ్యమైనన్ని మ్యూజియంలు, ఆర్ట్ ఎగ్జిబిషన్లు సందర్శించేవారు ఈషా అంబానీ. ఆ అనుభవాలు తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి తోడ్పడ్డాయంటారు ఆమె. కళలపై ఉన్న మక్కువతో గత ఏడాది ముంబయిలో 'నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్' (ఎన్ఎంఏసీసీ)లో 'ఆర్ట్ హౌస్'ను ప్రారంభించారు. పదహారు వేల చదరపు అడుగులతో, నాలుగు అంతస్తుల్లో ఏర్పాటు చేసిన ఈ 'ఆర్ట్ హౌస్'... ఈషా కళాత్మక హృదయానికి నిదర్శనం. దీని వెనుక ఆమె ఆసక్తి, కృషి మాత్రమే కాదు... తల్లి నీతా అంబానీ నుంచి పొందిన ప్రేరణ కూడా ఉంది.

'నాకు ప్రధాన స్ఫూర్తి మా అమ్మ. నచ్చింది ఎంచుకోవడంలోనే కాదు... ఆ దారిలో నడవడానికి అంకితభావంతో కృషి చేయాలని నన్ను, నా సోదరులనూ అమ్మ ఎప్పుడూ ప్రోత్సహిస్తుంటుంది. స్కెచింగ్, డ్రాయింగ్, పెయింటింగ్ నా అభిరుచులు. మనసు ప్రశాంతతను కోరుకున్నప్పుడు చిత్రకళే నాకు అద్భుతమైన ఉపశమనం' అంటున్న ఈషా 'ఆర్ట్ హౌస్'లో ఇంగ్లీష్ ఆర్టిస్ట్ ట్రేసీ ఎమిన్, అమెరికన్ పెయింటర్ జెనిఫర్ గూయిడీ తదితర ప్రపంచ ప్రసిద్ధ కళాకారుల చిత్రాలు కొలువై ఉన్నాయి. ఈషా గ్రాడ్యుయేట్ అయిన సందర్భంగా... ట్రేసీ ఎమిన్ గీసిన చిత్రాన్ని నీతా అంబానీ బహుమతిగా ఇచ్చారు. ఆ బహుమతి తనకు ఎప్పటికీ ప్రత్యేకమే అంటుంది ఈషా. అలాగే జెనిఫర్ అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్‌ను ఆమె భర్త ఆనంద్ పిరమళ్... పెళ్లి కానుకగా ఇచ్చారు.

ఇవేకాదు... కొన్నేళ్లుగా ఈషా సేకరించిన ప్రముఖుల చిత్రాలు, శిల్పాలు ఎన్నో 'ఆర్ట్ హౌస్'లో ఆకట్టుకొంటాయి. అమెరికన్ కళాకారుడు రాబర్ట్ ఇండియానా ప్రసిద్ధ 'లవ్' ప్రతిమ లోపలికి అడుగు పెట్టగానే అబ్బుర పరుస్తుంది. సుబోధ్ గుప్తా, రవీందర్‌రెడ్డి కళాకృతులు, ఈషా గదిలో ఎఫ్ఎన్ సౌజా భారీ పెయింటింగ్ కనిపిస్తాయి. మీ అభిమాన చిత్రకారుడు ఎవరని ఆమెను అడిగితే... 'చాలా మంది ఉన్నారు. కానీ ప్రధానంగా నా మద్దతు మహిళా కళాకారులకే. ముఖ్యంగా భారతీయ మహిళా చిత్రకారులను ప్రోత్సహిస్తాను. భారతీ ఖేర్, రితిక మర్చంట్, రానా బేగమ్ వంటి కళాకారుల చిత్రాలు నన్ను ఆకట్టుకొంటాయి. అలాగే మా ఇంట్లో ఉండే కళాకృతులన్నీ నాకు నచ్చుతాయి. ఎందుకంటే అన్నీ ఇష్టపడి సేకరించినవే కదా' అంటారు ఈషా.



అయితే కళ్లముందు ఎన్ని అద్భుత కళాఖండాలు ఉన్నా... ఆమె చూపు మాత్రం ఒక 'చిత్రం' ముందు ఆగిపోతుంది. 'ఆ చిత్రాన్ని ఎన్నిసార్లు చూసినా నాకు విసుగు పుట్టదు. అలానే చూస్తూ ఉండిపోతాను. అది నాకు అత్యంత ఇష్టమైన, మనసుకు నచ్చిన కళాకృతి. అది మరేదో కాదు... మా పిల్లల అరచేతి ముద్రలు. కాగితంపై వేసిన ఈ హ్యాండ్ ప్రింట్స్ మా ఇంటి ఫ్రిజ్ డోర్‌కు అతికించి పెట్టుకున్నాను. ఎందుకంటే ఎప్పుడూ కనిపిస్తూ ఉండాలని. దాన్ని చూసినప్పుడు ఒక తల్లిగా నా హృదయం ఉప్పొంగుతుంది. మనసు పరవశిస్తుంది' అంటూ ఎంతో భావోద్వేగంతో చెబుతారు ఈషా. అలాగే నిశ్చితార్థం నాడు భర్త తొడిగిన వజ్రపు ఉంగరం కూడా తనకు అంతే ప్రత్యేకమంటారు. ఆమె వద్ద విలువైన ఆభరణాల కలెక్షన్ కూడా తక్కువేంలేదు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన అన్‌కట్ డైమండ్ నెక్లెస్, ఒక చిన్న దేశం జీడీపీకి సమానమైన విలువగల వజ్రాలు పొదిగిన బెల్ట్, అమూల్యమైన రత్నాలు అద్దిన బ్లౌజ్... ఇలా ఎన్నో ఖరీదైన, ప్రత్యేకమైన ఆభరణాలు ఈషా దగ్గర లెక్కకు మించే ఉన్నాయి. కానీ మనసుకు దగ్గరైనది తన పిల్లల హ్యాండ్ ప్రింట్స్ మాత్రమే.

ముంబయిలోనే పుట్టి పెరిగిన ఈషా 'ధీరూభాయ్



అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. అమెరికాలోని 'ఏలే యూనివర్సిటీ'లో సైకాలజీ డిగ్రీ, 'స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్' నుంచి ఎంబీఏ పట్టాలు పొందారు. చదువు అవ్వగానే తండ్రి వ్యాపారాల్లో భాగస్వామి అయ్యారు. ప్రస్తుతం 32 ఏళ్ల ఈషా 'రిలయన్స్ రీటైల్ వెంచర్స్ లిమిటెడ్, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్, ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్' బోర్డ్ ఆఫ్ డెరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వినూత్నమైన, సృజనాత్మకమైన ఆలోచనలతో రిలయన్స్ రిటైల్‌ను కొత్త పుంతలు తొక్కించారు. కొన్ని ప్రముఖ బ్రాండ్లను కొనుగోలు చేసి, ఈకామర్స్ వేదికైన 'అజియో' కిందకు తీసుకువచ్చారు. తద్వారా తమ మార్కెట్ పరిధి పెంచి, వ్యాపారాన్ని విస్తరించారు. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా దేశీయ కళలు, కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. పేద మహిళల సాధికారత కోసం, చిన్నారుల విద్య కోసం కృషి చేస్తున్నారు.

ఇదిలావుంటే... ఆరేళ్ల కిందట ఆనంద్ పీరామల్‌ను పెళ్లి చేసుకున్న ఈషా... తాను కూడా ఐవీఎఫ్ బేబీనేనని, ఇప్పుడిది సాధారణమని, దీన్ని దాచిపెట్టాల్సిన అవసరం లేదని ఇటీవల ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. 'ప్రపంచంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు... దాన్ని పిల్లలు కనడానికి ఎందుకు ఉపయోగించకూడదు? వాస్తవానికి ఇది సంతోషించదగ్గ విషయం. దాచుకోవాల్సింది కాదు. ఐవీఎఫ్ ద్వారా నాకు కవలలు పుట్టారని చెప్పడానికి నేను ఏమాత్రం సంకోచించను. ఎందుకంటే ఇప్పుడిది సాధారణమైపోయింది. పిల్లల కోసం ఐవీఎఫ్‌ను ఆశ్రయించే జంటలు ఆ విషయాన్ని చెప్పుకోవడానికి సంశయించాల్సిన అవసరం లేదు' అంటున్న ఈషా, ఆనంద్ దంపతులు పెళ్లయిన నాలుగేళ్లకు ఐవీఎఫ్ ద్వారా కవలలకు జన్మనిచ్చారు. •

'కల్కి' టికెట్ ధరల పెంపుపై
హైకోర్టులో పిల్

» ప్రతివాదులకు నోటీసులు జారీ

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభాస్ నటించిన 'కల్కి-2898 ఏడీ' సినిమాకు మొదటి 14 రోజులు టికెట్ల ధరలు పెంచుకొనేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మెమోను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్‌ను ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, చిత్ర నిర్మాత సి.అశ్వనీదత్‌కు నోటీసులు జారీచేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. నెల్లూరుకు చెందిన రాకేష్‌రెడ్డి ఈ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ నాలుగు రోజులు అధిక రేట్లతో టికెట్లు విక్రయించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. నిర్మాతల వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయలేమంది.

ఆ ఖాళీలతో
కోర్టు పనితీరుపై ప్రభావం

» పూర్తి వివరాలతో కౌంటర్ వేయండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

అమరావతి, జులై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కోర్టుల్లో ప్రాసిక్యూటర్లు, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ల ఖాళీలను భర్తీ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. పీపీలు, ఏపీపీల పోస్టులు భర్తీ చేయకపోవడంతో కోర్టుల పనితీరుపై ప్రభావం పడుతోందని పేర్కొంది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్, ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు నోటీసులు జారీచేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. న్యాయవాది తాండవ యోగేష్ ఈ పిల్‌ను దాఖలు చేశారు.

లా ఆఫీసర్ల నియామకంలో
రాజకీయ జోక్యం వద్దు

» హైకోర్టులో పిల్ దాఖలు..
నోటీసులు జారీచేసిన ధర్మాసనం

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హైకోర్టుతో పాటు దిగువ కోర్టులు, ట్రైబ్యునళ్లలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు లా ఆఫీసర్ల (జీపీలు, ఏజీపీలు) నియామకం విషయంలో మార్గదర్శకాలు రూపొందించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని, రాజకీయ జోక్యం లేకుండా చూడాలని దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శిని ధర్మాసనం ఆదేశించింది. విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. న్యాయవాది వాసిరెడ్డి ప్రభునాథ్ ఈ పిల్ దాఖలు చేశారు.

ఈ సీజన్ వృథా కానివ్వొద్దు!

» పోలవరంపై 2 వారాల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వండి
» పనులు నవంబరు నుంచి చేపట్టేలా చూడండి
» అంతర్జాతీయ నిపుణులకు జలసంఘం చైర్మన్ వినతి
» సాధ్యమైనంత త్వరగా ఇస్తామన్న ఎక్స్‌పర్ట్స్
» డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేయొచ్చు
» కాఫర్ డ్యాంల పునాదులు గట్టిగానే ఉన్నాయ్
» సీపేజీని నివారించడానికి వీలుంది
» ఇప్పుడు చేస్తున్న పరీక్షలు కొనసాగించండి
» వాటి ఫలితాలు మాకు తెలియజేయండి
» అధికారులకు అమెరికా, కెనడా నిపుణుల సూచన
» నేడు ఢిల్లీ నుంచి స్వదేశాలకు పయనం
» జలవనరుల శాఖ, కాంట్రాక్టు సంస్థలిచ్చిన సాంకేతిక సమాచారంపై అధ్యయనం
» ఆ తర్వాత ప్రాథమిక నివేదిక రూపకల్పన
» పీపీఏ ద్వారా జలసంఘానికి నివేదన


బుధవారం పోలవరం ప్రాజెక్టు సమావేశ కార్యాలయం వద్ద నిపుణుల బృందం

అమరావతి-ఆంధ్రజ్యోతి/పోలవరం, జూలై 3: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా ఈ సీజన్ వృథా కానివ్వకుండా త్వరితగతిన ప్రాథమిక నివేదిక ఇవ్వాలని అంతర్జాతీయ నిపుణులను కేంద్ర జల సంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా కోరారు. గోదావరికి వరద తగ్గి పనులు చేసుకునే వెసులుబాటు నవంబరునాటికి వస్తుందని.. ఆలోగా డిజైన్లు ఎప్పటికప్పుడు ఆమోదం పొంది, పనులు మొదలుపెట్టాలంటే నివేదిక త్వరగా అందాలన్నారు. ప్రాజెక్టు క్షేత్రంలో అమెరికాకు చెందిన ప్రాజెక్టు నిర్మాణ నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిస్కో, డేవిడ్ బి పాల్.. కెనడా నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీల నాలుగు రోజుల పర్యటన బుధవారం ముగిసింది. దెబ్బతిన్న డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంలలో సీపేజీ, కుంగిపోయిన గైడ్‌బండ్‌లను, ఇతర నిర్మాణాలను, కీలక కట్టడాల డిజైన్లను వారు పరిశీలించారు. ప్రాజెక్టు అధికారులతో, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమీక్ష జరిపారు. బుధవారం మరోసారి అధికారులతో పాటు పరిశీలించారు. నిపుణులతో చర్చించేందుకు మధ్యాహ్నం రెండున్నర గంటలకు వోహ్రా ప్రాజెక్టు క్షేత్రానికి ప్రత్యేకంగా వచ్చారు. సాంకేతికాంశాలపై లోతుగా చర్చించారు. ఈ సందర్భంగా.. తమకు అందించిన సాంకేతిక సమాచారాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ప్రారంభించామని నిపుణులు తెలిపారు. అయితే అది చాలా ఎక్కువగా ఉన్నందున మరికొంత సమయం పడుతుందన్నారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్ మరమ్మతు చేసేందుకు అనువుగా ఉందని మరోసారి భరోసా ఇచ్చారు. వాల్ దెబ్బతిందన్న అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వెళ్లినందున.. కొత్తగా సమాంతర వాల్ నిర్మించకుండా మరమ్మతు చేయడానికి, దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మించడానికి సాహసించలేకపోయినట్లు వోహ్రా వెల్లడించారు. సమాంతరంగా ప్లాస్టిక్ డయాఫ్రం వాల్‌ను నిర్మించడమే మేలనే అభిప్రాయం నెలకొందన్నారు. క్షేత్ర స్థాయిలో తమ పరిశీలనలో సీపేజీ నివారణకు అవకాశమున్నట్లు అర్థమైందని నిపుణులు తెలిపారు. కాఫర్ డ్యాంల పునాదులు గట్టిగానే ఉన్నాయన్నారు. టెస్టులను కొనసాగిస్తూ.. వాటి ఫలితాలను తమకు పంపించాలని సూచించారు.

వారంలోపే ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం

ఈ సీజన్ వృథా కాకుండా వారం లేదా రెండు వారాల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వాలన్న వోహ్రా అభ్యర్థనపై నిపుణులు సానుకూలంగా స్పందించారు. సాధ్యమైనంత వరకూ వారం రోజుల్లోనే ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. స్వదేశాలకు వెళ్లాక ఒక రోజంతా సమీక్షించి ఒక నిర్ణయానికి వస్తామని చెప్పారు. తాము వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై.. నిర్మాణాలపై ఏకాభిప్రాయానికి వస్తామన్నారు. ఈ నెల మూడోవారంకల్లా నివేదిక ఇస్తే.. తదనుగుణంగా డిజైన్లు తయారు చేసి.. వాటిని ఆమోదించేలా చర్యలు తీసుకుంటామని వోహ్రా తెలిపారు. ఇందుకు నిపుణులు సమ్మతించారు. వారు బుధవారం రాత్రి ఢిల్లీ బయల్దేరారు. గురువారం కేంద్ర జలశక్తి శాఖ అధికారులతో సమావేశమవుతారు. గురువారమే స్వదేశాలకు పయనమవుతారు. జల వనరుల శాఖ, నిర్మాణ సంస్థలు ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించి.. పోలవరం పనులపై ఎలా ముందుకు వెళ్లాలో ప్రాథమిక నివేదిక రూపంలో కేంద్ర జల సంఘానికి పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా అందజేస్తారు. ఆలోగా.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల్లో సీపేజీని నివారించడానికి జలవనరుల శాఖ చేస్తున్న పరీక్షలను కొనసాగించాలని నిపుణులు సూచించారు. వారి నివేదికలు అందిన వెనువెంటనే డిజైన్లు రూపొందించేందుకు జల సంఘం సన్నద్ధంగా ఉందని వోహ్రా వెల్లడించారు.

సీపేజీ తీవ్రతపై పరిశీలన..

అంతర్జాతీయ నిపుణులు బుధవారం మరోసారి ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, సీపేజీ ప్రాంతాలు, డయాఫ్రం వాల్, పిజియోమీటర్లు అమర్చిన ప్రాంతం, ఈసీఆర్ఎఫ్ డ్యాం ప్రాంతంలో వైబ్రో కంపాక్షన్ పనులను సునిశితంగా పరిశీలించారు. ఎంత లోతు నుంచి సీపేజీ పైకి ఎగదన్నుతోందో పరిశీలించారు. తర్వాత ప్రాజెక్టు కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు సంబంధిత కన్సల్టెన్సీలతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణ ఆరంభం నుంచి ఇప్పటివరకూ జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిపుణుల తుది సమీక్షలో సీఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్త మనీశ్ గుప్తా, జలసంఘం డ్యాం డిజైనింగ్ ఎంబ్యాంక్‌మెంట్ నార్త్ వెస్ట్ సౌత్ నిపుణుడు గౌరవ్ తివారీ, డిజైన్స్ చీఫ్ ఇంజనీర్ విజయ్ శరణ్, జలసంఘం సీఈ అన్వేష ప్రవీణ్, వ్యాప్కోస్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌కే పట్నాయక్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, సీసీ ఎస్.నరసింహమూర్తి, పవర్‌హౌస్ మేనేజర్ సి.వెంకట సుబ్బయ్య ఆఫ్రి హైడ్రో ఆపరేషన్ వీపీ సలీల్ దివాన్, ఆఫ్రి హైడ్రో టెక్నికల్ డ్యాం నిపుణుడు టీఎస్‌కే సింగ్, బావర్, కెల్లర్, మేఘా కంపెనీల ప్రతినిధులు, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు. జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు మధ్యలో కాసేపు వచ్చి వెళ్లారు.

పురోగతి ఉంటే కోర్టుకు తెలియజేయండి

మహిళా సంరక్షణ కార్యదర్శులకు పోలీసు బాధ్యతల అప్పగింతపై హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం, జీవోలను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు వచ్చాయి. విచారణ ప్రారంభమైన వెంటనే ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఏమైనా పురోగతి ఉంటే కోర్టు తెలియజేయాలని పిటిషనర్లు, ప్రతివాదులను ఆదేశించింది. తీర్పును రిజర్వ్ చేసి.. ఈ వ్యాజ్యాలను తిరిగి ఓపెన్ చేయాలని నిర్ణయించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాద రావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణిస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ విశాఖకు చెందిన ఆరేటి ఉమామహేశ్వరరావు హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యవహారంపై గతేడాది నవంబరు 24న వాదనలు ముగియడంతో ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు వచ్చాయి.

కంప్యూటర్ సైన్స్‌లోనే లక్ష సీట్లు!

» మొత్తం ఇంజనీరింగ్ సీట్లు 1,81,732
» రాష్ట్రంలో పెరిగిన సీట్లు 28,399
» గుంటూరు జిల్లాలో అత్యధికంగా 26,760 సీట్లు

కోర్సుల వారీగా

కోర్సు	ప్రభుత్వ కాలేజీల్లో	ప్రైవేటు కాలేజీల్లో
సీఎస్ఈ	1340	98154
ఐటీ	120	6270
సివిల్	710	8220
మెకానికల్	800	9615
ఈఈఈ	680	10740
ఈసీఈ	980	30330
ఇతర కోర్సులు	870	2250

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య భారీగా పెరిగింది. గతేడాదితో పోలిస్తే 28,399 సీట్లు అదనంగా ఏఐసీటీఈ మంజూరుచేసింది. అయితే కంప్యూటర్ సైన్స్ సీట్లు భారీగా పెరిగిపోయాయి. రాష్ట్రంలో మొత్తంగా 1,81,732 సీట్లు మంజూరవగా.. అందులో 99,494 సీట్లు ఒక్క సీఎస్ఈలోనే ఉండటం గమనార్హం. గతేడాది వరకూ ఒక సెక్షన్‌కు గరిష్ఠంగా 60 సీట్లు మాత్రమే ఉండాలనే నిబంధన ఉంది. ఈసారి ఆ పరిమితిని ఎత్తివేయడంతో కాలేజీలు సీఎస్ఈ సీట్లను భారీగా పెంచుకున్నాయి. మార్కెట్‌లో ఇంజనీరింగ్ విద్య అంటే సీఎస్ఈనే అనే పరిస్థితి రావడమే దీనికి కారణం. యూనివర్సిటీల కాలేజీలు, ప్రైవేటు కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, ఆర్జీయూకేటీలకు కలిపి మొత్తం ఈ సీట్లు మంజూరయ్యాయి. వీటిలో 229 ప్రైవేటు కాలేజీల్లో 1,71,079 సీట్లు, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో 33 సీట్లు, ఆర్జీయూకేటీల్లో 1,440 సీట్లు, డీమ్డ్ యూనివర్సిటీల్లో 9,180 సీట్లు, యూనివర్సిటీ కాలేజీల్లో 5,500 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో 60 సీట్లు, ఎస్‌కేయూలో సీఎస్ఈ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) 60 సీట్లు, అదే యూనివర్సిటీ పరిధిలోని మరొక ఇంజనీరింగ్ కాలేజీకి సీఎస్ఈ(డేటా సైన్స్)లో 60 సీట్లు మంజూరయ్యాయి. జిల్లాల వారీగా ఉమ్మడి గుంటూరులో అత్యధికంగా 26,760 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీఎస్ఈ సీట్లు పెంచుకున్నా కోర్ గ్రూపులు కొనసాగాలనే నిబంధన ఉండటం వల్ల ఈ మేరకు సీట్లు వచ్చాయి. లేనిపక్షంలో మొత్తం సీఎస్ఈ సీట్లే కావాలని ఇంజనీరింగ్ కాలేజీలు అడిగే పరిస్థితి ఉంది.

3 నెలల్లో 1.28 లక్షల గృహాలు లక్ష్యం

» లే అవుట్ల అభివృద్ధికి ఫ్లై యాష్ వినియోగం: మంత్రి పార్థసారథి



అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద వచ్చే మూడు మాసాల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖపై అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎస్ఈలు, ఈఈలు ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం నాల్గవ బ్లాక్‌లోని పబ్లిసిటీ సెల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖలు 100 రోజుల కార్యాచరణను రూపొందించుకోవాలన్న సీఎం ఆదేశాలకు అనుగుణంగా పై లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఇందుకుగాను రూ.2,520 కోట్లను ఖర్చు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 8.02 లక్షల గృహాలను వచ్చే మార్చి నెలాఖరుకి పూర్తి చేయాలని నిర్దేశించామన్నారు. లేఅవుట్ల అభివృద్ధికి థర్మల్ పవర్ స్టేషన్ల నుంచి వచ్చే ఫ్లైయాష్‌ను వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆప్షన్ 2 కింద నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించిన సమస్యలపై సీఎం చంద్రబాబుతో మాట్లాడి తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణ శాఖలో ఉన్న ఖాళీలను పదోన్నతుల ద్వారా, కింది స్థాయి ఖాళీలను డిప్యూటేషన్ ద్వారా భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు. సమావేశంలో ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి రవీంద్రకు కృతజ్ఞతలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

మంత్రి రవీంద్రకు లారీ ఓనర్స్ కృతజ్ఞతలు

భవానీపురం. జూలై 3: రాష్ట్రంలో ఈనెల 8 నుంచి ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చేందుకు మైనింగ్‌శాఖ చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్రను లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇసుక విధానంతో అందరికీ సత్వర ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన వారిలో వడ్డమూడి వెంకటేశ్వరరావు, గంగవరపు మురళి, మాలిశెట్టి శ్రీనివాసరావు, వేమూరి తిరుపతిరావు, రావెళ్ల నాగేశ్వరరావు, అల్లు రోశయ్య, అంజిరెడ్డి, నాగుల్ మీరా, అడుసుమిల్లి నరేంద్ర ఉన్నారు.


మంత్రి సత్యకుమార్‌కు సమస్యలు వివరిస్తున్న ఉద్యోగ సంఘం నేతలు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఉద్యోగ సంఘ నేతలు

వన్‌టౌన్, జూలై 3: వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సచివాలయంలో బుధవారం కలిసిన ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం నేత లు విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అస్కారరావు, ప్రధాన కా ర్యదర్శి అహరోన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాగర్, సత్యనారాయణ, సత్యనారాయణ బాబు, జాన్సన్ మంత్రిని కలిశారు. మంత్రికి శుభాకాంక్షలు తె లిపిన అనంతరం ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం 14 అంశాలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చా రు. అలాగే ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు.



సఫాయి కర్మచారీల సభలో మాట్లాడుతున్న డాక్టర్ వావా

సఫాయి కర్మచారీలకు బీమా సౌకర్యం కల్పించండి: వావా

వన్‌టౌన్, జూలై 3: సఫాయి కర్మచారీలకు బీమా సౌకర్యం కల్పించాలని సఫాయి కర్మచారీస్ కమిషన్ సభ్యుడు, భారత ప్రభుత్వ స్టేటస్ సెక్రటరీ డాక్టర్ పి.పి వావా అన్నారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సఫాయి కర్మచారీల సమస్యలను తెలుసుకోవడానికి సఫాయి కర్మచారీల ఇబ్బందులను గురించి ఆయా సంఘాలు తెలియజేసిన అంశాలపై చర్చించేందుకు బుధవారం సభ నిర్వహించారు. సభలో మాట్లాడుతూ సఫాయి కర్మచారీల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వీఎంసీ అధికారులు, జిల్లా కలెక్టరేట్ అధికారులు, పురపాలక సంఘ అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డాక్ సేవక్‌లపై వేధింపులు ఆపాలి

● ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్



ధర్నా చేస్తున్న డాక్ సేవక్ యూనియన్ నేతలు

వన్‌టౌన్, జూలై 3: లక్ష్యాల సాధనలో ఏడాదికోసారి ఒత్తిడి, చిన్న లక్ష్యాల సాధనకు నెలకోసారి వేధింపులు చేస్తూ అధికారులు గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. డివిజనల్ సెక్రటరీ బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవక్‌లపై ఒత్తిడి, వేధింపులను ఆపాలన్నారు. కింది స్థాయి అధికారులు కొంతమంది ఉద్యోగుల పట్ల అమర్యాదగా, మహిళా ఉద్యోగుల పట్ల చులకనగా చూస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో 23న తమ యూనియన్ కార్యచరణ రూపొందించిందని అందుకే బుధవారం ధర్నా చేసి చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. పెయిడ్ లీవ్‌ల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలన్నారు. బ్రాంచ్ పోస్టాఫీస్‌లకు స్టేషనరీ సరఫరా చేయాలని, సేవింగ్స్ బ్యాంక్, రికరింగ్ డిపాజిట్, స్మాల్ సేవింగ్స్ ఖాతాలకు కొత్త పాస్‌బుక్‌లను సరఫరా చేయాలన్నారు. కొత్త డిపాజిటర్లకు 3,4 నెలలుగా పాస్‌బుక్‌లివ్వడం లేదన్నారు. గ్రాట్యూటీ మంజూరు చేయాలని, 180 రోజులు దాచుకున్న పెయిడ్ లీవ్‌ను నగదుగా మార్చుకోవడానికి అవకాశమివ్వాలని, వైద్య సౌకర్యాల రూ.5లక్షల స్కీమ్‌లో నెలకు రూ.300 ఇస్తున్న కంట్రీబ్యూషన్‌ను డిపార్ట్‌మెంట్ చెల్లించాలన్న డిమాండ్లను పరిష్కరించాలన్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిశాక కేంద్ర, మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను, ఆలిండియా మాజీ ప్రెసిడెంట్ బీవీ రావును కలిసి సమస్యలను విన్నవిస్తామన్నారు.

చైర్మన్ నుంచి రక్షణ కల్పించండి!

● గాంధీ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ నాగేశ్వరరావు

వన్‌టౌన్, జూలై 3: గాంధీ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకట్రావు (చిన్ని) తన పట్ల వివక్షతతో వ్యవహరిస్తున్నారని 3 రోజుల కిందట జరిగిన బ్యాంక్ సర్వజన సభలో తనను చంపుతానంటూ బహిరంగ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ఆయన నుంచి ప్రాణహాని ఉందని ప్రభుత్వం తనకు భద్రత కల్పించాలని, బ్యాంకు అవకతవకలను సరిచేయాలని బ్యాంక్ డైరెక్టర్ కళ్లే నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేమూరి వెంకట్రావు (చిన్ని) తనపట్ల వివక్షత చూపడానికి తాను టీడీపీలో క్రియాశీలకంగా ఉండడమేనన్నారు. గతంలో బుద్దా వెంకన్న సహకారంతో బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికైనట్లు చెప్పారు. కొద్దిరోజులకే బ్యాంకులో జరిగే విషయాలపై అనుమానాలు, సందేహాలు కలిగాయన్నారు. వీటిపై జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశానన్నారు. బ్యాంకు డైరక్టర్‌గా ఉన్నప్పటికీ నచ్చిన రాజకీయ పార్టీలో ఉండే హక్కుందన్నారు.గతంలో తన తల్లి సీతారావమ్మ పేరిట బ్యాంకు నుంచి రుణం తీసుకుని చెల్లించానని, ఆమె మరణించిన తరువాత బ్యాంకుకు పత్రాలు అందజేసినా ఇంటి దస్తావేజులను తిరిగివ్వలేదన్నారు. 3రోజుల కిందట జరిగిన సభలో బహిరంగంగానే తనను చంపుతానంటూ చైర్మన్ హెచ్చరించారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తనకు భద్రత కల్పించాలన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

● చోరీ కేసులో అదుపులోకి తీసుకుని వదిలేసిన పోలీసులు
● ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి


విజయవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ చోరీకేసులో పోలీసులు అదుపులోకి తీసుకుని వదిలిపెట్టిన యువకుడు అనుమానాస్పదంగా మరణించాడు. తన కుమారుడ్ని పోలీసులు కొట్టడం వల్లే చనిపోయాడని తల్లి ఆరోపిస్తోంది. ఈ ఘటన బుధవారం జరిగింది. జక్కంపూడి కాలనీకి చెందిన అరవల్లి డేవిడ్ డ్రెయినేజీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సెల్‌ఫోన్ చోరీ కేసులో జీఆర్పీ పోలీసులు డేవిడ్‌ను అరెస్టు చేశారు. వారం క్రితం 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై నిద్రపోతున్న ప్రయాణికుడి సెల్‌ఫోన్ మాయమైంది. ఆర్పీఎఫ్ పీఎస్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా, అందులో డేవిడ్ సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లిపోతున్నట్టు కనిపించింది. ఆ వివరాలను ట్రాక్ చేసి జక్కంపూడి కాలనీలో ఉంటున్న అతడిని, తల్లి మరియమ్మను పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. దొంగిలించిన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడి నేరచరిత్రను పోలీసులు పరిశీలించగా కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో 2, 3 కేసులున్నట్టు తేలింది. గతంలో డేవిడ్‌కు ప్రమాదంలో కాళ్లు, చేతులకు వైద్యులు రాడ్లు వేశారు. నడవలేని స్థితిలో ఉన్నాడు. దీంతో డేవిడ్‌ను అరెస్టు చేయకుండా, 41ఏ నోటీసు ఇచ్చామని జీఆర్పీ పోలీసులు చెబుతున్నారు. గతనెల 30న డేవిడ్ అనారోగ్యం పాలవగా తల్లి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించింది. చికిత్స పొందుతున్న డేవిడ్ బుధవారం మరణించాడు. పోలీసులు తన కుమారుడ్ని కొట్టడం వల్లే చనిపోయాడని తల్లి మరియమ్మ ఆరోపిస్తూ మార్చురీ వద్ద కొద్దిసేపు ఆందోళన చేసింది. ఈ ఆరోపణలు పోలీసులు ఖండిస్తున్నారు. డేవిడ్ పరిస్థితి చూసి అరెస్టు చేయలేదని వారు చెబుతున్నారు.

స్వప్నిల్ సేవలు అభినందనీయం

● శ్రీకాకుళం కలెక్టర్‌గా వెళుతున్న స్వప్నిల్‌కు వీడ్కోలు

వన్‌టౌన్, జూలై 3: వీఎంసీ కమిషనర్‌గా స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సేవలు అభినందనీయమని, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి ఎనలేనిదని కార్పొరేషన్ అదనపు కమిషనర్ డాక్టర్ ఏ మహేష్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న ఆయనకు వీడ్కోలు సభ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు ఆయనకు ఘనంగా సత్కారం చేశారు. సభలో మహేష్ మాట్లాడుతూ స్వప్నిల్ వీఎంసీకి చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఆయన హయాంలో స్వచ్ఛ సర్వేక్షణ్ రెండు అవార్డులు, ఒక స్కోచ్ అవార్డు, క్లైమేట్ స్మార్ట్ సిటీస్ అసెస్‌మెంట్ అవార్డు, చెత్తరహిత సిటీ సర్టిఫికెట్, స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డులు వచ్చాయన్నారు. ఏసీపీ కే సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, సీఎంవోహెచ్ రత్నావళి, డీసీఆర్ సుజన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరూ మర్యాదపూర్వకంగా లేచి నిలబడి స్వప్నిల్‌కు ధన్యవాదాలు తెలిపారు.


వేదికపై స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అతిథులు


బీజేపీ నేతలపై ఫిర్యాదు చేస్తున్న శివాజీ, ఉమాశంకర్

రాహుల్ దిష్టిబొమ్మను ఊరేగించిన వారిపై
చర్యలు తీసుకోండి: కాంగ్రెస్

వన్‌టౌన్, జూలై 3: కాంగ్రెస్ అగ్ర నేత, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పరువుప్రతిష్ఠలు దెబ్బతినేలా ఆయన దిష్టిబొమ్మను ఊరేగించి చెప్పులతో కొట్టి దహనం చేసిన బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు కొలనుకొండ శివాజీ, గంగిశెట్టి ఉమాశంకర్‌లు బుధవారం సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నవనీత రెడ్డి, వీహెచ్‌పీ అధ్యక్షుడు సనా శ్రీనివాస్, బొల్లపల్లి శ్రీధర్ ఆయన పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి పోలీసుల అనుమతి లేదని పైగా గంటలకొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగజేశారన్నారు. ప్రశ్నించిన పౌరులపై దౌర్జన్యపూరితంగా వ్యవహరించారని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



మేడసాని మోహన్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గగుడిలో మేడసాని ధార్మిక ప్రసంగం

వన్‌టౌన్: దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై బుధవారం అవధాన సామ్రాట్ మేడసాని మోహన్ ధార్మి క ప్రసంగం చేశారు. దైవానుగ్రహం పొందేందుకు అనుసరించాల్సిన విధి విధానాలను తెలిపారు. ఈవోతో పాటు పలువురు సాహితీ ప్రియు లు, భక్తులు ఆస్వాదించారు. తొలుత ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆయనకు ప్రసాదాలను అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

'గోదావరి' సభ్యులకు 7శాతం డివిడెంట్

వన్‌టౌన్: గోదావరి అర్బన్ బ్యాంకులో రూ.2,300 కోట్లకు డిపాజిట్లు చేరుకున్న సందర్భంగా సభ్యులకు 7శాతం డివిడెంట్ ఇస్తున్నట్లు బ్యాంకు అధ్యక్షురాలు రాజశ్రీ పాటిల్ ప్రకటించారు. సత్యనారాయణపురంలోని గోదావరి అర్బన్‌బ్యాంకు బ్రాంచ్‌లో డాక్టర్స్ డే సందర్భంగా బుధవారం వైద్యులను సత్కరించారు. అనంతరం బ్యాంక్ ప్రగతిని గురించి బ్యాంకు వ్యవస్థాపకుడు, ఇంగోలి లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ హేమంత్ పాటిల్ వివరించారు. రాజేశ్వరి, క్లస్టర్ బి జినెస్ మేనేజర్ ఎం.నాగబాబు, సత్యనారాయణపు రం బ్యాంక్ మేనేజర్ దుర్గా భవాని, మారుతినగర్ బ్యాంక్ మేనేజర్ డి.నాగరాణి పాల్గొన్నారు.

రోటరీ కార్యవర్గం ప్రమాణస్వీకారం

విజయవాడ కల్చరల్: రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడకు 2024-25 సంవత్సరానికి ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్ లో బుధవారం జరిగింది. సినీనటుడు నరేష్, పవిత్ర దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అ ధ్యక్షురాలిగా వి.శ్రీదేవి, కార్యదర్శి ఎస్.రవిప్రకాశ్, కో శాధికారిగా శేగు వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చే శారు. వివిధ రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు డాక్టర్ కె.పట్టాభిరామయ్య, డాక్టర్ ఎంసీ దాసు, డాక్టర్ జీవీ మోహనప్రసాద్, ఎంవీ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

లయన్స్ జిల్లా గవర్నర్‌గా శేషగిరిరావు బాధ్యతల స్వీకరణ

ధర్నాచౌక్: విరివిరిగా సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎక్కువ మందిని లయనిజం వైపునకు ఆకర్షించాలని లయన్స్ ఇంటర్నేషనల్ (316డి) జిల్లా గ వర్నర్ గద్దె శేషగిరిరావు సభ్యులకు సూచించారు. ల యన్స్ జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన ఆయన నగరంలో ని లయన్స్ కార్యాలయంలో బాధ్యతలకు బుధవారం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్క రూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వంటివి క్లబ్ తరపున చేయాలన్నారు. అనంతరం గద్దె శేషగిరిరావు దంపతులను సభ్యులు ఘనంగా సత్కరించారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యులు సుంకర కృష్ణ, రామిశెట్టి కొండలరావు పాల్గొన్నారు.



ఒలింపిక్స్ లోగోతో తయారైన లేసు వస్తువులు, న్యాప్కిన్లు, టవళ్లు, పిల్లో కుషన్లు

సీతారాంపురం టూ ప్యారిస్..!

- ఒలింపిక్స్‌లో మన హ్యాండ్ మేడ్ ఉత్పత్తులు
- లేసుతో తయారైన టవళ్లు, న్యాప్కిన్లు, పిల్లో కుషన్లు
- క్రీడాకారులకు అందించనున్న నిర్వాహకులు
- భారీ ఆర్డర్ దక్కించుకున్న సీతారాంపురం కంపెనీ
- ప్యారిస్‌లో మన చేతి ఉత్పత్తులకు అరుదైన గౌరవం

నరసాపురం రూరల్, జూలై 3: ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులను ఉర్రూతలూగించే ఒలింపిక్స్‌కు ఈ సారి ఫ్రాన్స్‌లోని ప్యారిస్ నగరం వేదికకానుంది. ఎక్కడో యూరప్‌లో జరిగే ఈ విశ్వక్రీడల్లో ఈ సారి మన ఆంధ్రప్రదేశ్‌లో తయారైన హ్యాండ్ మేడ్ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ నెల 26 నుంచి ఆగస్టు 11 వరకు జరిగే ఈ క్రీడల్లో పశ్చిమగోదావరి జిల్లా సీతారాంపురంలో తయారైన టవళ్లు, నాప్కిన్లు, పిల్లో కుషన్లు, బీచ్ టవల్స్ వంటి రోజువారీ వస్త్ర ఉత్పత్తులను క్రీడాకారులకు అందించనున్నారు. ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ)కి అనుబంధంగా ఉన్న ఒక ట్రేడింగ్ సంస్థ వీటిని ఉత్పత్తి చేసింది. ప్యారిస్ ఒలింపిక్స్‌లో సీతారాంపురంలో చేసిన లేసు ఉత్పత్తులు అందించడం ఎంతో గర్వంగా ఉందని ఆ కంపెనీ నిర్వాహకులు కలవకొలను రామ్‌చంద్రుడు తెలిపారు. ఈ కంపెనీ తరఫున నాలుగేళ్ల క్రితమే లేసుతో తయారు చేసిన ఉత్పత్తులను ఒలింపిక్స్‌కు అందించాలని భావించామని ఆయన చెప్పారు. కేంద్ర చేతివృత్తుల సంస్థ ఆధీనంలోని ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్ (ఈపీసీహెచ్) సహకారంతో ఈ ఆర్డర్ సాధించామని తెలిపారు. దీనికోసం దాదాపు వంద నామూనాలను తయారు చేసి పంపగా వాటిలో నాలుగు ఉత్పత్తుల్ని స్పాన్సర్ ఎంపిక చేశారని, వాటిని థర్డ్ పార్టీ ద్వారా దిగుమతి చేసుకున్నారని వెల్లడించారు. ఈ డిజైన్లు నచ్చడంతో ప్యారిస్‌లోని కొంతమంది వ్యాపారులు కూడా ఒలింపిక్స్ సింబల్స్‌తో ఉన్న లేసు అండ్ క్లాత్ ఉత్పత్తులను ఆర్డర్ ఇచ్చి దిగుమతి చేసుకున్నారని చెప్పారు.

ఈ ఆర్డర్ కోసం ఎంతో శ్రమపడ్డాం



ఒలింపిక్స్‌లో లేసు, క్లాత్ అనుబంధంతో తయారైన ఉత్పత్తుల్ని క్రీడాకారులకు, ప్యారిస్ విచ్చేసే క్రీడాభిమానులకు అందించేందుకు ఈ ఆర్డర్ కోసం ఎంతో శ్రమపడ్డామని కలవకొలను రామ్‌చంద్రుడు తెలిపారు. 'ఈపీసీహెచ్ డైరెక్టర్ డాక్టర్ రాకేష్‌కుమార్, లేసు ఎగుమతిదారులైన మా నాన్న తాతాజీ, చినాన్న కలవకొలను తులసీ దీనికి ఎంతో సహకారం ఇచ్చారు. లైసెన్స్, ఆర్డర్ దక్కడంలో రాకేశ్ కుమార్ ప్రోత్సాహం మరవలేను' అని రామ్‌చంద్రుడు చెప్పారు. కొవిడ్ తర్వాత లేసు పరిశ్రమ పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందనుకుంటున్న తరుణంలో ఈ ఆర్డర్ దక్కడం సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. - రామ్‌చంద్రుడు

అరబిందో ఆటలు...

(మొదటి పేజీ తరువాయి)

అరబిందో లాగేసుకున్న వైనం అప్పట్లో సంచలనం సృష్టించింది. కాకినాడ సెజ్ దేశంలోనే అతి పెద్దది. 2010లో జీఎమ్మార్ సంస్థ భూసేకరణ ద్వారా ఈ సెజ్‌లో 51శాతం వాటా కొనుగోలు చేసింది. కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్‌కు 46శాతం వాటా, ఏపీఐఐసీకి 3శాతం వాటా కలిగిఉన్నాయి. దీనికి అనుబంధంగా గ్రీన్‌ఫీల్డ్ ఓడరేవు నిర్మాణం కూడా చేపట్టాలని జీఎంఆర్ నిర్ణయించింది. ఇందుకోసం 2018 నవంబర్ 21న అప్పటి చంద్రబాబు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. పోర్టు నిర్మాణ కార్యకలాపాలు మొదలైనప్పటినుంచి వచ్చే ఆదాయంలో ఏటా 2.7శాతం చొప్పున 30ఏళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించేలా ఒప్పందం సైతం ఖరారైంది. ఆర్థికంగా పోర్టు నిర్మాణానికి నిధుల సమస్య ఉండడంతో అదానీ కంపెనీతో 2020 మార్చిలో జట్టు కట్టింది. కానీ ఉన్నట్టుండి 2021లో సెజ్‌లో తనకున్న మొత్తం 51శాతం వాటాను జీఎమ్‌ఆర్ సంస్థ... అరబిందో కంపెనీకి విక్రయిస్తూ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఇది అప్పట్లో కార్పొరేట్ కంపెనీ వర్గాల్లో పెనుసంచలనానికి దారితీసింది.

అలా తెరపైకి అరబిందో...

అరబిందో ఫార్మా రంగానికి చెందిన కంపెనీ. కానీ తొలిసారిగా ఓ సెజ్‌ను కొనుగోలు చేయడం వెనుక మతలబు ఏంటనేది కార్పొరేట్ వర్గాలకు అప్పట్లో అంతుపట్టలేదు. ఎన్నో ఆశలు, ఆశయాలు పెట్టుకున్న సెజ్‌లో వాటాను జీఎంఆర్ అనూహ్యంగా విక్రయించడం వెనుక అప్పట్లో చాలా కథ నడిచింది. స్వయంగా అప్పటి సీఎం జగన్ తన బినామీ కంపెనీ అయిన అరబిందోకు సెజ్‌ను విక్రయించేలా అధికారం ఉపయోగించారని ప్రచారం జరిగింది. జీఎమ్‌ఆర్‌పై ఒత్తిడి తెచ్చి తనకు కావాల్సిన అరబిందోకు అమ్మేలా చేశారు. ఇందుకోసం ఆ కంపెనీని బెదిరించారు. అప్పటికే విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ కాంట్రాక్టును 2019లో టీడీపీ ప్రభుత్వం... జీఎమ్‌ఆర్‌కు కట్టబెట్టింది. కాకినాడ సెజ్‌లో వాటా అరబిందోకు అమ్మకపోతే విమానాశ్రయ కాంట్రాక్టును రద్దు చేస్తామని ప్రభుత్వ పెద్దలు బెదిరించారు. దీంతో చేసేదిలేక అయిష్టంగా సెజ్‌ను, అందులో పోర్టులో వాటాను అరబిందోకు అమ్మాల్సి వచ్చింది.

'బల్క్'గా లాగేశారు

కాకినాడ సెజ్ చేతులు మారడానికి రెండు నెలల ముందు కాకినాడలో రెండు వేల ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు జగన్ ప్రభుత్వం ప్రకటించింది. కేంద్రం నుంచి సబ్సిడీల రూపంలో వచ్చే రూ. వందల కోట్లపై కన్నేసింది. అంటే రాబోయే బల్క్‌డ్రగ్ పార్కులో అరబిందో సంస్థ కీలకమయ్యేలా సర్కారులో పెద్దసారు చక్రం తిప్పారు. సెజ్‌ను కట్టబెట్టడం ద్వారా దేశంలో అరబిందోకు తిరుగులేకుండా చేయడానికి పథకం పన్నారు. విజయసాయిరెడ్డి ద్వారా తెరవెనుక లాలూచీలు నడిచాయి.

బెదిరించి రాయించేసుకున్నారు...

కాకినాడ సెజ్‌కు కొంచెం దూరంలో కాకినాడ నగరానికి ఆరు కిలోమీటర్ల దూరంలో కాకినాడ సీపోర్టు(డీప్ వాటర్‌పోర్టు) ఉంది. ఒకరకంగా ఇది ఆధునిక పోర్టు. జగన్ దీనిపైనా కన్నేశారు. ఎలాగైనా వశం చేసుకునేందుకు భారీ స్కెచ్ వేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి నేరుగా సీపోర్టు అధినేత కేవీరావును బెదిరించారు. పోర్టులో చాలా అక్రమాలున్నాయని, వాటాలు రాసిచ్చేయాలని ఒత్తిడి తెచ్చారు. ఆయన తొలుత దీనికి అంగీకరించలేదు. దీంతో కేసులు పెట్టి జైలుకు పంపుతామని హైదరాబాద్‌లో పంచాయితీ పెట్టి దారికి తెచ్చుకున్నారు. సర్కారు పెద్దలు మళ్లీ అరబిందోను రంగంలోకి దించారు. తన వాటాను 41 శాతాన్ని కేవీరావు... అరబిందోకు 2021లో విక్రయించారు. ఆ తర్వాత కొంతకాలానికి కాకినాడ సెజ్‌లో సీపోర్టు లిమిటెడ్‌కు ఉన్న వాటాలను సైతం బలవంతంగా కొనేశారు. తద్వారా కాకినాడ సెజ్‌లో దాదాపు నూరు శాతం వాటాను అరబిందో వశపర్చుకుంది. 50ఏళ్ల పాటు సీపోర్టును కేవీరావు ఆధ్వర్యంలోని కన్సార్టియం అధీనంలోనే కొనసాగేలా వైఎస్ హయాంలో ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ, అధికారంలోకి వచ్చిన వెంటనే కాకినాడ సీపోర్టుపై జగన్ కన్నువేశారు. దానిని పూర్తిగా అరబిందోకు బదలాయించారు. నిజానికి... ఒకే యాజమాన్యం కింద రెండు పోర్టులు ఉండకూడదని నిబంధన ఉంది. అయినా సరే... అరబిందో కోసం అధికారులు ఈ రూల్స్ మార్చేశారు. సీపోర్టును, డీప్ వాటర్ పోర్టును ఒకే సంస్థ చేతికిందికి తెచ్చారు.

అధికారంలోకి రాగానే విచారణ చేపడతాం

"అరబిందో సంస్థకు వైసీపీ ప్రభుత్వం రూ.307 కోట్ల విలువైన ప్రాజెక్టును అప్పనంగా కేటాయించింది. ఎలాంటి అర్హత లేని అరబిందోకు ఇంత భారీ ప్రాజెక్టు ఎలా ఇచ్చారో మంత్రి ఆళ్లనాని, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి సమాధానం చెప్పాలి. జ్యుడిషియల్ రివ్యూలో నిబంధనలు ఎందుకు మార్చారు? 108 అంబులెన్సుల నిర్వహణ ధర కూడా భారీగా పెంచేశారు. రూ.1.31 లక్షలు ఉన్న వాహనాల నిర్వహణ ధరను రూ.2.21 లక్షలకు ఎందుకు పెంచారు? విజయసాయిరెడ్డి పుట్టిన రోజు గిఫ్ట్‌గా జగన్ ఈ ప్రాజెక్టును ఇచ్చారు. గతంలో అంబులెన్సు ఏ టైమ్‌కి వస్తుందో తెలియదని, అసలు 108 అంబులెన్సులు కనిపించేవి కాదని జగన్ అనడం సరి కాదు. 108 అంబులెన్సులు ఏ సమయానికి బాధితుల వద్దకు వెళ్లాలని నిర్ణయించిందే మాజీ సీఎం చంద్రబాబు. కానీ, వైసీపీ వచ్చాకే అంబులెన్సు సేవలు ప్రారంభించినట్లు కలరింగ్ ఇస్తున్నారు. మా పార్టీ అధికారంలోకి రాగానే దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం"

- జూన్ 1, 2020న టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి

అరబిందో అంబులెన్స్ 'జీవితకాలం' లేటు

- 108 ఉన్నదే ఎమర్జెన్సీ సేవలకు...
- కానీ, జగమొండిలా అరబిందో అంబులెన్స్‌లు
- అనుభవం లేని సంస్థకు స్టీరింగ్..
- అప్పనంగా రూ.కోట్ల విలువైన ప్రాజెక్టు
- రోగుల ప్రాణాలతో ఆరోగ్యశాఖ ఆటలు

గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని అరబిందో చేసిన ఆరాచకాలు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే! 2020 జూన్ నుంచి అరబిందో 108 అంబులెన్సు సేవలు అందిస్తోంది. కానీ, ఆరోగ్యశాఖతో చేసుకున్న ఒప్పందంలో ఒక్కటంటే ఒక్కటి కూడా పాటించలేదు. దీనిపై గత నెల ఓ ప్రముఖ సంస్థ ప్రత్యేకంగా ఆడిట్ నిర్వహించింది. ఆ ఆడిట్ నివేదికను పరిశీలిస్తే, అరబిందో సంస్థ చేయని తప్పు లేదు. సమయానికి రోగులను ఆస్పత్రులకు చేర్చడంలో విఫలం కావడం ఘోరమైన నేరం. దాని వల్ల రోగులు చాలా సందర్భాల్లో 'గోల్డెన్ అవర్'లో వైద్య సేవలు పొందలేకపోయారు. పైగా రోగుల అనుమతి లేకుండా ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి, వారికి భారీగా ఆర్థికంగా నష్టం చేకూర్చారు. మరోవైపు సరైన ఎస్‌వోపీని (స్టాండెడ్ ఆపరేషనల్ ప్రొసీజర్స్) అరబిందో రూపొందించకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇంత దారుణంగా నిర్వహణ జరుగుతున్నా ఆరోగ్యశాఖ అధికారులకు మా త్రం ఏమీ కనిపించలేదు. ఆరోగ్యశాఖతో అరబిందో చేసుకున్న ఒప్పందం ప్రకారం... అర్బన్ ప్రాంతాల్లో 15 నిమిషాల్లో, రూరల్ ప్రాంతాల్లో 20 నిమిషాల్లో, గిరిజన ప్రాంతాల్లో 30 నిమిషాల్లో అంబులెన్సు ఘటన స్థలానికి చేరుకోవాలి. ఆడిట్ సంస్థ అర్బన్ ప్రాంతాల్లో 2.39 లక్షల కేసులను పరిశీలించగా, ఇందులో 37 శాతం కేసుల్లో అంబులెన్స్‌లు 15 నిమిషాలు దాటిన తర్వాతే బాధితులున్న ప్రదేశానికి వెళ్లాయి. రూరల్ ప్రాంతాల్లో 17 లక్షల కేసులను పరిశీలించగా, దాదాపు 31 శాతం కేసుల్లో ఘటనా స్థలానికి చేరుకోవడానికి అంబులెన్స్‌లకు గంటల సమయం పట్టింది. గిరిజన ప్రాంతాల్లో లక్ష కేసులు పరిశీలించగా, దాదాపు 20 శాతం కేసుల్లో అంబులెన్సులు ఆలస్యంగా చేరుకున్నాయని ఆ నివేదికలో తేలింది. ఆడిట్‌లో తేలిన మరో తప్పిదం.. ప్రైవేటు ఆస్పత్రులకు అరబిందో వాహన సేవలు! రూల్ ప్రకారం 108 అంబులెన్సుల ద్వారా రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలించడానికి వీల్లేదు. రోగులు అడిగితేనే ఇందుకు మినహాయింపు ఉంటుంది. అలాంటి కేసులు కూడా 15 శాతం మించరాదు. కానీ, చాలా కేసుల్లో రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు అంబులెన్స్‌ల్లో తరలించినట్టు ఆడిట్‌లో బయటపడింది. అరబిందో ఆధ్వర్యంలో ఇంత దారుణంగా అంబులెన్స్ సేవలు రాష్ట్రంలో నడుస్తున్నాయి.

తిరుమలలో దళారీల ఏరివేతకు చర్యలు

- నిందితులకు వారంలోగా శిక్షపడేలా చూడండి: టీటీడీ ఈవో

తిరుమల, జూలై 3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులను మోసగిస్తున్న దళారీలను గుర్తించి ఎప్పటికప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలరావు తిరుపతి ఎస్పీ హర్షవర్ధన రాజును కోరారు, తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఉదయం పోలీసు, టీటీడీ విజిలెన్స్ విభాగ అధికారులతో ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమలలో దళారీల ఏరివేతకు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమలలో ఐటీ అనుబంధంగా ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు సైబర్ క్రైం టీంను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంతకుముందు దర్శన దళారులకు సంబంధించిన డిప్ సిస్టం, రిజిస్ట్రేషన్ కేసులు, దొంగతనం, మద్యపానం, నకిలీ వెబ్‌సైట్లు తదితర అంశాలకు సంబంధించిన కేసులు ఏ దశల్లో ఉన్నాయో పోలీసు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ.. వారం లోపు ఈ కేసుల్లో ఉన్న దళారీలకు చట్టపరంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

నకిలీ గుర్తింపు కార్డుతో సుప్రభాతసేవకు

- తిరుమల పోలీసుల అదుపులో మార్కాపురం వాసి

తిరుమల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ గుర్తింపు కార్డుతో సుప్రభాత సేవకు వచ్చిన ఒక వ్యక్తిని టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వీరాంజనేయులు శ్రీవారి సుప్రభాత సేవకు ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తన పేరుపైనే ఆధార్ నంబరులో చివరి అంకెలను మార్చి రెండవసారి కూడా రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ క్రమంలో జూలై 1వ తేదీతో పాటు 2వ తేదీకి కూడా రెండు సుప్రభాతసేవ టికెట్లు డిప్‌లో లభించాయి. దీంతో 1వ తేదీ స్వయంగా సుప్రభాతసేవలో పాల్గొన్నాడు. రెండవ తేదీకి వచ్చిన టికెట్‌ను మిత్రుడు సత్యనారాయణకు ఇచ్చాడు. తన ఆధార్‌పై సత్యనారాయణ ఫొటోను, ఆధార్ నంబరు మార్చి నకిలీ గుర్తింపు కార్డు అందజేశాడు. 2వ తేదీ వేకువజామున దర్శనానికి వచ్చిన సత్యనారాయణను విజిలెన్స్ అధికారులు అనుమానంతో విచారించగా అసలు విషయం బయటపడింది. అతన్ని అదుపులోకి తీసుకుని తిరుమల పోలీసులకు అప్పగించారు.

సేంద్రీయ బియ్యంతోనే అన్నప్రసాదాలు: టీటీడీ

తిరుమల, జూలై 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి నివేదించే అన్నప్రసాదాల్లో సేంద్రీయ బియ్యం వాడకాన్ని నిలిపివేసినట్టు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని టీటీడీ బుధవారం ఓ ప్రకటన ద్వారా కోరింది. శ్రీవారికి నివేదించే అన్నప్రసాదాల కోసం సేంద్రీయ బియ్యం వాడకాన్ని నిలిపివేసి, గతంలో మాదిరిగా బియ్యాన్ని వాడాలని టీటీడీ నిర్ణయించిందని, అన్నప్రసాదాల దిట్టం కూడా పెంచాలని నిర్ణయించిందని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం పూర్తిగా అసత్యమని పేర్కొంది. టీటీడీ ఈవో శ్యామలరావు ఇటీవల అర్చక స్వాములతో, ఆలయ అధికారులతో సమావేశమై అన్నప్రసాదాలు, దిట్టం గురించి చర్చించారు, కానీ వీటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని టీటీడీ స్పష్టం చేసింది.

పశు సంవర్ధక శాఖలో పథకాల పునరుద్ధరణకు సీఎంకు లేఖ రాస్తా: స్పీకర్ అయ్యన్న


అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూలై 3: పశు సంవర్ధక శాఖలో నిలిచిపోయిన పథకాలకు బడ్జెట్ కేటాయించి, వాటిని పునరుద్ధరించాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాస్తానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆయన్ను జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ రాంబాబు బుధవారం కలిశారు. ఈ నెల ఆరో తేదీన నిర్వహించనున్న ఉచిత రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ గతంలో పశు దాణా, సైలేజ్ గడ్డి, గొర్రెలు, మేకలకు ఏలిక పాముల మందు పంపిణీ జరిగేదంటూ వాటి గురించి ఏడీని అడిగారు. గత నాలుగేళ్లుగా బడ్జెట్ లేకపోవడంతో అవన్నీ నిలిచిపోయాయని ఆయన సమాధానమిచ్చారు. అందుకు అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పథకాలు పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటానన్నారు.

ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా షకీల్ షఫి


షకీల్ షఫికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్, జూలై 3: రాష్ట్ర వక్ఫ్ బోర్డు అనుబంధ ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా అనంతపురం నగరానికి చెందిన కేఎం షకీల్ షఫి నియమితులయ్యారు. వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షాషావలి ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అనంతపురం నగరానికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు షకీల్ షఫి నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో మసీదుల అభివృద్ధికి, ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు.

ఆక్రమణకు వాస్తు సాకు..!

- 2005లో శారదా పీఠానికి 5 వేల అడుగుల స్థలం
- కానీ.. 10 వేల అడుగుల స్థలంలో భవనాల నిర్మాణం
- అదనపు స్థలాన్ని కూడా క్రమబద్ధీకరించిన టీటీడీ
- మఠాధిపతి జగన్‌కు సన్నిహితుడు కావడంతో నిర్ణయం
- తీవ్ర విమర్శలకు దారితీస్తున్న గత బోర్డు తీర్మానం


అదనపు స్థలంలో శారదామఠానికి అనుకుని కట్టిన భవనాలు

తిరుమల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శారదా మఠానికి గతంలో గుర్తుకురాని వాస్తు వైసీపీ ప్రభుత్వంలోనే గుర్తుకు వచ్చింది. ఆక్రమించిన స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవడం కోసం వాస్తు కారణాన్ని సాకుగా చూపించి... అదనపు గదుల నిర్మాణం కోసం టీటీడీ కేటాయించిన స్థలాని కంటే అదనంగా 4,817 చదరపు అడుగుల స్థలాన్ని ఖాతాలో వేసుకుంది. తిరుమల క్షేత్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, భక్తుల సౌకర్యాల కల్పనకు టీటీడీ కొన్ని మఠాలకు స్థలాన్ని లీజుకు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తిరుమలలోని దాదాపు 70 శాతం మఠాలు పూర్తిగా వ్యాపార ధోరణిలోకి వెళ్లిపోయాయి. ఈ క్రమంలో టీటీడీ నిబంధనలను పక్కన పెట్టేస్తున్నాయి. 2005లో శారదాపీఠానికి మఠం నిర్మాణం కోసం 5 వేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించేందుకు అప్పటి బోర్డు తీర్మానించి అనుమతులు జారీచేసింది. అయితే వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్ శారదామఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామికి శ్రీవారి సొత్తును కట్టబెట్టేందుకు టీటీడీకి సర్వాధికారాలు ఇచ్చేశారు. దీంతో దాదాపు పదివేల చదరపు అడుగుల స్థలంలో శారదాపీఠం భవనాలను నిర్మించేసింది. దీనిపై తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడంతో ఈ ఏడాది జనవరి 24న హైకోర్టు శారదా మఠం భవన నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని ఆదేశించింది. నిర్మాణాల్లో ఏ మేరకు అతిక్రమణలు జరిగాయో తేల్చేందుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. ఈ కమిటీ కూడా మఠం నిర్మాణాలను తనిఖీ చేసింది. జనసేన నేతలు, ఏపీ సాధు పరిషత్ స్వామిజీలు కూడా మఠం నిర్మాణంపై విమర్శలు చేశారు. అనుమతుల్లేకుండా జీ ప్లస్ 6 నిర్మాణాలు ఎలా చేస్తారని ఆగ్రహించారు.

12 ఏళ్ల పాటు గుర్తుకురాని వాస్తు

మఠం ఆక్రమించిన స్థలాన్ని క్రమబద్ధీకరించాలంటూ జగన్ ప్రభుత్వం రాగానే మఠం నిర్వాహకులు టీటీడీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ క్రమంలో వాస్తు కోసం అదనపు స్థలాన్ని తీసుకోవాల్సి వచ్చిందని మఠం నిర్వాహకులు తెలియజేయడం గమనార్హం. మఠం నిర్మాణం జరిగి దాదాపు 12 ఏళ్లు గడిచిన తర్వాత జగన్ సీఎం కాగానే వాస్తు సమస్య తెరపైకొచ్చింది. మఠం వినతి మేరకు అప్పట్లో టీటీడీ అధికారులు మఠాన్ని సందర్శించి ఆక్రమించిన స్థలాన్ని క్రమబద్ధీకరించారు. మఠాధిపతి అప్పటి సీఎం జగన్‌కు సన్నిహితుడు కావడంతో అదనపు స్థలాన్ని మఠానికి కేటాయించేశారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో గతేడాది డిసెంబరులో మఠానికి రూ.25,99,768 పెనాల్టీ విధించి స్థలాన్ని టీటీడీ క్రమబద్ధీకరించింది. తీవ్రస్థాయిలో విమర్శలు మొదలైన క్రమంలోనే పెనాల్టీ అంశాన్ని తెరపైకి తెచ్చారు. గతేడాదిగా బోర్డు తీసుకున్న నిర్ణయాలను టీటీడీ అధికార వెబ్‌సైట్‌లో పెట్టకుండా గోప్యంగా ఉంచారు. ప్రభుత్వం మారడంతో ఈవోగా వచ్చిన శ్యామలరావు ఆదేశంతో గత ఏడాదిగా తీసుకున్న తీర్మానాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ క్రమంలోనే ఈ వాస్తు అంశం వెలుగులోకి వచ్చింది.


హాస్టల్ తనిఖీ చేసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి స్వామి

మెనూలో పొంతన లేని లెక్కలు

- డిప్యూటీ డైరెక్టర్, వార్డెన్‌లపై మంత్రి ఆగ్రహం
- ఒంగోలులో సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన స్వామి
- పేద విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వీడాలని సూచన

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 3: 'డీడీ గారూ... మీకు లెక్కలు రావా.. ఒక్కో విద్యార్థికి మెనూ ఎంతో తెలియదు. రోజుకు ఎంత వంటనూనె, ఎంత కందిపప్పు ఇస్తున్నారంటే ఒక్కరూ చెప్పలేకపోతున్నారు. పేద విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వీడాలి. ఇకపై సంక్షేమ హాస్టళ్లు మెరుగుపడాలి' అంటూ సాంఘిక సంక్షేమం, సచివాలయాల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఒంగోలులోని బాలికల కళాశాల వసతిగృహం 2, 3లను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్, వార్డెన్‌లపై మండిపడ్డారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, మరుగుదొడ్లు, రూములను ఆయన రెండు గంటల పాటు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వారు పారిశుధ్యం అధ్వానంగా ఉందని, అలాగే ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని, మరికొందరు బాత్‌రూములు సరిపోవడం లేదని చెప్పారు. దీంతోప్రతిరోజు అందిస్తున్న మెనూ ఏమిటో తెలియదు, సమస్యల గురించి పట్టించుకోరు.. ఇలా అయితే కుదరదంటూ అధికారులపై మంత్రి మండిపడ్డారు. ఇదే సమయంలో ఇద్దరు మహిళా వార్డెన్లను ప్రశ్నించిన ఆయన వారి నుంచి కూడా సరైన సమాధానం రాకపోవడంతో పద్ధతి మార్చుకోవాలని, కచ్చితమైన లెక్కలు చూపాలని స్పష్టంచేశారు. స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ కార్పొరేషన్ అధికారులకు ఫోన్ చేసి, వెంటనే పారిశుధ్యం మెరుగుపరచాలని, హాస్టల్‌లో నీటికి ఇబ్బందిలేకుండా చూడాలని ఆదేశించారు. అంతేకాకుండా హాస్టల్‌కు ప్రతిరోజూ దినపత్రికలు వేయించాలని డీడీని ఆదేశించారు. అంతకుముందు స్థానిక ప్రభుత్వ బధిరుల పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి యువత భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టిసారించారని పేర్కొన్నారు. వారి ఉజ్వల భవిష్యత్ కోసం వివిధ ఉద్యోగ పోటీ పరీక్షల కోసం ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యే దామచర్లతో పాటు, కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉన్నారు.

ఇంజెక్షన్ ఖరీదు రూ.16 కోట్లు

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి
- ఆరు నెలల జ్వాయన్‌కు ఎస్ఎంఏ సమస్య
- ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి


చిన్నారి జ్వాయన్‌తో షేక్ యాసిన్, సిరిల్ దంపతులు

నరసరావుపేట టౌన్, జూలై 3: పల్నాడు జిల్లా నరసరావుపేట పనసతోటకు చెందిన షేక్ యాసిన్, షేక్ సిరిల్ దంపతుల కుమారుడు మహమ్మద్ జ్వాయన్ ఎస్ఎంఏ (స్పైనల్ మస్కిలేటర్ అట్రిల్) సమస్యతో బాధపడుతున్నాడు. పదివేల మందిలో ఒక్కరికి వచ్చే ఎస్ఎంఏ వ్యాధితో ఆరు నెలల చిన్నారి అస్వస్థతకు గురయ్యాడు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్న షేక్ యాసిన్ కుమారుడ్ని తొలుత బిందు న్యూరో కేర్‌లో చూపించారు. ఇది సాధారణ సమస్య కాదని గుర్తించిన వైద్యులు జెనిటిక్ పరీక్షకు పంపించగా అందులో పాజిటివ్ వచ్చింది. సెకండ్ ఒపీనియన్ కోసం సికింద్రాబాద్ రెయిన్ బో ఆస్పత్రికి వెళ్లగా అక్కడ కూడా పాజిటివ్ వచ్చిందని యాసిన్ తెలిపారు. ఈ వ్యాధి చికిత్సకు అవసరమైన ఇంజెక్షన్ అమెరికా నుంచి తెప్పించాలని, దాని ఖరీదు రూ.16 కోట్లని వైద్యులు చెప్పారని యాసిన్ వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమ కుమారుడ్ని కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. మానవత్వంతో స్పందించి దాతలు 9177834384 నంబరుకు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సినీఫక్కీలో ఎర్రచందనం రవాణా

- 2 కోట్ల విలువైన 4 టన్నుల దుంగలు స్వాధీనం
- నలుగురిని అరెస్టు చేసిన ఎర్రగుంట్ల పోలీసులు



మినీలారీలో చీపుర్ల కింద ఉన్న ఎర్రచందనం దుంగలు

ఎర్రగుంట్ల, జూలై 3: కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పొట్లదుర్తి జగనన్న కాలనీలో సుమారు రూ.2 కోట్ల విలువ చేసే 158 ఎర్రచందనం దుంగలను పోలీసులు మంగళవారం రాత్రి దాడిచేసి పట్టుకున్నారు. కాలనీలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఈ దుంగలను దాచారు. ప్రస్తుతం కాలనీ నిర్మాణంలో ఉండటం, చుట్టూ కంపచెట్లు పెరగడంతో ఎవరికీ అనుమానం రాకుండా ఇక్కడ డంపింగ్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. పొట్లదుర్తిలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలో ఓ ఇంటిలో ఎర్రచందనం దుంగలు స్టాకు ఉంచారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు బురదగా మారింది. దీంతో అక్కడికి మినీలారీ వెళ్లి దుంగలను లోడ్ చేసుకునే అవకాశం లేకపోవడంతో దానిని దూరంగా నిలిపి ఉంచారు. బుధవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో డంప్ చేసిన చోటు నుంచి దుంగలను ట్రాక్టర్‌లో తీసుకొచ్చి మినీ లారీలో లోడ్ చేయడం మొదలు పెట్టారు. ఈ మేరకు సమాచారం అందడంతో ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో దాడి చేశారు. డ్రైవర్ మరో ఇద్దరు తప్పించుకోగా, నలుగురు పట్టుబడ్డారు. మినీ లారీలో పైన కింద చీపుర్లను ఉంచి మధ్యలో 158 ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ చేసేందుకు సిద్ధం చేశారు. వీటిని ట్రక్కుతో సహా ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.రెండు కోట్ల వరకు ఉంటుందని అంచనా. జగనన్న కాలనీలో దుంగలు ఉంచిన ఇంటి యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎప్పటి నుంచి ఈ స్మగ్లింగ్ జరుగుతుందన్న విషయంపై కూపీ లాగుతున్నారు. కాగా.. పొట్లదుర్తి వద్ద పట్టుబడిన ఎర్రచందనానికి సంబంధించి కర్నూలు జిల్లా పత్తికొండ మండలం చిన్నఉల్లి గ్రామానికి చెందిన దూదేకుల బాషా, పత్తికొండ మండలం హోసూరుకు చెందిన ఫింజరి మహ్మద్‌రఫీతో పాటు ఎర్రగుంట్ల ఎన్టీఆర్ కాలనీకి చెందిన చెల్లబోయిన శివ, సాయిని అరెస్టు చేశామని కడప ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ప్రకటించారు.

'హాథ్రస్'పై సుప్రీం కోర్టులో పిటిషన్

» ఘటనపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతాపం

న్యూఢిల్లీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హాథ్రస్ దారుణంపై దర్యాప్తునకు సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టులో బుధవారం ఒక పిటిషన్ దాఖలైంది. న్యాయవాది విశాల్ తివారి ఈ పిటిషన్ వేశారు. తొక్కిసలాట ఘటనపై యథాతథ నివేదికను సమర్పించేలా యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని, ఏర్పాట్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఘటనకు కారణమైన అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు. పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడే సందర్భాల్లో తగు మార్గదర్శకాలు పాటించేలా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. మరోవైపు, హాథ్రస్ ఘటనపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టులో పిల్ దాఖలైంది. తొక్కిసలాటకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఈ పిల్ దాఖలు చేసిన న్యాయవాది గౌరవ్ ద్వివేది పేర్కొన్నారు. కాగా, హాథ్రస్ విషాదంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీలకు ఆయన ఒక సందేశం పంపించారు.

అగ్నివీర్ అమరుల పరిహారంపై రాజ్‌నాథ్‌వి అబద్ధాలు

» రాహుల్ గాంధీ ఆరోపణ.. ఖండించిన ఆర్మీ

న్యూఢిల్లీ, జూలై 3: అమరులైన అగ్నివీర్‌ల కుటుంబాలకు పరిహారం విషయమై పార్లమెంట్ సాక్షిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అబద్ధాలాడారని రాహుల్ గాంధీ మండిపడ్డారు. అందుకు ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'అమరుడైన ఓ అగ్నివీర్ కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించామని రాజ్‌నాథ్ అన్నారు. అయితే తమ కుటుంబానికి ఏ సాయం అందలేదని ఆ అగ్నివీర్ అజయ్ తండ్రే చెప్పారు' అంటూ 'ఎక్స్'లో రాహుల్ ఓ వీడియో షేర్ చేశారు. రాహుల్ ఆరోపణల నేపథ్యంలో ఆర్మీ స్పందించింది. అజయ్ సింగ్ కుటుంబానికి రూ.98 లక్షలు పరిహారంగా చెల్లించినట్లు వెల్లడించింది. 'అగ్నివీర్ స్కీంలోని నిబంధనల మేరకు మరో రూ.67 లక్షల వరకు పరిహారం, ఇతర ప్రయోజనాలు, పోలీసు ధ్రువీకరణ అయిపోగానే సెటిల్ చేస్తాం. దీంతో మొత్తం రూ.1.65 కోట్లు అవుతుంది' అని ఆర్మీ 'ఎక్స్'లో వెల్లడించింది. కాగా, రాహుల్ గాంధీ పార్లమెంటులో ఇటీవల హిందువుల గురించి చేసిన వ్యాఖ్యలపై బీహార్‌లో కేసు నమోదైంది.

నీట్‌పై నేడు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

న్యూఢిల్లీ, జూలై 3: జాతీయ పరీక్ష ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోన్న పోటీ పరీక్షల్లో అవకతవకలకు నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ గురువారం దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇండియా కూటమి పార్టీల విద్యార్థి సంఘాలు బుధవారం ధర్నా చేశాయి. కాగా, నీట్ విషయంలో అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రతిపక్షాలు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించారు. మరోవైపు, నీట్ పేపర్ల లీక్ కేసులో కీలక కుట్రదారుగా ఆరోపిస్తూ అమన్‌సింగ్ అనే వ్యక్తిని జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో సీబీఐ అరెస్టు చేసింది.

నీట్ రద్దు చేయాల్సిందే: తమిళ నటుడు విజయ్

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు, రాష్ట్ర సిలబస్‌లో చదివిన విద్యార్థులకు నీట్ చేటు కలిగిస్తుందే తప్ప మేలు కలిగించదని, ఇలాంటి పరిస్థితుల్లో ఆ పరీక్షను రద్దు చేయడమే శ్రేయస్కరమని తమిళగ వెట్రి కళగం అధినేత, ప్రముఖ సినీ హీరో విజయ్ పేర్కొన్నారు. నీట్ పరీక్షలు రాష్ట్ర హక్కులకు వ్యతిరేకమైనదని, విద్యను మునుపటిలా రాష్ట్రాల జాబితాలోనే చేర్చాలని డిమాండ్ చేశారు. ఒకే దేశం, ఒకే సిలబస్, ఒకే పరీక్ష అనే సిద్ధాంతం రాష్ట్ర హక్కులకు వ్యతిరేకమే కాకుండా విద్యార్థి లోకానికి తీరని ముప్పు కలిగిస్తుందన్నారు. రాష్ట్రాలకు సంబంధించిన సిలబస్‌తో చదివే విద్యార్థులకు కేంద్ర సిలబస్‌తో కూడిన పరీక్షలు నిర్వహించడం న్యాయమేనా అని ప్రశ్నించారు.

వైఫై సేవలను పునరుద్ధరించండి: రైల్వే బోర్డు

న్యూఢిల్లీ, జూలై 3: వివిధ రైల్వే స్టేషన్లలో కొన్ని కారణాల వల్ల వైఫై సేవలు నిలిచిపోయాయని సమస్యను గుర్తించి తక్షణమే ఇంటర్‌నెట్ సేవలను పునరుద్ధరించాలని రైల్వే బోర్డు కోరింది. ఈ మేరకు 17 జోన్ల జనరల్ మేనేజర్ల(సిగ్నల్, టెలికమ్యూనికేషన్)కు బుధవారం లేఖ రాసింది. "దేశంలో 6,108 రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు ఉచిత వైఫై సేవలు కొనసాగుతున్నాయి. అయితే చాలా స్టేషన్లలో జరుగుతున్న నిర్మాణ పనులు, నాసిరకం పరికరాలు వంటి కారణాల వల్ల వైఫై సేవలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్యను గుర్తించి త్వరగా పరిష్కరించండి" అని బోర్డు లేఖలో పేర్కొంది. అలాగే ప్రతివారం ఈ మేరకు నివేదిక సమర్పించాలని కోరింది.

అద్వానీకి అస్వస్థత.. ఢిల్లీలోని అపోలోలో చికిత్స

న్యూఢిల్లీ, జూలై 3: బీజేపీ కురువృద్ధుడు, మాజీ ఉప ప్రధాని లాల్‌కృష్ణ అద్వానీ అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి 9 గంటలకు ఆయన్ను న్యూఢిల్లీలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలోని ప్రత్యేక వైద్య బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. అద్వానీ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. 96 ఏళ్ల అద్వానీ వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తడంతో జూన్ 26 ఆయన్ను ఎయిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మూత్ర, హృదయ సంబంధ వైద్యులు సహా పలువురు స్పెషలిస్టు ఆయనకు చికిత్స అందించి మరుసటి రోజే డిశ్చార్జి చేశారు.

కంగనాపై చెయ్యి చేసుకున్న కానిస్టేబుల్ బదిలీ

న్యూఢిల్లీ, జూలై 3: గత నెలలో చండీగఢ్ విమానాశ్రయంలో నటి, బీజేపీ ఎంపీ కంగనారనౌత్‌పై చెయ్యి చేసుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ కుల్విందర్‌కౌర్‌కు ఊరట లభించింది. ఆమె బెంగళూరు సీఐఎస్ఎఫ్ 10వ రిజర్వ్ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. రైతు ఉద్యమాన్ని కంగనా కించపరిచారంటూ కౌర్ ఆమెను చెంప దెబ్బకొట్టారు. జూన్ 6న ఈ ఘటన జరగ్గా..ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. తర్వాత సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ కౌర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. ఆమెను బెంగళూరుకు బదిలీ చేసినప్పటికీ విచారణ కొనసాగిస్తామని ఓ ఉన్నతాధికారి చెప్పారు.

పీసీబీ ఫైళ్లు దహనం


(మొదటి పేజీ తరువాయి)


పోలీసుల అదుపులో ఉన్న కారు డ్రైవర్

సిట్ నమోదు చేసిన కేసుల్లో హెరిటేజ్ కంపెనీ పత్రాలను, ఇతర కీలక డాక్యుమెంట్లను దహనం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం రాత్రి కొందరు ప్రభుత్వ కారులో వచ్చి విజయవాడకు సమీపంలోని యనమలకుదురు కృష్ణా కరకట్టపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ), ప్రణాళికా శాఖల ఫైళ్లను తగులబెట్టడం సంచలనం సృష్టించింది. ఏపీ16ఈఎఫ్ 2596 నంబరు గల ఇన్నోవా కారులో డ్రైవర్‌తోపాటు కొందరు ఉద్యోగులు ఫైళ్లను తీసుకొచ్చి తగులబెట్టారు. తగులబెట్టిన ఫైళ్లలోని డాక్యుమెంటుపై మాజీ సీఎస్ సమీర్ శర్మ పేరు ఉంది. ఫైళ్ల దహనం చేస్తుండడం గమనించిన స్థానికులు నీళ్లు పోసి మంటలను ఆపివేశారు. వచ్చిన వారు కారులో పారిపోతుండగా స్థానిక టీడీపీ నాయకులు దానిని వెంబడించి ఆపారు. స్థానిక పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే బోడె ప్రసాద్, గన్నవరం డీఎస్పీ జయసూర్య, పెనమలూరు సీఐ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారును, అందులోని వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు అప్రమత్తం కావడంతో దుండగులు మరికొన్ని ఫైళ్లను వేరే చోట పడవేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఫైళ్ల దహనం గురించి తెలియగానే కృష్ణా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ నయీం అస్మీ కూడా ఘటనాస్థలానికి వచ్చారు. కాల్చిన ఫైళ్లలో వివరాలేంటో అధికారులే నిగ్గు తేల్చాల్సి ఉందని ఎమ్మెల్యే ప్రసాద్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులు అక్రమాల సాక్ష్యాలు దొరక్కుండా ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పూర్తి విచారణ జరిపి ఈ నేరానికి పాల్పడినవారిని, బడా నాయకుల బండారాన్ని వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు.

బిహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

» 15 రోజుల్లో ఏడు...!



పట్నా, జూలై 3 : బిహార్ రాష్ట్రంలో బ్రిడ్జిలు వరుసగా కూలుతూనే ఉన్నాయి. తాజాగా ఈ రాష్ట్రంలోని సివాన్ జిల్లాలో గండకి నదిపై ఉన్న బ్రిడ్జిలో కొంతభాగం బుధవారం ఉదయం కూలిపోయింది. దీంతో 15 రోజుల్లో ఏడు బ్రిడ్జిలు కూలినట్లయ్యింది. దేవ్‌రియా బ్లాక్‌లో మహరాజ్‌గంజ్‌ని పలు గ్రామాలతో అనుసంధానం చేసే బ్రిడ్జి ఇది. అయితే అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. సివాన్ జిల్లాలో 11 రోజుల్లో ఇది రెండో ఘటన. 1982-83 మధ్య కట్టిన ఈ బ్రిడ్జికి కొద్ది రోజులుగా మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు. అయితే ఆ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండడంతో గండకి నదిలోకి వరద వచ్చి బ్రిడ్జి బలహీన పడివుండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

భోలే బాబా పరార్!

» తాను వెళ్లాకే తొక్కిసలాట జరిగిందంటూ ప్రకటన

» లైంగికదాడి సహా గతంలో ఆయనపై పలు కేసులు

» హాథ్రస్ ఘటనపై పోలీసుల ఎఫ్ఐఆర్

» 80 వేల మందికి అనుమతి.. వచ్చింది 2.5 లక్షలు!

» రిటైర్డ్ జడ్జితో విచారణ: యోగి


భోలే బాబా ట్రస్ట్ ఎదుట పోలీసులు.. ట్రస్ట్ గోడకు బుధవారం ఓ మహిళ ప్రార్థన



లఖ్‌నవూ, హాథ్రస్, జూలై 3: జగమే మాయ.. విఽథ్య.. అని నిత్యం ప్రవచనాలు బోధించే భోలే బాబా.. మంగళవారంనాటి హాథ్రస్ దుర్ఘటన అనంతరం ఎవరికీ కనపడకుండా మాయమయ్యారు! తనను తాను అపరభగవంతుడిగా అభివర్ణించుకుంటూ చిక్కటి చిరునవ్వులతో నిత్యం భక్తజనానికి దర్శనమిచ్చే ఆయన.. బుధవారం ఉదయం పత్తా లేకుండా పోయారు! ఈ ఘటనపై దర్యాప్తు నిమిత్తం మెయిన్‌పురి జిల్లాలోని భోలేబాబా 'రామ్ కుటీర్ చారిటబుల్ ట్రస్ట్'కు వెళ్లగా.. అక్కడ ఆయన కనిపించలేదని.. ఆయన కోసం గాలిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. అయితే.. కొందరు పోలీసులు మాత్రం ఆయన ఇంకా ఆశ్రమంలోనే ఉన్నారని చెబుతున్నారు. పోలీసుల మాట ఇలా ఉండగా.. తన సత్సంగానికి వచ్చి దుర్మరణంపాలైనవారి కుటుంబాలకు సంతాపం తెలుపుతూ భోలే బాబా ఒక ప్రకటన విడుదల చేశారు. ఫుల్‌రాయ్‌లో సత్సంగానికి తాను వచ్చి వెళ్లిపోయాక కొంతమంది సంఘవిద్రోహ శక్తుల కారణంగా అక్కడ జరిగిన తొక్కిసలాటపై.. తన తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఏపీసింగ్ చట్టపరమైన చర్యలు తీసుకుంటారని అందులో పేర్కొన్నారు. ఈ ఘటనపై యూపీ పోలీసులు బుధవారం నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో కూడా భోలే బాబా పేరు లేకపోవడం గమనార్హం. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేరున్నా.. కేవలం నిర్వాహకుల పేరునే పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచారు. సత్సంగానికి అనుమతి తీసుకునేటప్పుడు.. 2 లక్షల మందికి పైగా భక్తులు ఈ కార్యక్రమానికి వస్తారని తెలిసినా 80 వేల మంది మాత్రమే వస్తారని పేర్కొంటూ అనుమతి తీసుకున్నారని, భక్తుల సంఖ్యను తక్కువగా చూపించడానికి వారి చెప్పులు, ఇతర వస్తువులను పక్కనున్న పొలాల్లోకి విసిరేశారని, సాక్ష్యాలను దాచే ప్రయత్నం చేశారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. బాబా వెళ్లిపోయే సమయంలో ఆయన వాహనాల టైరు కింద ధూళి తీసుకునేందుకు కొందరు కిందికి వంగారని, అదే సమయంలో వెనక నుంచి మరికొందరు ఆ ధూళి కోసం ఎగబడడంతో కిందకు వంగినవారంతా నలిగిపోయారని పేర్కొన్నారు. అదేసమయంలో.. బయటకు వెళ్లడానికి ప్రయత్నించిన భక్తులను లాఠీలు ధరించి ఉన్న బాబా భద్రతా సిబ్బంది ఆపేశారని.. ఆ సమయంలో తొక్కిసలాట జరిగి చాలా మంది మహిళలు, పిల్లలు కిందపడిపోయారని.. భక్తులంతా తోసుకుని ముందుకు రావడంతో వారు పైకి లేచే అవకాశం లభించక చనిపోయారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో.. పోలీసులు, అధికార యంత్రాంగం తప్పు ఎంతమాత్రం లేదని క్లీన్‌చిట్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన భోలే బాబా ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్ మధుకర్, ఇతర నిర్వాహకులపై.. భారతీయ న్యాయసంహితలోని 105, 110, 126 (2), 223, 238 సెక్షన్ల కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి భోలే బాబాపై పోలీసులు కేసు నమోదు చేయకున్నా.. ఆయనపై గతంలో లైంగిక దాడి, భూకబ్జా సహా పలు కేసులు నమోదయ్యాయి. కాన్పూర్‌లోని బిధ్ను ప్రాంతంలో ఉన్న కర్సుయి గ్రామంలో ఆయనపై భూకబ్జా కేసు నమోదైంది. 1997 దాకా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేసిన ఆయనపై లైంగిక దాడి కేసు కూడా నమోదైంది. ఆ కేసులో ఆయన కొన్నాళ్లపాటు జైలు జీవితం కూడా గడిపారు. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి బాబా అవతారం ఎత్తారు. సంతానం లేని భోలే బాబా.. తన సమీప బంధువు కుమార్తెను దత్తత తీసుకున్నారు. అయితే, ఆ పాప 2000 సంవత్సరంలో క్యాన్సర్‌తో చనిపోయింది. ఆమెను బతికిస్తానంటూ కొద్దిసేపు ఏదో ప్రయత్నాలు చేశారాయన. కానీ అవి ఫలించలేదు. దీంతో పోలీసులు అప్పట్లో బాబాపైన, ఆయన అనుచరులపైన కేసు పెట్టారు.

యోగి పరామర్శ..

హాథ్రస్ దుర్ఘటనలో మృతుల సంఖ్య 121కి పెరిగింది. మృతుల్లో 108 మందికిపైగా మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారు. ఎక్కువమంది ఊపిరాడక చనిపోయారని ఎటా జిల్లా అదనపు ప్రధాన వైద్య అధికారి డాక్టర్ రామ్‌మోహన్ తివారీ తెలిపారు. మరోవైపు.. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు ఆయా ఆస్పత్రుల వద్దకు చేరుకుని.. ఫోన్‌లో తమవారి ఫొటోలు చూపిస్తూ, వారి మృతదేహాలు ఎక్కడున్నాయో ఆరా తీస్తున్నారు. కాగా.. యూపీ సీఎం యోగి ఈ దుర్ఘటనపై హైకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించనున్నట్టు ప్రకటించారు. పోలీసు శాఖలో పనిచేసి రిటైరైనవారిని కూడా ఈ విచారణలో భాగం చేస్తామని తెలిపారు. ఈ విషాదానికి బాధ్యులెవరో గుర్తించడంతోపాటు.. దీని వెనుక కుట్ర కోణాన్నీ దర్యాప్తు చేయిస్తామని, కారకులైనవారిపై కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

భోలే బాబా.. రూటే వేరు!



భోలే బాబా అసలు పేరు సూరజ్ పాల్ జాతవ్. యూపీలోని కాస్‌గంజ్ తహశీల్ బహదూర్‌నగర్ గ్రామంలో ఒక సంపన్న దళిత కుటుంబంలో జన్మించిన ఆయన.. సగటు స్వామీజీల్లాగా కాషాయం, రుద్రాక్షమాలల వంటివాటిని ధరించరు. తెల్లచొక్కా, తెల్ల ప్యాంటు, స్నీకర్స్ బూట్లు, తెల్ల టోపీ.. ఒక్కోసారి మాంచిగా ఇన్‌షర్ట్ చేసి టై కూడా ధరించి టిప్‌టాప్‌ఎగా తయారై సత్సంగాలకు వచ్చి ప్రవచనాలు చెబుతుంటారు. మన తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన ఓ స్వామీజీలాగా.. భోలే బాబా కూడా తరచుగా తన భార్యతో కలిసి 'మానవ్ మంగళ్ మిలన్ సద్భావన సమాగమ్' పేరిట సత్సంగాలు నిర్వహిస్తుంటారు. ఆధ్యాత్మిక గురువుగా అవతారం ఎత్తిన తొలినాళ్లలో స్వగ్రామంలో తనకున్న 18.5 ఎకరాల భూమిలో ఒక ఆశ్రమాన్ని ప్రారంభించి బోధలు చేసేవారు. క్రమంగా వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో మెయిన్‌పురికి మకాం మార్చారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్.. ఇలా పలు రాష్ట్రాల నుంచి భోలే బాబాను చూడ్డానికి, ఆయన పాద ధూళిని నుదుటన ధరించడానికి భక్తులు లక్షలాదిగా వస్తుంటారు. ఆయనకున్న భక్తజనసందోహం సంఖ్య కారణంగా.. ఎన్నికల ప్రచార సమయంలో పలు పార్టీల అధినేతలు సైతం ఆయన్ను కలిసేంతగా భోలే బాబా ఖ్యాతి పెరిగిపోయింది. "జాతవ్ సామాజిక వర్గానికి చెందిన భోలే బాబాకు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల్లో లక్షల్లో భక్తులు ఉన్నారు" అని యూపీకి చెందిన పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

లోకం తీరు



బాబా సిబ్బంది తోసేశారు

» బురద నేలపై పరుగెత్తి జనం జారిపడ్డారు

» హాథ్రస్ తొక్కిసలాటకు ప్రధాన కారణాలివే

» సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నివేదిక

హాథ్రస్, జూలై 3: "భోలే బాబా వెళ్లిపోతున్నారు. ఆయన కారు వెళ్లిన దారిలో ధూళి అయినా తీసుకోవాలి" అనే మూఢ భక్తితో ఎగబడిన భక్తులను బాబా భద్రతా సిబ్బంది తోసేయడం.. వానపడి అక్కడి నేలంతా బురద బురదగా ఉండి జారుతుండడం.. హాథ్రస్‌లో తొక్కిసలాటకు కారణమయ్యాయి! 121 మందిని బలిగొన్న ఈ తొక్కిసలాటపై.. సికంద్రరావు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ప్రాథమిక నివేదికలో వెల్లడించిన వివరాలివి. ఈ దుర్ఘటన జరిగినప్పుడు తాను అక్కడే ఉన్నానని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. "సత్సంగం జరిగిన చోట దాదాపు 2 లక్షల మంది ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భోలేబాబా అక్కడికి చేరుకున్నారు. దాదాపు గంటసేపు సత్సంగం జరిగింది. ఆ తర్వాత.. 1.40 గంటల సమయంలో భోలే బాబా 'ఎటా'కు వెళ్లేందుకు బయటకు వచ్చారు. దీంతో ఆయన్ను దగ్గర్నుంచీ చూసి.. ఆయన పాద ధూళి తీసుకునేందుకు, ఆశీర్వాదం తీసుకునేందుకు భక్తులు పరుగులు తీశారు. ఆయన వాహనంలో వెళ్లిపోతుంటే.. దాని వెనకాల పరుగులు తీశారు. దీంతో బాబా వ్యక్తిగత భద్రతా సిబ్బంది (బ్లాక్ కమెండోలు), సేవాదార్లు వారిని వెనక్కి తోసేయడం మొదలుపెట్టారు. దీంతో వెనకాల ఉన్న కొంత మంది కింద పడిపోయారు. దీంతో.. వెనుక ఉన్నవారు భయాందోళనలకు గురై బయటకు వెళ్లడానికి ప్రయత్నించారు. కానీ అక్కడ నేల బురదగా, వాలుగా ఉండడంతో చాలా మంది కిందపడిపోయారు. వారు పైకి లేచేలోపే వెనక నుంచి పెద్ద ఎత్తున జనం వచ్చి వారిని తొక్కుకుంటూ వెళ్లిపోయారు" అని ఆయన తన నివేదికలో వివరించారు.

తొలిసారి 'విపక్షం'లో బీజేడీ

» రాజ్యసభలో ప్రభుత్వంపై విమర్శలు

న్యూఢిల్లీ, జూలై 3: గత పదేళ్లలో తటస్థంగా, అవసరమైనప్పుడు ఎన్డీయేకి అనుకూలంగా వ్యవహరించిన బిజూ జనతాదళ్ (బీజేడీ) బుధవారం ప్రతిపక్ష పాత్ర ధరించింది. మిగతా విపక్షాలతో కలిసి అధికార పక్షంపై విమర్శలు గుప్పించింది. ఇటీవలి ఒడిసా అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో.. 24 ఏళ్లు సుదీర్ఘంగా పాలించిన ఆ పార్టీ ఓటమి పాలైంది. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటైనా గెలవలేదు. ఇంతకాలం పార్లమెంటులో కీలక బిల్లులకు మద్దతిచ్చిన ఆ పార్టీకి రాజ్యసభలో 9 మంది సభ్యులు ఉన్నారు. బుధవారం ప్రధాని మోదీ ప్రసంగాన్ని బహిష్కరించి ఇతర విపక్షాలతో పాటు వారు వాకౌట్ చేశారు. తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని.. ఖనిజాలపై రాయల్టీ పెంచడం లేదని ఆ పార్టీ నేత సస్మిత్ పాత్రా ఆరోపించారు. మరోవైపు, విపక్షాలపై ఏపీకి చెందిన వైసీపీ మండిపడింది. రాజ్యసభలో ఆ పార్టీకి 11 మంది సభ్యులు ఉన్నారు. విపక్షాల ఆందోళనకు వారు దూరంగా ఉన్నారు. ప్రధాని ప్రసంగించేటప్పుడు లోక్‌సభలో ఆందోళనలు చేయడాన్ని ఆ పార్టీ నేత విజయసాయి రెడ్డి ఖండించారు.

సుధామూర్తికి ప్రధాని ప్రశంస



న్యూఢిల్లీ, జూలై 3: రాజ్యసభలో తొలి ప్రసంగం చేసిన నామినేటెడ్ ఎంపీ, పారిశ్రామికవేత్త, రచయిత్రి సుధామూర్తిని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఆమె దేశ సమకాలీన సమస్యలను ప్రస్తావించారని కొనియాడారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు బుధవారం ఆయన సమాధానమిస్తూ సుధామూర్తి లేవనెత్తిన అంశాలను ప్రస్తావించారు. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సర్వికల్ కేన్సర్‌పై పోరుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాలని మంగళవారం ఆమె సూచించారు. పాశ్చాత్య దేశాల్లో గత 20 ఏళ్లుగా 9-14 ఏళ్ల బాలికలకు సర్వైకల్ వ్యాక్సిన్ ఇస్తున్నారని చెప్పారు. మన దేశంలో కూడా బాలికలకు వ్యాక్సినేషన్ చేపట్టాలన్నారు. ఆ వ్యాక్సిన్ రూ.1,400కు లభిస్తోందని.. ప్రభుత్వం జోక్యం చేసుకుని కంపెనీలతో మాట్లాడితే రూ.700-800కే తగ్గించవచ్చన్నారు. అలాగే దేశీయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని సుధామూర్తి సూచించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, మహిళల సమస్యల గురించి కూడా ఆమె ప్రస్తావించారు.

రాహుల్ ఇంటి వద్ద భద్రత పెంపు

న్యూఢిల్లీ, జూలై 3 : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నివాసం వద్ద భద్రతను ఢిల్లీ పోలీసులు పెంచారు. పారామిలటరీ బలగాలు, పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని ఆయన నివాసం వద్ద ఆందోళనలు జరిగే అవకాశాలున్నాయన్న నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రాహుల్ గాంధీ ఇప్పటికే జడ్ ప్లస్ ఎల్ కేటగిరీ సెక్యూరిటీలో ఉంటున్నారు. బీజేపీ, ఆరెస్సెస్‌పై లోక్‌సభలో సోమవారం రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివిధ వర్గాలను ఆగ్రహానికి గురిచేశాయి. కాగా, రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ బీజేపీ నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బుధవారం ఆందోళనకు దిగారు.

అందుకే ఓడించారు

(మొదటి పేజీ తరువాయి)


మోదీ ప్రసంగిస్తుండగానే సభ నుంచి వెళ్లిపోతున్న విపక్ష ఎంపీలు

అన్నారు. అలాంటి వారే ఇలాంటి ప్రకటనలు చేస్తారని దుయ్యబట్టారు. భారతీయ జనతా పార్టీకి రాజ్యాంగం కేవలం అధికరణల సంకలనం కాదని, అది ఒక స్ఫూర్తి అని మోదీ చెప్పారు. ఎమర్జెన్సీలో రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పలుమార్లు అవమానించిందని, అనేక సవరణలు చేశారని, అసలు కాంగ్రెస్‌కు రాజ్యాంగమంటే గౌరవమే లేదని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో ఒక మహిళను బహిరంగంగా హింసించినప్పుడు, సందేశ్‌ఖాలీలో లైంగిక దాడులు జరిగినప్పుడు ప్రతిపక్షాలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ది ఓబీసీ వ్యతిరేక ప్రవర్తన అని, ఓడిపోయే సందర్భాల్లోనే దళితులను పోటీ చేయిస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మల్లికార్జున ఖర్గే ఎంతో శక్తిమంతంగా పనిచేశారని, బాగా కష్టపడ్డారని, అయినా ఓటమికి నిందను ఆయనే భరించాల్సి వచ్చిందని అన్నారు. ఒక కుటుంబం సురక్షితంగా ఉండేందుకు దళితులు, బీసీలు నిందను భరించాల్సి వస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దశలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే లేచి మాట్లాడేందుకు ప్రయత్నించారు. పలుమార్లు అభ్యర్థించినప్పటికీ రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆయనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో ఇండియా కూటమి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఖర్గేకు అవకాశం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. నినాదాల మధ్యే మోదీ ప్రసంగం కొనసాగించడంతో ప్రతిపక్ష సభ్యులందరూ వాకౌట్ చేశారు. మోదీ అబద్ధాలు చెబుతున్నారని, తాము నిజాలు చెప్పేందుకు ప్రయత్నిస్తుంటే మాట్లాడేందుకు అనుమతించలేదని ఖర్గే మీడియాకు చెప్పారు.



ప్రతిపక్షాల తీరుపై ధన్‌ఖడ్ ఆగ్రహం

ప్రతిపక్ష నేతల తీరుపై రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మాట్లాడుతుంటే వాకౌట్ చేయడం ప్రమాదకరమైన సంప్రదాయమన్నారు. ప్రతిపక్ష సభ్యులు రాజ్యాంగాన్ని అవమానించడమే కాకుండా సవాలు చేశారని, వారు చేసిన ప్రమాణాన్ని వారే కించపరిచారని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని, ఇప్పటికైనా వారు ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు.

వారికి నిజాలు వినే శక్తి లేదు

ప్రతిపక్షాలు వాకౌట్ చేయడాన్ని మోదీ తీవ్రంగా విమర్శించారు. అబద్ధాలు ప్రచారం చేసే వారికి నిజాలను వినే శక్తి ఉండదన్న విషయం ప్రజలు గమనిస్తున్నారన్నారు. వారు పెద్దల సభను, సభ మహోన్నత సంప్రదాయాన్ని అవమానపరిచారని తెలిపారు. ఎన్డీయేకు పట్టం కడుతూ 140 కోట్ల మంది భారతీయులు ఇచ్చిన తీర్పును వారు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. అతి సున్నితమైన మణిపూర్ సమస్యను ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని మోదీ విరుచుకుపడ్డారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇప్పటికే అక్కడ హింస తగ్గిందని, అనేక ప్రాంతాల్లో పాఠశాలలు కూడా తెరిచారని చెప్పారు. గతంలో మణిపూర్‌లో పది సార్లు పైగా రాష్ట్రపతి పాలనను విధించారని గుర్తుచేశారు. మణిపూర్ సమస్యను రాజేసిన వారే దాన్ని విస్మరించారని, ఏదో ఒకరోజు మణిపూర్ వారిని కచ్చితంగా తిరస్కరిస్తుందని మోదీ చెప్పారు. మణిపూర్‌లో సామాజిక సంఘర్షణలు ఎప్పటి నుంచో జరుగుతున్న విషయం చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుందని, ఈ సంఘర్షణలు లోతుగా ఉన్నాయన్న వాస్తవాన్ని ఎవరూ విస్మరించలేరని ఆయన అన్నారు. సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ హయాంలోనే సమస్య ఏర్పడిందన్న విషయం మరిచిపోరాదని చెప్పారు. మణిపూర్ కల్లోలం ఎన్డీయే హయాంలో ప్రారంభమైంది కాదని గుర్తుచేశారు. శాంతిని పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నామని, హోంమంత్రి అమిత్ షా అక్కడ ఎన్నో రోజులు ఉన్నారని తెలిపారు. మణిపూర్‌లో అగ్నికి ఆజ్యం పోయడం సరి కాదని, రాజకీయాలకు అతీతంగా ఎదగాలని ఆయన కాంగ్రెస్‌కు హితవు పలికారు. కాగా, సీబీఐ పంజరంలో చిలుక లాంటిదని కాంగ్రెస్ హయాంలోనే సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని మోదీ గుర్తుచేశారు. కానీ, తాను అవినీతికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛనిచ్చానని చెప్పారు. దేశ యువత భవిష్యత్తుతో ప్రతిపక్షాలు రాజకీయంగా ఆటలు ఆడుతున్నాయన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీక్ బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. ప్రధాని ప్రసంగం తర్వాత చైర్మన్ సభను నిరవధికంగా వాయిదా వేశారు.

132 సీట్ల బస్సు

» విమానం తరహాలో సౌకర్యంగా సీట్లు

» అందులో 'బస్ హోస్టెస్' సేవలు కూడా

» పైలట్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, జూలై 3: ప్రజారవాణా వ్యయాన్ని తగ్గించడంతో పాటు కాలుష్య రహిత ఇంధన వనరులతో నడిచేలా.. విమానం తరహాలో 132 సీట్లతో కూడిన పొడవైన బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని కేంద్ర మంత్రి గడ్కరీ పేర్కొన్నారు. దీనిలో విమానంలో ఎయిర్‌హోస్టెస్ మాదిరిగా 'బస్ హోస్టెస్' ఉంటారని, దీనికి సంబంధించి నాగపూర్‌లో పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నామని తెలిపారు. 'ఈ మధ్య నేను చెక్ రిపబ్లిక్ వెళ్లినప్పుడు అక్కడ మూడు బస్సులను కలిపి ట్రాలీ బస్సుగా ఏర్పాటు చేయడం చూశాను. ఇక్కడ కూడా ఇలాంటి పొడవైన బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టాటా సహకారంతో నాగపూర్‌లో పైలట్ ప్రాజెక్టును చేపట్టాం. 132 మంది కూర్చునే విధంగా ఎలక్ట్రిక్ బస్సును రూపొందిస్తున్నాం. దీనికి 40 కి.మీ.కి ఒకసారి చార్జింగ్ పెట్టుకోవాలి. 40 సెకన్లపాటు చార్జింగ్ పెడితే చాలు మరో 40 కి.మీ. ప్రయాణించవచ్చు. నిర్వహణ ఖర్చుకూడా కి.మీ.కి రూ.35 నుంచి రూ.40 మాత్రమే అవుతుంది' అని గడ్కరీ పేర్కొన్నారు.

విమానం తరహాలో సీటింగ్..

ఈ బస్సులో విమానం తరహాలో సీటింగ్, ఏసీ, సీటు ముందు ల్యాప్‌టాప్ పెట్టుకునే సౌలభ్యం ఉండాలని సూచించాను. ఇందులో 'బస్ హోస్టెస్' ఉంటారు. డీజిల్ బస్సుతో పోలిస్తే దీని నిర్వహణ ఖర్చు 30 శాతం తగ్గుతుందని భావిస్తున్నాం. సోలార్ పవర్‌ను వినియోగిస్తే ఈ ఖర్చు మరింత తగ్గుతుంది' అని గడ్కరీ అన్నారు. ట్రాక్టర్ తయారీదారులు కూడా ఇథనాల్, మిథనాల్, సీఎన్జీతో యంత్రాల తయారీపై దృష్టిపెట్టారని చెప్పారు.

ఝార్ఖండ్ సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్



రాంచీ, జూలై 03: ఝార్ఖండ్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం పదవికి చంపయ్ సోరెన్ రాజీనామా చేయగా, జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. బుధవారం రాంచీలోని చంపయ్ నివాసంలో సమావేశమైన కూటమి(జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ) ఎమ్మెల్యేలు.. సీఎంగా హేమంత్ మరోసారి పగ్గాలు చేపట్టాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. దాంతో చంపయ్ సోరెన్ గవర్నర్‌కు రాజీనామా సమర్పించారు. అయితే, రాజీనామాను చంపయ్ అవమానంగా భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆయన్ను జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను హేమంత్ కోరారు.

వ్యవస్థలన్నీ గాడి తప్పాయి!

- విధ్వంస పాలనకు ప్రజలు బలవుతున్నారు
- సీజనల్ వ్యాధులపై ముందే చర్యలు తీసుకోవాలి:సీఎం
- డయేరియాతో తొమ్మిది మంది మరణించడంపై సీరియస్
- సీజనల్ వ్యాధులపై సచివాలయంలో చంద్రబాబు సమీక్ష

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవస్థలన్నీ గాడి తప్పాయని, ఐదేళ్ల విధ్వంసానికి ప్రజలు బలవుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులపై బుధవారం వెలగపూడి సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలపై అధికారులు సీఎంకు వివరించారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ 60 డయేరియా కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం 6 గ్రామాల్లో 35 డయేరియా యాక్టివ్ కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ సీజన్‌లో 9 మంది డయేరియాతో చనిపోయారని వివరించారు. కలుషిత తాగునీటి వల్లే వీరంతా డయేరియా బారినపడి చనిపోయారని చెప్పడంతో అధికారులపై సీఎం మండిపడ్డారు. డయేరియాతో మరణించడం ఏమిటని ప్రశ్నించారు. ముందస్తు చర్యలు ఎందుకు చేపట్టలేదని నిలదీశారు. 'సీజనల్ వ్యాధుల నివారణలో ముందు నుంచే చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు చర్యలకు దిగితే పూర్తి ఫలితాలు రావు' అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశాఖలో 2014 నుంచి 2019 వరకూ టీడీపీ పాలనలో అనుసరించిన ఉత్తమ విధానాలను మళ్లీ అమలు చేయాలని ఆదేశించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామాల్లో వాటర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ పనులు పక్కాగా జరిగేవని, నాటి ఉత్తమ విధానాలను ఇప్పుడు మళ్లీ పునరుద్ధరించాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ వాటర్ క్వాలిటీ చెకింగ్ ల్యాబ్‌కు కేవలం రూ.14 లక్షలు చెల్లించకపోవడంతో సేవలు నిలిచిపోయాయని, ఇప్పుడు బకాయిలు చెల్లించి సేవలను మళ్లీ అందుబాటులోకి తెచ్చామని వివరించారు. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణంపైనా సీఎం చర్చించారు. కాలేజీల నిర్మాణ బాధ్యత మొత్తం ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు అప్పగించారు. సమీక్షలో మున్సిపల్, ఆరోగ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్ సింఘాల్, ఎం.టి.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్‌లూ పొలాలకు వెళ్లాలి

- అన్నదాతలతో నేరుగా మాట్లాడాలి: సీఎం
- ఖరీఫ్ సాగు సన్నద్ధతపై సమీక్ష

'గత ఐదేళ్ల అస్తవ్యస్త విధానాలతో తీవ్ర నష్టాల్లో ఉన్న రైతులకు మళ్లీ భరోసా కల్పించేలా వ్యవసాయ అధికారులు పని చేయాలి. ఐఏఎస్ అధికారులు సైతం సచివాలయం నుంచి పొలాలకు వెళ్లాలి. రైతులతో నేరుగా మాట్లాడాలి. అన్నదాతలకు అవసరమైన సూచనలు చేసి, కొత్త సాగు విధానాలపై వారికి అవగాహన కల్పించాలని' సీఎం చంద్రబాబు అధికారులకు నిర్దేశించారు. ఖరీఫ్ పంటల సాగు సన్నద్ధతపై అమరావతి సచివాలయంలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ, జలవనరులశాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 'దేశంలో ఎక్కువ అప్పులున్న రైతులు ఎవరంటే.. ఏపీ రైతులే అనే పరిస్థితి వచ్చింది. గత ఐదేళ్ల ప్రభుత్వ విధానాలతో సాగు భారంగా మారిపోయింది. ఇకనైనా ప్రభుత్వ పాలసీలు, సబ్సిడీల ద్వారా రైతులకు సాగు ఖర్చులు తగ్గాలి. గతంలో క్రమం తప్పకుండా భూసార పరీక్షలు నిర్వహించి, రైతులకు పోషక పదార్థాలు అందించే వాళ్లం. రాయలసీమలో పెద్ద ఎత్తున డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీలిచ్చాం. రైతులకు ఎన్నో మంచి పథకాలు ఇస్తే.. గత ప్రభుత్వం ఇలాంటి వన్నీ రద్దు చేసింది. ప్రాజెక్టుల నిర్వహణ గాలికి వదిలేసి, కనీసం గేట్లకు గ్రీజు కూడా రాయలేదు. పంట కాలువల్లో ఐదేళ్లలో పూడిక తీయని దుస్థితి నెలకుంది. అన్ని పంట కాలువల్లో గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలి. ఆక్వా, హార్టికల్చర్‌కు ఇక మరింత ప్రాధాన్యం ఇవ్వాలి' సీఎం దిశానిర్దేశం చేశారు. సాగునీటి విడుదల ప్రణాళికను ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. గోదావరి డెల్టాకు జూన్ 1న నీరు విడుదల చేశామని, బుధవారం పట్టిసీమ, పుష్కర, తాటిపూడి, పురుషోత్తమపట్నం ద్వారా నీటి విడుదల మొదలైందని చెప్పారు. ఈ సీజన్‌లో వర్షాలు ఆశించిన స్థాయిలో ఉన్నాయని, 45 మండలాల్లోనే వాన లోటు ఉందని, రాష్ట్రవ్యాప్తంగా సరాసరి 50% అదనపు వర్షపాతం నమోదైందని వివరించారు. ఇప్పటి వరకు 4.14లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా, 3.04లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయని తెలిపారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధం

- చంద్రబాబుతో క్లబ్ మహీంద్రా చైర్మన్ సీపీ గుర్నానీ భేటీ

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును క్లబ్ మహీంద్రా చైర్మన్ సీపీ గుర్నానీ మర్యాదపూర్వకంగా కలిశారు. తన బృందంతో విజయవాడ వచ్చిన ఆయన వెలగపూడి సచివాలయంలో సీఎంతో సమావేశమయ్యారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన చంద్రబాబుకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తమ సంస్థ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. పర్యాటకంతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తాము ఎదురుచూస్తున్నట్లు చంద్రబాబుకు వివరించారు. దీంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వారు ముందుకు రావడం ఆనందంగా ఉందంటూ వారికి చంద్రబాబు ఆహ్వానం పలికారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు!

- ఎమ్మెల్యే కొలికపూడికి చంద్రబాబు మందలింపు
- తిరువూరు టీడీపీ ఎమ్మెల్యేపై పోలీసు కేసు నమోదు

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ, జూలై 3: చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ముఖ్యమంత్రి చంద్రబాబు మందలించారు. తన నియోజకవర్గంలో ఓ వైసీపీ నేత అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని ఎమ్మెల్యే దగ్గరుండి కూలగొట్టించడం వివాదాస్పదమైంది. ఘటనపై పత్రికల్లో వార్తలు ప్రచురితమైన నేపథ్యంలో కొలికపూడిని బుధవారం సీఎం సచివాలయంలోని తన చాంబర్‌కు పిలిపించారు. 'రాష్ట్రంలో చట్టాలు ఉన్నాయి. ఎవరైనా అక్రమ నిర్మాణం చేపడితే అధికారులకు ఫిర్యాదు చేస్తే వాళ్లు చట్ట ప్రకారం చర్య తీసుకొంటారు. కింది స్థాయి అధికారులు పట్టించుకోకపోతే పై వాళ్లకు చెప్పాలి. లేకపోతే నా దృష్టికి తేవాలి. నువ్వు వెళ్లి అక్కడ నిలబడి కూలగొట్టించాల్సిన అవసరం ఏమిటి? చట్ట పరిధిలో దోషులను శిక్షిద్దాం తప్ప క్షేత్ర స్థాయికి వ్యక్తిగతంగా వెళ్లొద్దు' అని తేల్చిచెప్పారు. ఘటనపై కొలికపూడి సీఎంకు వివరణ ఇచ్చారు. 'ఆ వైసీపీ నేత చాలా దుర్మార్గాలు చేశాడు. 2013లో మీ కాన్వాయ్‌పై రాళ్ల దాడి చేశాడు. ఎంపీ కేశినేని చిన్ని మీద ఎన్నికల్లో దాడి చేయించాడు. చాలా మందిని వేధించాడు. అక్రమ నిర్మాణంపై నేను అధికారులకు చెప్పినా స్పందించలేదు. అందుకే నేను వెళ్లాల్సి వచ్చింది' అని కొలికపూడి చెప్పారు. కాగా, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై ఎ.కొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కంభంపాడు గ్రామంలో మంగళవారం వైసీపీ ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి భర్త చెన్నారావు(రాడ్) ఇంటి కూల్చివేతకు ప్రయత్నించిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చల్ల కృష్ణ తెలిపారు. తమ ఇంటిని దౌర్జన్యంగా ధ్వంసం చేశారంటూ నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యేతోపాటు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 60 మందిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మరోవైపు వైసీపీ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కైలే అనిల్‌కుమార్, స్వామిదాసు తదితరులు విజయవాడలోని పోలీసు కమిషనర్ కార్యాలయానికి వెళ్లి కంభంపాడు ఘటనలపై ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించి నిందితులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. భవానీపురంలో కార్పొరేటర్ భర్తపై జనసేన నేతలు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



2024 జూన్‌లో అమరావతిలోని సచివాలయం నిర్మించే ప్రాంతం ఇలా తయారుచేశారని చెబుతున్న సీఎం చంద్రబాబు

ఆకాశమే హద్దుగా.. అమరావతి!

(మొదటి పేజీ తరువాయి)

వరుసలో ఒకదాని వెంట ఒకటి వచ్చాయి. ఆ నగరాన్ని వినూత్న పద్ధతిలో మార్కెటింగ్ చేశాం. ఇక్కడా అదే జరగాలి. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు కలిసి పనిచేయాలి" అని చంద్రబాబు అన్నారు. రాజధానిని ఎడాపెడా మార్చకుండా ఒక చట్టం తేవడంపై ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. న్యాయపరంగా దానికి ఉన్న సాధ్యాసాధ్యలపై యోచిస్తున్నామన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో అమరావతిపై శ్వేతపత్రాన్ని ఆయన విడుదల చేశారు.. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

పాలనను ఫార్సుగా మార్చేశారు.

"రైతులకు పదేళ్లవరకూ ఇస్తామన్న కౌలు గడువు ముగుస్తున్న నేపథ్యంలో, వారితో చర్చించి నిర్ణయం తీసుకొంటాం. అమరావతి ఉద్యమంలో పాల్గొన్న రైతులపై పెట్టిన అక్రమ కేసులను సమీక్షించి నిర్ణయం తీసుకొంటాం. వైసీపీ ప్రభుత్వం విధ్వంసంతోపాటు పాలనను ఒక ఫార్సుగా మార్చివేసింది. దేనినీ పట్టించుకోలేదు. మేం ఉన్నప్పుడు రాష్ట్రంలో పట్టణాల్లో దోమల బెడద ఎక్కువగా ఉన్న ఇరవై వేల ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి అక్కడ డ్రోన్ల ద్వారా తరచూ సంబంధిత మందులు చల్లి ఆ సమస్యను పరిష్కరించాలని అనుకొన్నాం. ఆ ప్రాంతాలను గుర్తించాం. వైసీపీ ప్రభుత్వం తర్వాత చేయాల్సిన పనిలో ఒక్క శాతం కూడా చేయలేదు. నిన్న పింఛన్ల పంపిణీ సమయంలో వైసీపీ కార్యకర్తలు అక్రమంగా తీసుకొంటున్న పింఛన్లు ఆపుచేయాలని మా వాళ్లు కోరారు. వాళ్లు ఉన్నా ఫర్వాలేదని చెప్పి, నేను అందరికీ ఇప్పించాను. మా ఆలోచనా విధానం ఇలా ఉంటుంది"

ఇలాంటి పిచ్చి ఎక్కడా చూడం..

"పిచ్చోళ్లు తప్ప దేశంలో ఎవరూ రాజధానులను మార్చాలన్న ఆలోచన చేయరు. రాజధాని మార్పు పేరుతో జరిగిన వినాశనం మొత్తం దేశానికి ఒక కేస్ స్టడీ. ఒక నిర్ణయం తీసుకొని అమలు చేసిన వాళ్లు అధికారంలో కొనసాగితే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. మన రాష్ట్రంలో మేం మధ్యలో దిగిపోయాం. అయినా మేం నిరాశ పడటం లేదు. ప్రజలు నన్ను నమ్మి ఓట్లు వేశారు. దానిని నిలబెట్టుకోవాలి. కష్టమైనా, నష్టమైనా పని చేసి చూపించాలి"

ఆ కంపెనీలను తిరిగి రప్పిస్తాం...

"గతంలో 132 సంస్థలు అమరావతికి వస్తామంటూ ముందుకు వచ్చాయి. ప్రభుత్వం మారిన తర్వాత 128 సంస్థలు వెనక్కు వెళ్లిపోయాయి. సింగపూర్ కన్సార్టియం కొనసాగి ఉంటే పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించేది. వాళ్లనూ పంపించివేశారు. వారినందరినీ మళ్లీ పిలుస్తున్నాం. వస్తారో రారో చూడాలి. దేశంలో మొదటి పది స్థానాల్లో ఉన్న అంతర్జాతీయ స్కూళ్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులను గతంలో ఇక్కడకు రావాలని ఆహ్వానించాం. మళ్లీ పిలుస్తాం. మొదటి పది కాకపోతే.. మొదటి ఇరవై స్థానాల్లో ఉన్నవారిని అయినా పిలుస్తాం. పోయినసారి మేం ఉన్నప్పుడే అమరావతిలో విట్ ఇంజనీరింగ్ విద్యా సంస్థ వచ్చింది. అక్కడ ఒక విద్యార్థికి రూ.కోటి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. అమరావతిలోని ఎస్ఆర్ఎం విద్యా సంస్థలో ఇరవై వేల మంది విద్యార్థులు ఇప్పుడు చదువుతున్నారు. అందులో సగం మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారే. మేం కష్టపడి తెచ్చిన వాటికి కనీస వసతులు కూడా వైసీపీ ప్రభుత్వం కల్పించలేదు. ఎయిమ్స్ ఆస్పత్రికి కనీసం నీళ్ల వసతి లేక రోజూ ట్యాంకర్లతో తెప్పించుకొంటున్నారు. కేవలం నీటి కొరత వల్ల పడకల సంఖ్య సగానికి సగం తగ్గిపోయింది."

రావాల్సినవే రూ.లక్షల కోట్లు ఉంటాయి

"రాజధాని మార్పు పేరుతో అమరావతిని నిలిపివేయడం వల్ల ఎంత నష్టం జరిగిందో ఇంకా అంచనాలు వేయలేకపోతున్నాం. అమరావతిలో ప్రభుత్వం కింద ఎనిమిది వేల ఎకరాల భూమి ఉంది. మేం దిగిపోయే సమయానికి అక్కడ ఎకరం రూ.పది కోట్లు పలుకుతోంది. రాజధాని కొనసాగి ఉంటే ఆ ధర రూ.ఇరవై కోట్లకు చేరేది. అంతవరకే లెక్క వేసినా ప్రభుత్వం వద్ద ఉన్న భూమికి రూ.ఒక లక్షా అరవై వేల కోట్ల ఆదాయం వచ్చి ఉండేది. ఎవరినీ అడగాల్సిన పని లేకుండా రాజధాని నిర్మాణం జరిగేది. ఇప్పుడు అన్నీ మొదటి నుంచి చేసుకోవాల్సి వస్తోంది. అన్ని నిర్మాణాలు సగంలో ఆగిపోయాయి. అవి ఏ మేరకు దృఢంగా ఉన్నాయో చూసుకోవాలి. అమరావతిని నాశనం చేయడం లక్ష్యంగా పెట్టుకొని పనిచేశారు. అమరావతిని నిలిపివేయడం వల్ల ప్రభుత్వానికి, ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు వాటిల్లిన నష్టం లెక్క వేస్తే చాలా ఉంటుంది. మిగిలిపోయిన పనులకు మళ్లీ అంచనాలు పెంచాల్సి వస్తుంది. చాలా నష్టాలు జరిగాయి"

అమరావతితోనే ఏపీ భవిత

"అమరావతిలో మేం ఆనాడు ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ/ఐఏఎస్, ఎన్జీవో, జీవో టైప్ 1, 2, డీ అపార్ట్‌మెంట్‌లు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీల బంగ్లాలు, జ్యుడీషియల్ కాంప్లెక్స్ అడ్వకేట్ బ్లాక్, ప్రాజెక్టు ఆఫీస్, హైకోర్టు, అసెంబ్లీ తదితర భవనాల నిర్మాణాలకు సంబంధించి రూ.9,617 కోట్ల మేర పనులు అంచనా వేస్తే, సుమారు రూ.1,958 కోట్లు పనులు జరిగాయి. రాజధాని లేదని ఏపీపై పెట్టుబడిదారులు నమ్మకం కోల్పోయారు. ఒక్క వ్యక్తిని పాలకుడిని చేస్తే భవిష్యత్తును నాశనం చేశాడు. తిరిగి నిర్మాణాలు ప్రారంభించాలి. తిరిగి పెట్టుబడిదారుల్లో నమ్మకం కల్పించాలి. తిరిగి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవాలి. తిరిగి ప్రపంచ స్థాయి రాజధాని నిర్మించుకోవడం ద్వారా రాష్ట్ర ఇమేజ్‌ను పెంచుకుని, ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి. అమరావతి నిర్మాణం ద్వారా ఉపాధి కల్పన, సంపద సృష్టి జరిగి పేదరిక నిర్మూలన జరుగుతుంది. 26 జిల్లాల ఆదాయ వనరు మన అమరావతి. 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాల కల్పవల్లి అమరావతి" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.

వింటాం.. బాగుంటే అమలుచేస్తాం..

"అమరావతి నిర్మాణానికి సంబంధించి ఎవరేమి సలహాలు ఇచ్చినా సాదరంగా స్వీకరిస్తాం. బాగుంటే అమలు చేస్తాం. ఇప్పటికే పనులు చేపట్టిన పలు సంస్థలకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ ఖజానా చూస్తే ఖాళీగా ఉంది. 2019లో మేం దిగేపోయేనాటికి రూ.4,1170 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచాం. జరిగిన పనులకు సంబంధించి రూ.4,318 కోట్ల చెల్లింపులు జరిపాం. మరో రూ.1,268 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమరావతిని అతలాకుతలం చేసేశారు. చివరకు ఏపీకి రాజధానే లేకుండా పోయింది. ఏపీ ప్రజల ఆత్మగౌరవం సన్నగిల్లింది. ఆస్తుల విలువ తగ్గింది. సంపద సృష్టి జరగలేదు. మానవవనరులు వృథా అయ్యాయి"

అమరావతి, పోలవరమే ప్రధాన ఎజెండా

నేడు, రేపు చంద్రబాబు ఢిల్లీలో బిజీబిజీ

అమరావతి/న్యూఢిల్లీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు ప్రధాన ఎజెండాగా సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన సాగనుంది. శరవేగంతో అమరావతిని నిర్మించాలనే సంకల్పంతో ఉన్నామని, పోలవరం ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరలో సాకారం చేయాలనుకుంటున్నామని ప్రధాని మోదీకి చెప్పనున్నారు. ఈ రెండింటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందించాలని మోదీని కోరనున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు తొలిసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. బుధవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయం నుంచి బయల్దేరి ఢిల్లీ చేరుకున్నారు. ఆయనతో పాటు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కొందరు అధికారులు ఉన్నారు. గురువారం ఉదయం పది గంటలకు కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్, 11 గంటలకు ప్రధాని మోదీని కలుస్తారని సమాచారం. ఆ తర్వాత హోంమంత్రి అమిత్ షాను కలుస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకూ ఢిల్లీలో ఉంటారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విద్యుత్ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సహా దాదాపు డజను మంది మంత్రులను కలవనున్నారు. ఢిల్లీ చేరుకున్న వెంటనే చంద్రబాబు టీడీపీ ఎంపీలతో కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర అభివృద్ధి, కేంద్రం నుంచి సాధ్యమైనంత మేరకు నిధులు రాబట్టడమే తమ ప్రాధాన్యమని ఉద్బోధించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకొంటారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమవుతారు. సోమవారం ఇక్కడకు తిరిగొస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఉంటే ఉంటారు.. పోతే పోతారు!

- వైసీపీ ఎమ్మెల్సీలపై జగన్ వ్యాఖ్య
- తాడేపల్లి నివాసంలో కొందరు నేతలతో భేటీ
- కొంతకాలం ఓపిక పడదాం: మాజీ సీఎం
- నేడు నెల్లూరు జైలులో పిన్నెల్లికి పరామర్శ



అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఎమ్మెల్సీలు టీడీపీలోకి వెళ్లిపోతారేమోనని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వద్ద ఒక నేత ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. 'ఉంటే ఉంటారు.. పోతే పోతారు' అని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో బలంగా ఉండాలనుకునేవారు వైసీపీలో ఉంటారని .. రాజకీయంగా బలహీనంగా ఉన్నవాళ్లు వీడిపోతారని తెలిపారు. బుధవారమిక్కడ తాడేపల్లి నివాసంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ ఇసాక్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డితో పాటు మరికొందరు నేతలు జగన్‌ను కలిశారు. ఎన్నికల ఫలితాలపై యథావిధిగా ఏం జరిగిందో తెలియదని మాజీ సీఎం వారితో అన్నారు. వైసీపీ శ్రేణులపై దాడులు పెరుగుతున్నాయని.. వీటిపై కోర్టులకు వెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మారని చెప్పారు. వైసీపీ కంటే ఎక్కువ హామీలిచ్చిందని.. ఇప్పుడు వీటన్నిటినీ అమలు చేయాలి కదా అని అన్నారు. మహిళలకు నగదు పంపిణీ చేస్తామన్న వాగ్దానాన్ని సీఎం చంద్రబాబు ఎంతవరకు నెరవేర్చగలరో చూద్దామని చెప్పారు. ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రకారం కొంతకాలం ఓపికగా చూద్దామన్నారు. ఫలితాలు వచ్చి నెల రోజులవుతున్నా.. ఓటమి ఛాయల నుంచి ఆయన ఇంకా బయటపడలేదని.. తమ నాయకులతో ముభావంగానే మాట్లాడుతున్నారని వైసీపీ వర్గాలు తెలిపాయి. కాగా.. జగన్ గురువారం నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించనున్నారు.

ఇక ఉచితంగా ఇసుక

- త్వరలో నూతన పాలసీ ప్రకటన
- ప్రజలందరికీ అందుబాటులోకి
- రవాణా, లేబర్ చార్జీలు భరించాలి
- అక్రమాలను బయటకు తీస్తాం: కొల్లు రవీంద్ర
- చంద్రబాబు సమీక్ష అనంతరం ప్రకటన

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఇకనుంచి ఉచితంగా ఇసుక అందిస్తామని టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ప్రజలు, నిర్మాణ రంగం, కార్మికవర్గానికి మేలు చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా, త్రికరణశుద్ధిగా ఉచిత ఇసుకను అందిస్తామని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం సచివాలయంలో వెల్లడించారు. మంగళ, బుధవారాల్లో ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్ద సమీక్ష జరిగింది. ఉచితంగా ఇసుక అందించబోతున్నామన్న విషయం ప్రజలకు స్పష్టంగా తెలిసేలా ప్రకటించాలని మంత్రి కొల్లును చంద్రబాబు ఆదేశించారు. దీంతో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రకటన చేశారు. "2019కు ముందు తెలుగుదేశం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేసింది. జగన్ సర్కారు వచ్చాక దాన్ని ఎత్తివేసి అమ్ముకునే విధానం తీసుకొచ్చారు. పేదలకు ఇసుక దొరక్కుండా పోయింది. మేం ఇప్పుడు తిరిగి ఉచిత ఇసుక విధానం అమలు చేయాలనుకుంటున్నాం. వచ్చే రెండు లేదా మూడు నెలల్లో ఉచిత ఇసుక విధానం అమలుకు నూతన పాలసీ తీసుకొస్తాం. ఇసుకకు ఇక లోటు ఉండదని భరోసా కల్పించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష. అందరికి ఉచితంగా ఇసుక అందిస్తాం. రవాణా, లేబర్ చార్జీలు ఇసుకనే తీసుకెళ్లేవారే భరించాలి. ఉచితం పేరిట ఇసుక తీసుకొని అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. స్టాక్ పాయింట్లు, ఇతర డంప్‌యార్డ్‌ల్లో 35 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు.



జేపీ వెంచర్స్ బకాయి 700 కోట్లు

జగన్ పాలనలో ఇసుక అమ్మకాల కోసం మూడు కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఎన్జీటీ, హైకోర్టులో విచారణ జరిగిందని, అక్రమాలు వాస్తవమేనని నిర్ధారణ అయిందన్నారు. జేపీ వెంచర్స్ సంస్థ ప్రభుత్వానికి 700 కోట్ల రూపాయలు బకాయి ఉందని మంత్రి ఓ ప్రశ్నకు బదులిచ్చారు. అలాంటి సంస్థకు ఎలా బ్యాంక్ గ్యారెంటీలు ఇచ్చారో, నో డ్యూ సర్టిఫికెట్, ఎన్‌ఓసీలు ఎలా ఇచ్చారో బయటకు తీస్తామని, బాధ్యులైన ఏ ఒక్కరినీ వదలిపెట్టమని మంత్రి హెచ్చరించారు. ప్రస్తుతం ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ సంస్థలు ఇసుక కాంట్రాక్టులో ఉన్నందున దాన్ని రద్దుచేస్తారా? అన్న ప్రశ్నకు మంత్రి ఆచితూచి స్పందించారు. త్వరలో ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జగన్ సర్కారు ఏర్పాటు చేసిన సెబ్‌ను కొనసాగిస్తారా? అన్న ప్రశ్నకు... ఆ సంస్థ గురించి దేవుడికే తెలియాలన్నారు.

త్వరలో ఉత్తర్వులు

ఉచిత ఇసుక విధానం అమలు, విధివిధానాలపై త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈ విధానం అమలుకు ఇప్పటికే గనులశాఖ ఫైలు సిద్ధం చేస్తోంది. రెండు రోజుల్లో ప్రభుత్వానికి పంపించనుంది. చంద్రబాబు ఆమోదం తర్వాత అమల్లోకి తీసుకొస్తూ గనుల శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. ఈ నెల 8 లేదా 9వ తేదీన ఉత్తర్వులు వెలువడే వీలుంది.

నాడు తాడేపల్లికి... నేడు పేదవారికి

బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించడానికి 2016లో చంద్రబాబు ప్రభుత్వం ఇసుకను ఉచితం చేసింది. దీంతో అక్రమాలు ఆగాయి. పేదవారికి రీచ్‌ల్లో ఇసుక ఉచితంగా దొరికేది. జగన్ సర్కారు వచ్చాక ఉచిత ఇసుక ఎత్తేశారు. ఉమ్మడి జిల్లాల వారీగా వైసీపీ నేతలు, వారి మనుషులు నదులను పంచేసుకొని ఇసుక అమ్మకాలు జరిపారు. ఇలా ప్రతీ నెలా తాడేపల్లికి 20 కోట్ల చొప్పున కప్పం కట్టేవారు. జేపీ వెంచర్స్ తెచ్చి పెట్టుకున్న సబ్‌కాంట్రాక్ట్ సంస్థ టర్న్‌కీని బెదిరించి పంపించేశారు. ఆ తర్వాత అడ్డూఅదుపూ లేకుండా దందా నడిపారు. మధ్యతరగతి వర్గాలకు 20 టన్నుల లారీ ఇసుకను 35 వేలపైనే అమ్మి సొమ్ము చేసుకున్నారు. పెరిగిన ధరలతో నిర్మాణరంగం కుదేలైంది. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. చివరకు గత ప్రభుత్వంలో ఉచిత ఇసుక ఇచ్చినందుకు ప్రభుత్వానికి సీనరేజీ, ఇతర ఫీజుల రూపంలో 270 కోట్లమేర నష్టం జరిగిందని చంద్రబాబు నాయుడిపై సీఐడీతో కేసు పెట్టించారు. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ ఉచిత ఇసుక విధానం రానుంది. పేదలు, మధ్యతరగతి, సంపన్నవర్గాలు ఎవరికైనా సరే ఇసుక ఉచితమే. చీకటి అమ్మకాలు ఉండవు. ఈ నిర్ణయం వల్ల ప్రజలకు ఏటా 2వేల కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. జగన్ పాలనలో ఇసుక అక్రమాలు, తవ్వకాల వల్ల ఏటా 4 వేలకోట్లపైనే దోపిడీ జరిగిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

సవాంగ్ గుడ్ బై

- ఏపీపీఎస్సీ చైర్మన్ పదవికి రాజీనామా
- వెంటనే ఆమోదించిన ప్రభుత్వం



అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ చైర్మన్ పదవికి గౌతం సవాంగ్ బుధవారం రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ప్రభుత్వం వెంటనే ఆమోదించింది. జగన్ ముఖ్యమంత్రి కాగానే గౌతం సవాంగ్‌ను డీజీపీగా నియమించిన సంగతి తెలిసిందే. డీజీపీగా ఆయన పూర్తిస్థాయిలో జగన్ సేవలో తరించిపోయారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి విపక్ష నేత చంద్రబాబుపై రాళ్లు విసిరినా సీరియస్‌గా తీసుకోలేదు. పైగా.. 'నిరసన తెలపడంలో అదో భాగం' అన్నట్లు వింత వ్యాఖ్యలు చేశారు. ఇంత చేసినా జగన్ అయనను డీజీపీ పోస్టులో కొనసాగించలేదు. 2022లో పక్కకు తప్పించారు. తనకు గౌరవప్రదమైన పోస్టు ఇవ్వాలని కోరడంతో... ఏపీపీఎస్సీ చైర్మన్ పదవి కట్టబెట్టారు. దీనికోసం.. గౌతం సవాంగ్ ఐపీఎస్ కొలువును స్వచ్ఛందంగా వదులుకున్నారు. ఆయన హయాంలో ఏపీపీఎస్సీలో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-1 (2018) నోటిఫికేషన్‌ను గౌతం సవాంగ్ హయాంలో పూర్తిచేశారు. జవాబుపత్రాల మూల్యాంకనాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఒకసారి ఆన్‌లైన్‌లో మరొకసారి ఆఫ్‌లైన్‌లో చేశారు. గుంటూరు సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకనం చేసిన విషయాన్ని గౌతం సవాంగ్ దాచిపెట్టారు. దీనిపై అభ్యర్థులు న్యాయపోరాటం చేయడంతో హైకోర్టు ఆ ఉద్యోగాల భర్తీని రద్దుచేసింది. దీనిపై వైసీపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు దీనిపై సమగ్ర విచారణ చేస్తామని ప్రకటించారు. ఇందులో రూ.150 కోట్ల కుంభకోణం జరిగిందని టీడీపీ ఆరోపించింది. ఈలోగా ప్రభుత్వం మారిపోవడంతో సవాంగ్ రాజీనామాకు డిమాండ్లు పెరిగాయి. నిరుద్యోగుల భవిష్యత్తును నిర్ణయించే ఏపీపీఎస్సీని సవాంగ్ భ్రష్టుపట్టించారన్న విమర్శలు ఆయనపై వచ్చాయి. దీంతో తప్పని పరిస్థితుల్లో రాజీనామా చేశారు.

ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం..

- ప్రాధాన్యతాక్రమంలో ప్రాజెక్టులన్నీ పూర్తి
- బాబు ముందుచూపునకు పట్టిసీమే నిదర్శనం
- పట్టిసీమ, తాడిపూడి, పుష్కర 1, 2, పురుషోత్తపట్నం
- ఎత్తిపోతలకు నీరు విడుదల చేసిన నిమ్మల

ఏలూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి)/సీతానగరం: రివర్స్ టెండరింగ్‌తో పోలవరం ప్రాజెక్టును గత జగన్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో వెనక్కి తీసుకువెళ్లి సర్వనాశనం చేసిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రాధాన్యతాక్రమంలో ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి, ప్రతి ఎకరానికీ నీరు అందిస్తామని మంత్రి వెల్లడించారు. ఏలూరు జిల్లాలో బుధవారం పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల, తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న పుష్కర 1, పుష్కర 2, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలకు మంత్రి గోదావరి జలాలను విడుదల చేశారు. గోదారమ్మకు పూజలు చేసి హారతులు ఇచ్చారు. కరువు రహిత రాష్ట్రంగా చేయాలనే ఉద్దేశంతో పోలవరం నిర్మాణాన్ని చంద్రబాబు శరవేగంగా పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్నారని, ఈ ప్రాజెక్టు ఒకవేళ ఆలస్యమైతే రైతులు ఇబ్బందిపడకుండా పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేశారని తెలిపారు. రాబోయే మూడురోజుల్లో పట్టిసీమ, తాడిపూడి నీటి విడుదల సామర్థ్యం 8,500 క్యూసెక్కులకు పెంచుతామని రామానాయుడు తెలిపారు. "చంద్రబాబు దూరదృష్టికి పట్టిసీమే నిదర్శనం. కృష్ణా డెల్టాకు సాగునీరు అందించడమే కాకుండా ముందస్తుగా ఖరీఫ్ పంట వేసుకునేందుకు రైతులకు అవకాశం లభించింది. దానివల్ల కృష్ణా జలాలను రాయలసీమకు వినియోగించుకునే వీలు కలిగింది" అని మంత్రి వివరించారు. పుష్కర 1, పుష్కర 2, పంపింగ్ స్కీమ్‌ల ద్వారా 1.5 లక్షల ఎకరాలకు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 60 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేశామని మంత్రి తెలిపారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా 14 మండలాల్లో 135 గ్రామాల రైతాంగానికి కాలువల ద్వారా 2.6 లక్షల ఎకరాలకు సాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. పంపింగ్‌స్కీం నుంచి 1.38 లక్షల ఎకరాలకు కాలువల ద్వారా సరఫరా అవుతుందని, మెట్ట ప్రాంతాల్లో ఉన్న 65 వేల ఎకరాలకు సబ్ లిఫ్ట్‌ల ద్వారా సాగునీటిని అందిస్తున్నామని మంత్రి తెలిపారు.


పట్టిసీమ నుంచి నీరు విడుదల చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు



వీరపనేనిగూడెం పారిశ్రామికవాడలోని రాకెట్ విడిభాగాల తయారీ కంపెనీలో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే యార్లగడ్డ

పారిశ్రామికవాడల్లో భూముల ధర తగ్గింపునకు కృషి

▸▸ రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ వెల్లడి

అమరావతి(ఆంధ్రజ్యోతి), గన్నవరం, జూలై 3: పారిశ్రామికవాడల్లో భూముల ధరలను తగ్గించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ చెప్పారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరపనేనిగూడెం, మల్లవల్లి పారిశ్రామికవాడలను బుధవారం ఆయన సందర్శించారు. పారిశ్రామికవేత్తలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ 'గతంలో టీడీపీ ప్రభుత్వమే ఏర్పాటు చేసిన వీరపనేనిగూడెం, మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లలో పరిశ్రమల కోసం కేటాయించిన భూముల ధరలను.. వైసీపీ ప్రభుత్వం విపరీతంగా పెంచేసింది. టీడీపీ హయాంలో ఎకరం రూ.16.50 లక్షలకు ఇస్తే వైసీపీ ప్రభుత్వంలో రూ.85 లక్షలకు పెంచేశారు. ఇలా చేస్తే పారిశ్రామికవేత్తలు ఎలా వస్తారు? ఈ రెండు ఇండస్ట్రియల్ పార్కులను అతిపెద్ద పారిశ్రామికవాడలుగా తీర్చిదిద్దుతాం' అన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు 15 వేల నుంచి 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా పని చేస్తానన్నారు. కాగా, మంత్రి వస్తున్న విషయాన్ని తమకు తెలియజేయకుండా ఏపీఐఐసీ జోనల్ అధికారులు వివక్ష చూపారంటూ మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కులో సమస్యలు ఎదుర్కొంటున్న పారిశ్రామికవేత్తలు మండిపడ్డారు. మరోవైపు మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కుకు భూములిచ్చిన తమకు నష్టపరిహారం అందలేదంటూ రైతులు మంత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మంత్రి వెంట గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణా జిల్లా కలెక్టరు బాలాజీ, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో ప్రభుత్వ భూముల పందేరం

▸▸ కార్పొరేట్లకు కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలి: రామకృష్ణ

విశాఖపట్నం, జూలై 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అదానీతో సహా కార్పొరేట్ సంస్థలకు చేసిన భూ కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. నగరంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు ముగింపు సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ మద్దతుతో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందున రాష్ట్ర సమస్యలు, విభజన హామీలను పోరాడి సాధించేందుకు ప్రయత్నించాలన్నారు. రాజ్యసభలో వైసీపీ మద్దతు ప్రధాని మోదీకి అవసరం కాబట్టి టీడీపీ, వైసీపీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. స్టీల్‌ప్లాంటును విక్రయించబోమని కేంద్రం ప్రకటిస్తే సరిపోదని.. సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

డీకే శివకుమార్‌తో షర్మిల భేటీ

బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌తో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారమిక్కడ భేటీ అయ్యారు. తాజా రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించుకున్నట్టు సమాచారం. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఓటమిపై చర్చించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తు రాజకీయాలపై ఆమె కొన్ని ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం.



డీకే శివకుమార్‌తో చర్చిస్తున్న షర్మిల

టెట్, డీఎస్సీకి మరింత గడువు

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), డీఎస్సీ పరీక్షల నిర్వహణకు మరింత సమయం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అభ్యర్థులు, విద్యార్థి, యువజన సంఘాల విజ్ఞప్తుల మేరకు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. టెట్, డీఎస్సీల్లో ఒక్కోదానికి సన్నద్ధం కావడానికి అభ్యర్థులకు 3 నెలల గడువు ఇవ్వనున్నారు. ఇటీవల ఇచ్చిన టెట్ షెడ్యూలు ప్రకారం ఆగస్టు 5 నుంచి 20 వరకు ఈ పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే తాజాగా తీసుకున్న 90 రోజుల గడువు విధానంతో పరీక్షలు అక్టోబరులో జరిగే వీలుంది. ఆ తర్వాత డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చి మళ్లీ మూడు నెలలు సమయం ఇస్తారు. దీనివల్ల కొత్తగా బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులకు కూడా మెగా డీఎస్సీకి హాజరయ్యే అవకాశం లభిస్తుంది. కాగా, టెట్, డీఎస్సీ నిర్వహణకు కొత్త తేదీలను ప్రభుత్వం త్వరలోనే ప్రకటించనుంది. గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చేందుకు యత్నించిన అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని కూటమి సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకుంది.

గ్రూప్-2 మెయిన్స్ వాయిదా

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను పరిపాలనా కారణాల రీత్యా వాయిదా వేస్తున్నట్లు ఏపీపీఎస్సీ తెలిపింది. షెడ్యూలు ప్రకారం ఈ నెల 28న పరీక్ష జరగాల్సి ఉంది. ఈసారి మెయిన్స్‌లో కొత్తగా తీసుకొచ్చిన సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్జెక్టుకు అవసరమైన మెటీరియల్ మార్కెట్‌లో దొరకలేదు. గతంలో ఎప్పుడూ ఈ సబ్జెక్టు 75 మార్కులకు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అలాగే ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగాలు చేస్తున్నవారు పూర్తిస్థాయిలో సన్నద్ధం కాలేకపోయారని అభ్యర్థులు కమిషన్ దృష్టికి తేవడంతో ఏపీపీఎస్సీ ఈ నిర్ణయం తీసుకుంది.

చంద్రబాబుతో లడ్డా భేటీ... నేడు బాధ్యతలు

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాష్ట్ర నిఘా విభాగం అధిపతిగా నియమితులైన మహేశ్ చంద్ర లడ్డా భేటీ అయ్యారు. కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఆయన సీఆర్‌పీఎఫ్ నుంచి తిరిగి రాష్ట్ర సర్వీసులకు రావడంతో కీలకమైన ఇంటెలిజెన్స్ చీఫ్ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన లడ్డా గురువారం బాధ్యతలు తీసుకోనున్నారు.

ఢిల్లీ వచ్చేస్తా ప్లీజ్

▸▸ విజయ్‌కుమార్‌రెడ్డి పాట్లు.. రాష్ట్రం అనుమతిస్తేనే అవకాశం

▸▸ ఐఅండ్‌పీఆర్ కమిషనర్‌గా వైసీపీ హయాంలో సోషల్, డిజిటల్, జగన్ మీడియాకు వందల కోట్లు

▸▸ టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే జారుకునే యత్నం

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార ప్రసార శాఖ మాజీ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి చిక్కుల్లో పడ్డారు. వైసీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందనే అతి విశ్వాసంతో రెండేళ్ల డిప్యూటేషన్ పొడిగించుకున్న ఆయన వైసీపీ ఓటమితో కంగు తిన్నారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడటంతో ఢిల్లీకి తిరిగి వెళ్లేందుకు ప్రయత్నించినా రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చెయ్యలేదు. దీంతో ఢిల్లీ కేంద్ర ప్రసార మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లారు. 'నా డిప్యూటేషన్ జూన్ 9తో అయిపోయింది. నేను తిరిగి వచ్చేస్తా. నన్ను ఇక్కడ చేర్చుకోండి' అంటూ అభ్యర్థించారు. దానికి వారు చాలా స్పష్టంగా... 'రాష్ట్ర ప్రభుత్వం నుంచి రిలీవ్ ఆర్డర్ తీసుకొస్తేనే మేం ఇక్కడ చేర్చుకుంటాం. డిప్యూటేషన్ ముగిసినా మరో రెండేళ్లు ఎక్స్‌టెన్షన్ తీసుకున్నారుగా!' అంటూ వారు తేల్చి చెప్పారు. దీంతో చేసేదిలేక ఏపీ సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వైసీపీ నాయకుడిలా పనిచేసిన విజయ్ కుమార్ రెడ్డి రాష్ట్రంలో జగన్ భజన కోసం ఆయన సొంత మీడియాతో పాటు అనుకూల మీడియా, సోషల్, డిజిటల్ మీడియాకు రూ.వందల కోట్లు విడుదల చేసినట్లు ఆరోపణలున్నాయి. వాటిపై నిజా నిజాలు నిగ్గు తేల్చే పనిలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోనుంది. ఈ నేపథ్యంలో విజయ్‌కుమార్ రెడ్డి రాష్ట్రం వదిలి వెళ్లడం కష్టమేనని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

అసెంబ్లీ గేటు తాకలేవన్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఇచ్చిన తీర్పు దేశ రాజకీయాలనే మార్చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు ఉన్నా.. రాష్ట్ర ప్రజలు రక్తం చిందించకుండా ఓటుతో దానిని నేలకూల్చారని చెప్పారు. తగ్గింపబడిన వారు హెచ్చింపబడతారు అన్నట్లు 60 సీట్లకు పోటీ చేద్దామనుకుని 21 సీట్లకు పోటీ చేస్తే చివరకు దేశ రాజకీయాలను మార్చేసేలా నూరు శాతం స్ట్రైకింగ్ రేటు సాధించామని.. ఇది మామూలు విషయం కాదని.. ఈ గెలుపు దేశం మొత్తం మాట్లాడుకునేలా చేసిందని.. ఇదంతా ప్రజల చలవేనని అన్నారు. ఇన్ని దశాబ్దాల రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇంత ఘన విజయం ఎవరూ చూడలేదని.. దీనికి బీజం పిఠాపురం నుంచే పడిందని.. కూటమికి ప్రజలు ఇచ్చింది మామూలు శక్తి కాదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవం వల్లే ఒకటో తేదీనే పింఛన్లు, జీతాలు ఇవ్వగలుగుతున్నామని స్పష్టం చేశారు. తాను ఏ పదవీ ఆశించలేదని, వచ్చిన ఉప ముఖ్యమంత్రి పదవిని పిఠాపురం ప్రజలకే అంకితం చేస్తున్నానని ప్రకటించారు. కొన్నాళ్లు సేవ చేశాక.. తిరిగి సినిమా షూటింగ్‌లకు హాజరవుతానని తెలిపారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..

అందరూ భయపడిన సమయంలో..

వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ వణికిపోయారు. పోరాడడానికి ముందుకు రావడానికీ భయపడ్డారు. ఆ సమయంలో నేనొచ్చి రోడ్డుపై నిలబడితే జనసేన వీరమహిళలు, నేతలు ముందుకు వచ్చారు. అనుభవం ఉన్న టీడీపీ ముందుకు వచ్చి పోరాడింది. అదే సమయంలో అసెంబ్లీలోకి ఎలా అడుగుపెడతావో చూస్తామంటూ వైసీపీ నేతలు హెచ్చరించారు. వారి హెచ్చరికలను నాకంటే ప్రజలే సీరియస్‌గా తీసుకుని గెలిపించారు. గత ఎన్నికల్లో 151 స్థానాలు వచ్చిన పార్టీని 11 స్థానాలకు కూల్చారు. ఇదే ప్రజాస్వామ్యం గొప్పదనం. నాకు పిఠాపురంలో 70 వేలకుపైగా మెజారిటీ వస్తే.. ఉత్తరాంధ్రలో 90 వేలు దాటిపోయింది. దీనినిబట్టి కూటమికి ప్రజలు ఎంత బలంగా నిలబడ్డారో అర్థమైంది. వైసీపీ పాలనపై ఎంత విసిగిపోయారో కూడా అర్థమైంది. ఎన్టీఆర్ టీడీపీ పెట్టినప్పుడు గెలిచాం గానీ.. ఇంత మెజారిటీలు చూడలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారంటే ఆ ఘనత ప్రజలదే. నేను గెలిచిన తర్వాత చాలామంది హోం శాఖ, ఆర్థిక శాఖ తీసుకోవాలని సలహా ఇచ్చారు. కానీ బాపూజీ కలలు నెరవేర్చేలా పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నా. ఆ శాఖ గురించి చదువుతుంటే గత ప్రభుత్వం దారిమళ్లించిన నిధులు చూస్తుంటే బాధేస్తోంది. ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు నన్ను హైదరాబాద్‌లో ఉంటాడని, ఏపీలో ఉండడని ఎద్దేవా చేశారు. పిఠాపురం వాస్తవ్యుడిని కాదన్నారు. కానీ ఇప్పుడు మూడెకరాలు కొనడానికి రిజిస్ట్రేషన్ పత్రాలపై సంతకాలు చేశాను. నేనిప్పుడు సంపూర్ణ పిఠాపురం వాస్తవ్యుడిని. సీఎం సీఎం అని ఇక్కడి ప్రజలు అదే పనిగా అన్నారు. కానీ పురూహూతిక తల్లి డిప్యూటీ సీఎం అవ్వాలని చెప్పింది. చాలా మంది ఈ పదవి ఎలా ఉందని అడుగుతున్నారు.



పిఠాపురం పట్టణం డ్రైవర్స్‌కాలనీకి చెందిన బాలుడు భరత్‌తో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

నాకు అపజయం, విజయం తెలియవు. పదవి ఉన్నా, లేకపోయినా రాజులాగే ఉంటా. ఇటీవల ఓ తల్లి నా వద్దకు వచ్చి.. తన కూతురు కనిపించడం లేదని చెబితే బాధేసింది. తొమ్మిది నెలలుగా కనిపించని ఆ యువతిని పోలీసులు తొమ్మిది రోజుల్లో పట్టుకున్నారు. పోలీసు శాఖకు అభినందనలు. ఇది పనిచేసే నాయకుడిని బట్టి ఉంటుంది. గత ప్రభుత్వంలో ఇదేదీ జరగలేదు. 30 వేల మంది యువతులు అదృశ్యమయ్యారని మొత్తుకున్నా పట్టించుకోలేదు. ప్రజలు ఇచ్చిన బలం వల్లే ఈరోజు ఓ తల్లికి న్యాయం చేయగలిగాం.

కేంద్ర నిధుల కోసం బాబు, నేను కృషిచేస్తాం

సీఎం చంద్రబాబు అపార అనుభవం రాష్ట్రానికి చాలా ముఖ్యం. ఆయన, నేను కలిసి కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తేవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తాం. రాష్ట్రం ఆర్థికంగా అస్తవ్యస్తంగా ఉన్నా ఆయన అనుభవం వలనే ఒకటోతేదీన పింఛన్లు, జీతాలు ఇవ్వగలుగుతున్నాం. నేను గెలిపించగలను. కానీ పాలనానుభవం నాకు లేదు. అపార అనుభవం, దక్షత చంద్రబాబుకు ఉన్నాయి. వైసీపీ పాలనలో నలిగిపోయిన రాష్ట్రానికి ఆయనలాంటి నాయకుడైతేనే తిరిగి అభివృద్ధి పథంలో నడుస్తుందని భావించాను. దానికి తగ్గట్లుగానే వలంటీర్ల సాయం లేకుండా ఒకటో తేదీన పింఛన్లు, జీతాలు ఇవ్వగలిగాం. వైసీపీ రాకపోతే పథకాలు రావన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులు ఉదయం 6 గంటల నుంచే మొత్తం డబ్బులు ఇచ్చేశారు. ఇప్పుడిప్పుడే పాలన నేర్చుకుంటున్నాను. చంద్రబాబులా ఇంకా అర్థం చేసుకోలేదు. విశాఖలో రుషికొండలో బాత్‌టబ్‌కు రూ.30 లక్షలా? అంత ఖరీదైనది నేనే వాడను. ఆ భవనాలకు పెట్టిన రూ.600 కోట్లతో ఎన్నో రోడ్లు నిర్మించవచ్చు.

అన్నిటికీ పిఠాపురం ఎమ్మెల్యే తాలుకా అనొద్దు..

నన్ను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు. మీ అందరి ముందు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్నా. అయితే పిఠాపురం ఎమ్మెల్యే తాలుకా అంటూ ఎవరూ చెడ్డపేరు తేవొద్దు. బైకులపై నంబర్ ప్లేట్లు లేకుండా, వన్‌వేలో వెళ్తూ ఎమ్మెల్యే తాలుకా అనొద్దు. నిబంధనల ప్రకారం వ్యవహరించండి. ప్రస్తుతం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. మూడు నెలల్లో రోడ్లపై గుంతలు పూడ్చే పనులు చేస్తా. కొంత సేవ చేసి సినిమా షూటింగ్‌లకు హాజరవుతా. నిర్మాతలకు ఇదే చెప్పాను. ఓజీ సినిమా బాగుంటుంది. కాకపోతే ఇప్పుడు పనులు చేయకుండా షూటింగ్‌లకు వెళ్తే క్యాజీ అని మీరే అంటారు. ఎవరూ వైసీపీ నేతలపై దాడులకు దిగొద్దు. వారి విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది.

సముద్ర కోతకు శాస్త్రీయ పరిష్కారం

సముద్ర కోత నివారణకు శాస్త్రీయ పరిష్కారాన్ని అన్వేషించాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తరచూ సముద్ర కోతకు గురయ్యే ఉప్పాడ, సూరాడపేట ప్రాంతాల్లో బుధవారం ఆయన మారిటైం బోర్డు, కేంద్ర ఖగోళ శాస్త్ర అధికారులతో కలిసి పర్యటించారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండల పరిధిలో 8 తీరప్రాంత గ్రామాల్లో 1,360 ఎకరాలు సముద్రంలో కలిసిన విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయారు.

బాలుడితో పవన్ ముచ్చట్లు

▸▸ కాన్వాయ్ ఆపి అతడితో ఫొటోలు

పిఠాపురం, జూలై 3: తన అభిమాన నటుడు పవన్ కల్యాణ్ తన ఇంటి ముందు నుంచే వెళ్తున్నాడని తెలుసుకున్నాడు ఆ బాలుడు. పాఠశాలకు వెళ్లకుండా ఇంటివద్దే జనసేన జెండా పట్టుకుని కూర్చున్నాడు. అదే మార్గంలో వెళ్తున్న పవన్ అతడిని గమనించి కాన్వాయ్ ఆపి కిందకు దిగారు. బాలుడిని దగ్గరకు తీసుకుని ముచ్చటించారు. ఫొటోలు దిగారు. ఇప్పుడు ఈ వీడియోలు, ఫొటోలు వైరల్‌గా మారాయి. పిఠాపురం డ్రైవర్స్ కాలనీకి చెందిన లాండ్రీ, డ్రైక్లీనింగ్ షాపు నిర్వాహకుడు కొత్తెం హరీశ్. జనసేనలో క్రియాశీలంగా తిరుగుతుంటాడు. ఆయన కుమారుడు భరత్ వెంకట గంగరాజు ఆరో తరగతి చదువుతున్నాడు. ఎన్నికల ముందు నుంచీ తనను పపన్ వద్దకు తీసుకెళ్లాలని తండ్రిని అడుగుతున్నా తీసుకెళ్లడం లేదు. బుధవారం పవన్ పిఠాపురంలోనే పర్యటిస్తున్నాడని తెలుసుకుని భరత్ స్కూలుకు వెళ్లకుండా ఇంటి ముందు జనసేన జెండా పట్టుకుని కూర్చున్నాడు. ఇంటి ముందు రోడ్డు మీదుగానే పవన్ కాన్వాయ్ ఉప్పాడ వెళ్తున్న సమయంలో భరత్ జెండా పట్టుకుని ఊపుతూ పవన్‌కు కనిపించాడు. వెంటనే జనసేనాని కాన్వాయ్‌ను ఆపి వాహనం దిగారు. భరత్‌ను దగ్గరకు తీసుకుని అతడి ముచ్చట తీర్చారు. ఫొటోలు తీసుకున్నారు. బాగా చదువుకోవాలని ఆశీర్వదించారు. తన కుమారుడిని పవన్ కలుసుకోవడంపై తండ్రి హరీశ్ ఆనందం వ్యక్తం చేశాడు. ఇది తమ కుటుంబాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తిందని, తమ జీవితంలో మరిచిపోలేని రోజని, తనకు దక్కని అవకాశం తన కుమారుడికి దక్కిందని ఉబ్బితబ్బిబ్బయ్యాడు.



విశాఖపట్నంలోని ఐఐఎం క్యాంపస్

ఐఐఎం-విశాఖలో నారీ భేరి

▸▸ భారీగా పెరిగిన మహిళల ప్రవేశాలు

విశాఖపట్నం, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-విశాఖపట్నం(ఐఐఎంవీ)లో ఈ ఏడాది మహిళల ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. రెండేళ్ల రెసిడెన్షియల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రవేశాల ప్రక్రియ గత నెల 25తో ముగిసింది. మొత్తం 338 మందికి అడ్మిషన్ ఇవ్వగా, పదేళ్ల ఐఐఎం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 135 మంది(సుమారు 40 శాతం) మహిళలు ప్రవేశాలు పొందారు. ఐఐఎంలలో మహిళ ప్రవేశాల సగటు 25 నుంచి 30 శాతం మాత్రమే ఉండగా, విశాఖలోని ఐఐఎంలో జాతీయ సగటు కంటే పది శాతానికిపైగా ఎక్కువ అడ్మిషన్లు పొందడం విశేషం. ఇక్కడ చేరుతున్న విద్యార్థుల్లో 25 శాతం మంది వరకు మహారాష్ట్ర వాసులు ఉంటున్నారు. ప్రతి నలుగురిలో ఒకరు ఆ రాష్ట్రానికి చెందినవారు ఉన్నారు. ఆ తరువాతి స్థానంలో ఏపీ(7 శాతం మంది) ఉంది.

అబ్దుల్లా ఆత్మహత్యపై విచారణ

▸▸ అనంత పోలీసులకు మంత్రి ఫరూక్ ఆదేశం

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఇటీవల అబ్దుల్లా అనే ముస్లిం మైనార్టీ ఆత్మహత్యపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పోలీస్ అధికారులను ఆదేశించారు. అబ్దుల్లా ఆత్మహత్య అంశాన్ని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షారూఖ్ షిబ్లీ బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారణ జరపాలని అనంతపురం పోలీసులను మంత్రి ఆదేశించారు. అబ్దుల్లా భార్యకు అనంతపురం మైనార్టీ సంస్థలో ఉపాధి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. అలాగే అబ్దుల్లా పిల్లలకు ఉచిత విద్య అందించాలని ఆదేశించారు.

మోస్తరుగా నైరుతి కదలికలు

విశాఖపట్నం, జూలై 3(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల కదలిక ఒక మోస్తరుగా ఉండడంతో రాష్ట్రంలో కొన్నిచోట్ల మేఘాలు ఆవరించగా, మరికొన్నిచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. తిరుపతిలో 39.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు రుతుపవనాల ప్రభావంతో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తాలో తీరం వెంబడి బలంగా గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

జగన్ అక్రమాస్తుల కేసుల్లో రోజువారీ విచారణ

▸▸ సీబీఐ కోర్టుకు తెలంగాణ హైకోర్టు ఆదేశం

▸▸ ఇప్పటిదాకా పురోగతి లేదని వ్యాఖ్య

▸▸ తదుపరి విచారణ 23కు వాయిదా

▸▸ దశాబ్దం దాటినా తేలని 'డిశ్చార్జి పిటిషన్లు'



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణలో ఎలాంటి పురోగతీ లేదంటూ తెలంగాణ హైకోర్టు పెదవి విరిచింది. ఈ కేసుల్లో రోజు వారీ విచారణ చేపట్టాలని సీబీఐ ప్రత్యేక కోర్టును ఆదేశించింది. ఇందులో పురోగతిపై తదుపరి విచారణ నాటికి నివేదిక సమర్పించాలంటూ.. కేసును ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది. ప్రజాప్రతినిధుల కేసుల్లో విచారణ వేగవంతం చేయాలనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు టీ-హైకోర్టు ప్రత్యేకంగా ఆయా కేసుల విచారణను పర్యవేక్షిస్తోంది. దీంతోపాటు జగన్ కేసులను వేగవంతంగా విచారణ చేపట్టాలని కోరుతూ మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య పిల్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై బుధవారం చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ టి. వినోద్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధుల కేసులకు సంబంధించిన కేసుల్లో సంతృప్తికరమైన పురోగతి లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆయా కేసుల్లో నిందితులకు సమన్లు అందజేసే విషయంలో మరింత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ కోరారు. ఇందుకోసం డిజిటల్ వ్యవస్థను వినియోగించుకోవాలని హైకోర్టు సూచించింది.

ఇప్పటికైనా కదలిక వచ్చేనా?

ఉమ్మడి రాష్ట్రంలో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ భారీగా అక్రమాలకు పాల్పడ్డారంటూ సీబీఐ, ఈడీలు మొత్తం 20 చార్జిషీట్లు దాఖలు చేశాయి. ఈ కేసులపై సీబీఐ కోర్టులో గత 12 ఏళ్లుగా విచారణ కొనసాగుతూనే ఉంది. జగన్, విజయసాయిరెడ్డి సహా ఇతర నిందితులు దాదాపు 130 డిశ్చార్జి పిటిషన్లు దాఖలు చేశారు. వరుస పిటిషన్లు, దానిపై విచారణలు, మధ్యలో సీబీఐ కోర్టు జడ్జిల బదిలీలతో... అసలు కేసుపై విచారణే మొదలు కాలేదు. 2013 నుంచి సీబీఐ కోర్టులో ఏడుగురు జడ్జిలు బదిలీ అయ్యారు. ప్రజాప్రతినిధుల కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టులు పర్యవేక్షిస్తున్నా.. వేగంగా విచారణ పూర్తి చేసి.. తీర్పులు ఇవ్వాలని మార్గదర్శకాలు జారీచేసినా ఇదీ పరిస్థితి. నిజానికి... హైదరాబాద్ సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జి పిటిషన్‌లను ఫిబ్రవరి 29లోగా పరిష్కరించాలని గతేడాది డిసెంబరులో హైకోర్టు పేర్కొంది. అయితే భారీగా ఉన్న రికార్డులను పరిశీలించడంతోపాటు సాక్షుల వాంగ్మూలాలు రికార్డు చేయాల్సి ఉందని.. 13 వేల పేజీల డిక్టేషన్ సిద్ధం చేస్తున్నందున మరింత గడువు కావాలని సీబీఐ కోర్టు కోరడంతో గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. ఆ రోజున తీర్పు వెలువడుతుందని అంతా భావించగా... తనకు అనారోగ్యం వల్ల తీర్పు వెల్లడించలేకపోతున్నానని జడ్జి ప్రకటించడం సంచలనంగా మారింది. ఆ తర్వాత ఆయన బదిలీపై మరో కోర్టుకు వెళ్లిపోయారు. కేవలం డిశ్చార్జి పిటిషన్‌లకే దశాబ్దకాలం పడితే.. ప్రధాన కేసులు ఎప్పుడు విచారణకు వస్తాయి? ఎప్పుడు శిక్షలు పడతాయి? అన్న అంశాలు ప్రశ్నార్థకంగా మారాయి.

పొమ్మంటేే గాని పోలేదు!

▸▸ ఇంధన సంస్థల డైరెక్టర్లు అవుట్

▸▸ రాజీనామా చేయాలని మొన్న రాత్రి ఆదేశాలు

▸▸ తెల్లవారేసరికి వైదొలగిన డైరెక్టర్లు

▸▸ తక్షణమే ఆమోదిస్తూ ప్రత్యేక సీఎస్ ఉత్తర్వులు

▸▸ సీపీడీసీఎల్ సీఎండీగా జెన్కో ఎండీకి అదనపు బాధ్యతలు

▸▸ ఎస్పీడీసీఎల్‌ను ఇంకా వదలని సంతోష్‌రావు



అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి నెలరోజులు కావస్తున్నా.. ఇంధన సంస్థల్లో నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి నియమించిన డైరెక్టర్లు రాజీనామా చేయకుండా తిష్టవేశారు. వీరి చిట్టాను ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్ కె.విజయానంద్ మంగళవారం రాత్రి ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు. మంత్రి సలహాతో ఆయన సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రతో కలసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ డైరెక్టర్ల జాబితాను సమర్పించారు. వారందరినీ తక్షణమే తొలగించాలని సీఎం ఆదేశించారు. దీంతో వైసీపీ జమానాలో ఇంధన సంస్థలలో చేరిన డైరెక్టర్లందరూ వెంటనే రాజీనామాలు చేయాలని అప్పటికప్పుడే ఆదేశించారు. దరిమిలా వారు బుధవారం ఉదయానికే రాజీనామాలు సమర్పించారు. వాటిని తక్షణమే ఆమోదిస్తూ ఇంధన శాఖ ఉత్తర్వు కూడా జారీ చేసింది. రాజీనామా చేసిన వారిలో ఏపీ జెన్కో థర్మల్ డైరెక్టర్ డీఎస్‌జీఎస్ఎస్ బాబ్జీ, ఏపీ జెన్కో హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ, ఏపీ జెన్కో హెచ్ఆర్ ఐఆర్ డైరెక్టర్ సయ్యద్ రఫీ, ఏపీ ట్రాన్స్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ టి.వీరభద్రారెడ్డి, ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ సి.శ్రీనివాసమూర్తి, ఏపీఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ ఏవీవీ సూర్యప్రతాప్, ఏపీసీపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.బ్రహ్మానందరెడ్డి, ఏపీసీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ బి.జయభారతరావు, ఏపీసీపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టి.వనజ, ఏపీఎస్పీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కె.శివప్రసాదరెడ్డి ఉన్నారు.

ఆయన అక్కడే..

ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా సంతోష్‌రావును తొలగించి.. ఏపీ జెన్కో ఎండీ చక్రధరబాబుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే సంతోష్‌రావు ఇంకా ఎస్పీడీసీఎల్ సీఎండీగా కొనసాగుతుండడం గమనార్హం. వాస్తవానికి డిస్కంల సీఎండీలుగా గతంలో అఖిల భారత సర్వీసు అధికారులను నియమించేవారు. కానీ ప్రైవేటు వ్యక్తులను నియమించే కొత్త సంస్కృతికి జగన్ తెరతీశారు. గతంలో ఎస్పీడీసీఎల్ సీఎండీగా రిటైర్డ్ డీజీపీ హెచ్‌వై దొరను నియమించినప్పుడు.. వైసీపీ వర్గాలు వ్యతిరేకించాయి. కానీ జగన్ అధికార పగ్గాలు చేపట్టాక.. డిస్కంల సీఎండీ పోస్టులను నామినేటెడ్ పదవులుగా మార్చేశారు. 2019లో ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీగా సంతోష్‌రావును జగన్ నియమించారు. తర్వాత ఐఏఎస్ అధికారి పృథ్వీతేజ్‌ను నియమించి.. ఆయన్ను ఎస్పీడీసీఎల్ సీఎండీగా పంపారు. మూడేళ్ల తర్వాత మళ్లీ ఈపీడీసీఎల్‌కు తీసుకొచ్చారు. రెండేళ్లుగా అక్కడే ఉన్నారు. ఇక సీపీడీసీఎల్ సీఎండీగా పద్మాజనార్దన్ రెడ్డి దాదాపు నాలుగేళ్లపాటు కొనసాగారు. ఈయన హయాంలో ట్రాన్స్‌ఫార్మర్లను అవసరానికి మించి కొనుగోలు చేశారన్న అభియోగాలు ఉన్నాయి. ఇవి కూడా తెలంగాణ కంటే రెట్టింపు ధరలకు తన బంధువు, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ యజమాని విశ్వేశ్వర రెడ్డి నుంచి కొన్నారు. వీటిపై పత్రికల్లో ఎన్ని కథనాలు ప్రచురితమైనా పద్మాజనార్దనరెడ్డిని కొనసాగించారు. చివరకు ఎన్నికల ముందు తొలగించారు. ఎస్పీడీసీఎల్ సీఎండీగా ఉన్న సంతోష్‌రావుకు ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలై.. జగన్ గద్దె దిగి నెలవుతున్నా.. సంతోష్‌రావు ఎస్పీడీసీఎల్‌లోనే కొనసాగుతున్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అప్పిరెడ్డి అనుచరుల అరెస్ట్

గుంటూరు, జూలై 3: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్టులు మొదలయ్యాయి. దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిలో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరంతా వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అనుచరులే. ఈ దాడికి సూత్రధారులుగా భావిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ నందిగం సురేశ్, దేవినేని అవినాశ్‌నూ అరెస్టు చేసే అవకాశమున్నట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. డీజీపీ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఉన్న టీడీపీ కార్యాలయంపై రెండేళ్ల కిందట పట్టపగలే వైసీపీ మూకలు దాడి చేసి విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. నాటి ఘటనపై నేడు పోలీసులు దృష్టి సారించారు. సీసీ టీవీ ఫుటేజ్‌తోపాటు ఇతర ఆధారాలు సేకరించి దాడిలో పాల్గొన్న 63 మందిని గుర్తించారు. వీరిలో బుధవారం ఐదుగురిని అరెస్టు చేశారు. గుంటూరు 30వ డివిజన్ కార్పొరేటర్ వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బత్తుల దేవానంద్, గుంటూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాజా మొహిద్దీన్, వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ మస్తాన్ అలియాస్ స్టార్ మస్తాన్, వైసీపీ స్థానిక నేత గిరిలను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై 147, 148, 324, 452, 447, 448, 326, 307 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు సమాచారం.

హోరాహోరీ వాదనలు...

అరెస్టు చేసిన వైసీపీ నేతలను బుధవారం సాయంత్రం న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. వీరిని కాపాడేందుకు ఏకంగా పది మంది లాయర్లు రంగంలోకి దిగారు. నిందితులకు స్టేషన్ బెయిలు ఇవ్వాలని వాదించారు. కానీ... పోలీసులు వీరికి వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాధారాలు చూపించారు. నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించాలని కోరారు. వీరికి గురువారం రిమాండ్ విధించే అవకాశముంది. అంతకుముందు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, పలువురు వైసీపీ నాయకులు మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. రూరల్ సీఐ శ్రీనివాసరావుతో మాట్లాడి అరెస్టుకు గల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నిందితుల కోసం వేట

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మిగిలిన నిందితుల కోసం పోలీసులు వేట ముమ్మరం చేశారు. దాడి కేసులో పోలీసులు ప్రధాన నిందితులుగా గుర్తించిన వారిలో గుంటూరుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు ఉన్నారు. గుంటూరు నగరంతో పాటు మంగళగిరి, విజయవాడలోనూ ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి. దాడికి పాల్పడిన వారిలో చాలామంది అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

విజయవాడ ● గురువారం 4 జూలై 2024
diksuchi@andhrajyothy.com

నోయిడాలోని హిందుస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్(హెచ్‌సీఎల్) టెక్నాలజీస్ - 'టెక్‌బీ' ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అభ్యర్థులు ఐటీ ఉద్యోగులుగా రాణించేందుకు, అసోసియేట్స్‌గా ఎదిగేందుకు ఈ ప్రోగ్రామ్ తోడ్పడుతుంది. సంస్థ నిర్వహించే కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్), వర్సంట్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. హైదరాబాద్, విజయవాడ సహా నోయిడా, లఖ్‌నవూ, నాగ్‌పూర్, చెన్నైలలో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.10,000ల స్టయిపెండ్ ఇస్తారు. శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/డిజైన్ ఇంజనీర్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు. ఆసక్తిగలవారు ఉద్యోగం చేస్తూనే బిట్స్ పిలానీ, ఐఐఐటీ కొట్టాయం, అమిటి యూనివర్సిటీ(ఆన్‌లైన్), కేఎల్ యూనివర్సిటీ, శస్త్ర యూనివర్సిటీలలో చదువుకునే అవకాశం ఉంది. సంబంధిత గ్రాడ్యుయేషన్ కోర్సులకయ్యే ఖర్చును నిబంధనల ప్రకారం సంస్థ భరిస్తుంది.



హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో టెక్‌బీ ప్రోగ్రామ్

విభాగాలు:
డెవలప్ అప్లికేషన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, కోడింగ్, టెస్టింగ్ ఇంజనీర్, అనలిస్ట్, ప్రొడక్ట్ అండ్ అప్లికేషన్, డిటెక్టింగ్ బగ్స్ అండ్ రన్నింగ్ డయాగ్నస్టిక్స్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజైన్ ఇంజనీర్, ప్రొడక్ట్ అండ్ అప్లికేషన్ డిజైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, వెబ్ సర్వర్ డెప్లాయ్‌మెంట్, ప్రాసెస్ ఆటోమేషన్, సెక్యూరిటీ పాలసీ ఇంప్లిమెంటేషన్

ప్రోగ్రామ్ వివరాలు: దీనిని హైబ్రిడ్(ఆన్‌లైన్ సెషన్స్, తరగతి గది బోధన) విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొదట ఐటీ ఫౌండేషన్ అంశాలు బోధిస్తారు. ఐటీ ఫండమెంటల్స్, ఐటీ ప్రొఫెషనల్స్‌కు అవసరమయ్యే అంశాలు వివరిస్తారు. తరవాత ట్రెయినింగ్ ఫర్ జాబ్ సెషన్స్ ఉంటాయి. ఇందులో జాబ్ బేస్డ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సిమ్యులేషన్స్, కేస్ బేస్డ్ ప్రాక్టికల్ కరిక్యులమ్, పీర్ బేస్డ్ డిస్కషన్స్, లైఫ్ కోచెస్ టూల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. సంస్థకు చెందిన గ్లోబల్ ప్రాజెక్ట్‌లలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను సంస్థ అందిస్తుంది. అభ్యర్థులు సమయానుసారం అసెస్‌మెంట్‌లు, అసైన్‌మెంట్‌లు సబ్మిట్ చేయాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష (2023/2024) ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐటీ విభాగాలకు మేథమెటిక్స్/బిజినెస్ మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఇందులో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. ఐఐటీ జేఈఈ మెయిన్ 2023లో కనీసం 80 పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు హెచ్‌సీఎల్ కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్) రాయనవసరం లేదు. వీరిని నేరుగా వర్సంట్ టెస్ట్, ఇంటర్వ్యూలకు అనుమతిస్తారు.

ఎంపిక ప్రక్రియ: అభ్యర్థులు ముందుగా కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్) రాయాల్సి ఉంటుంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ రీజనింగ్(మేథమెటిక్స్), లాజికల్ రీజనింగ్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులను వర్సంట్ టెస్ట్‌కు పిలుస్తారు. ఇందులో స్పోకెన్ ఇంగ్లీష్, లాంగ్వేజ్ స్కిల్స్ పరీక్షిస్తారు. తరవాత ఫేస్ టు ఫేస్ ఇంటరాక్షన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ఉన్నత విద్యావకాశాలు: హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఉద్యోగంలో చేరిన తరవాత ఆసక్తి మేరకు పై చదువులు చదువుకోవచ్చు. శస్త్ర యూనివర్సిటీలో మూడేళ్ల బీసీఏ, రెండేళ్ల ఎంసీఏ/ఎమ్మెస్సీ డేటా సైన్స్; బిట్స్ పిలానీలో నాలుగేళ్ల బీఎస్సీ(డిజైన్ అండ్ కంప్యూటింగ్), వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు(బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఎమ్మెస్సీ); అమిటి యూనివర్సిటీ(ఆన్‌లైన్)లో మూడేళ్ల వ్యవధి గల బీకాం/బీసీఏ/బీబీఏ/బీఎస్సీ, రెండేళ్ల ఎంబీఏ/ఎంసీఏ; కేఎల్ యూనివర్సిటీలో మూడేళ్ల బీసీఏ; ఐఐఐటీ కొట్టాయంలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ కోర్సుల్లో చేరవచ్చు.

- దరఖాస్తు ఫీజు లేదు
- **వెబ్‌సైట్:** hcltechbee.com

ఐబీపీఎస్ క్లర్క్ ఎగ్జామ్ 2024
ముఖ్యమైన పది అంశాలు

వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 6,128 క్లర్క్ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. అర్హులైన అభ్యర్థులు జూలై 21లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియలో ఏయే బ్యాంకులు పాల్గొంటున్నాయి. ఎలా దరఖాస్తు చేసుకోవాలి? దరఖాస్తు చేసే ముందు ఏయే అంశాలను గమనంలోకి తీసుకోవాలి? పరీక్ష విధానం ఎలా ఉంటుంది? ఆఫర్ లెటర్ అందుకున్న తరవాత ఉద్యోగంలో చేరబోయే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? వివరాలు చూద్దాం..!

1. ఈ భర్తీ ప్రక్రియలో దేశవ్యాప్తంగా మొత్తం 11 ప్రభుత్వరంగ బ్యాంకులు పాల్గొంటున్నాయి.
2. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 1996 జూలై 1 కి ముందు గానీ, 2004 జూలై 1 తరవాత గానీ జన్మించి ఉండకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
3. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్ ఆపరేషన్స్/లాంగ్వేజ్‌లో సర్టిఫికెట్/డిప్లొమా/డిగ్రీ కోర్సు చేసి ఉండాలి లేదా హైస్కూల్/కాలేజీ స్థాయిలో కంప్యూటర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. అభ్యర్థులకు తాము దరఖాస్తు చేస్తున్న ప్రాంతానికి సంబంధించిన అధికార భాషలో తగిన ప్రావీణ్యం ఉండాలి.
4. పైన పేర్కొన్న అన్ని అర్హతలతో పాటు తప్పనిసరిగా ఉండాల్సిన మరో అర్హత హెల్తీ క్రెడిట్ హిస్టరీ(మంచి రుణ చరిత్ర). ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరే ముందు సంబంధిత బ్యాంకులు తప్పనిసరిగా క్రెడిట్ హిస్టరీ చెక్ చేస్తాయి. కాబట్టి అభ్యర్థులు సిబిల్ స్టేటస్‌ను అప్‌డేట్ చేసుకోవాలి. ఒకవేళ సిబిల్ స్కోరు అప్‌డేట్ కాని పక్షంలో...ఇంతకు ముందే ఏదైనా బ్యాంకు/సంస్థ నుంచి రుణం తీసుకుని చెల్లించిన అభ్యర్థులు.. సదరు బ్యాంక్/సంస్థ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసీ)ని తీసుకోవాలి. అలా చేయని పక్షంలో ఇచ్చిన ఆఫర్ లెటర్‌ను బ్యాంక్ క్యాన్సిల్ చేసే ప్రమాదం ఉంటుంది.
5. ఇక పరీక్ష విషయానికొస్తే...ఐబీపీఎస్ క్లర్క్ ప్రిలిమ్స్ ఎగ్జామ్‌ని 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ప్రశ్న పత్రంలో మూడు విభాగాలు ఉంటాయి.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	సమయం
ఇంగ్లీష్ లాంగ్వేజ్	30	30	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35	35	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35	35	20 నిమిషాలు
మొత్తం	**100**	**100**	**60 నిమిషాలు**

6. అభ్యర్థులు ప్రతి సెక్షన్‌లోనూ ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించాల్సి ఉంటుంది. ప్రిలిమ్స్ సాధించిన మెరిట్ మేరకు ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్షకు అభ్యర్థులను ఐబీపీఎస్ షార్ట్‌లిస్ట్ చేస్తుంది.
7. మెయిన్స్ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం 190 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 160 నిమిషాలు. ప్రశ్న పత్రంలో నాలుగు విభాగాలు ఉంటాయి.
   - **జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్:** 50 ప్రశ్నలు - 50 మార్కులు
   - **జనరల్ ఇంగ్లీష్:** 40 ప్రశ్నలు - 40 మార్కులు
   - **రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్:** 50 ప్రశ్నలు - 50 మార్కులు
   - **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** 50 ప్రశ్నలు - 60 మార్కులు
8. మొదటి రెండు విభాగాల్లో ప్రతి విభాగానికి 35 నిమిషాలు, తరవాత రెండు విభాగాల్లో ప్రతి దానికి 45 నిమిషాల సమయాన్ని ఐబీపీఎస్ నిర్దేశించింది. ఒక వేళ ఏమైనా మార్పులు చేర్పులు ఉన్నట్లయితే ఐబీపీఎస్ ఆ సమాచారాన్ని తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతుంది. కాబట్టి అభ్యర్థులు తరచుగా ఐబీపీఎస్ వెబ్‌సైట్‌ను చెక్ చేస్తూ ఉండాలి. ఇక పరీక్ష విధానానికి సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన ఇన్ఫర్మేషన్ హ్యాండ్ అవుట్‌ను ఐబీపీఎస్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
9. ఇక్కడ అభ్యర్థులు గమనించాల్సిన మరో ముఖ్య విషయం ఏమిటంటే.. నెగెటివ్ మార్కింగ్ విధానాన్ని ఐబీపీఎస్ అమలు చేస్తుంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి నాలుగో వంతు(0.25) మార్క్ కట్ చేస్తుంది. ఒకవేళ అభ్యర్థి సమాధానం గుర్తించకుండా ఖాళీగా వదిలిపెడితే మార్కుల్లో ఎలాంటి కోత ఉండదు
10. అభ్యర్థులు ఐబీపీఎస్ నిర్దేశించిన కనీస మార్కులు(కటాఫ్) తప్పనిసరిగా సాధించాలి. అయితే ఈ కటాఫ్ మార్కులను రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆ సమయానికి బ్యాంకుల్లో ఉన్న ఖాళీల సంఖ్యను బట్టి ఐబీపీఎస్ నిర్దేశిస్తుంది. ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ప్రాసెస్ పూర్తయ్యే వరకూ మెయిన్స్ మార్కులను ఐబీపీఎస్ వెల్లడించదు.



ఖాళీలు ఉన్న బ్యాంకులు
- బ్యాంక్ ఆఫ్ బరోడా
- కెనరా బ్యాంక్
- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
- యూకో బ్యాంక్
- బ్యాంక్ ఆఫ్ ఇండియా
- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- పంజాబ్ నేషనల్ బ్యాంక్
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
- ఇండియన్ బ్యాంక్
- పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్

మొత్తం ఖాళీలు: **6,128**
ఆంధ్రప్రదేశ్‌లో: **105**, తెలంగాణలో: **104**
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:
తెలంగాణ: హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్.
ఆంధ్రప్రదేశ్: గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం.

టీజీపీఎస్సీలో లీగల్ ఎక్స్‌పర్ట్‌లు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ).... కాంట్రాక్ట్/కౌట్ సోర్సింగ్ ప్రాతిపదికన టీజీపీఎస్సీ కార్యాలయంలో పనిచేసేందుకు ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదుల నుంచి కింద పేర్కొన్న సేవల కోసం దరఖాస్తులు కోరుతోంది.

1. లీగల్ ఎక్స్‌పర్ట్: **3 పోస్టులు**
2. సీనియర్ కౌన్సెల్: **1 పోస్టు**

అర్హతలు: ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఉత్తీర్ణతతోపాటు కనీసం సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.60,000
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను, ధ్రువపత్రాలతో సహా టీజీపీఎస్సీ కార్యాలయంలో అందజేయాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 2024 జూలై 15
వెబ్‌సైట్: https://www.tspsc.gov.in/



యూఓహెచ్‌లో నాన్ టీచింగ్ ఖాళీలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్)...కింద పేర్కొన్న నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఎ పోస్టులు
1. డిప్యూటీ రిజిస్ట్రార్(డిప్యూటేషన్): **2 పోస్టులు**
2. ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్(డిప్యూటేషన్): **1 పోస్టు**
3. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డిప్యూటేషన్)(సివిల్): **1 పోస్టు**
4. సీనియర్ సిస్టమ్ అనలిస్ట్: **1 పోస్టు**
5. అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్: **1 పోస్టు**
6. అసిస్టెంట్ రిజిస్ట్రార్: **2 పోస్టులు**
7. నెట్‌వర్కింగ్ ఇంజనీర్: **1 పోస్టు**

గ్రూప్-బి పోస్టులు
8. సెక్షన్ ఆఫీసర్: **3 పోస్టులు**
9. అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్/ఎలక్ట్రికల్): **1 పోస్టు**
10. సీనియర్ అసిస్టెంట్: **3 పోస్టులు**
11. అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్: **1 పోస్టు**
12. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: **1 పోస్టు**
13. పర్సనల్ అసిస్టెంట్: **1 పోస్టు**

గ్రూప్-సి పోస్టులు
14. టెక్నికల్ అసిస్టెంట్: **1 పోస్టు**
15. జూనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్: **1**
16. ఆఫీస్ అసిస్టెంట్: **4 పోస్టులు**
17. స్టెనోగ్రాఫర్: **5 పోస్టులు**
18. ల్యాబొరేటరీ అసిస్టెంట్: **4 పోస్టులు**
19. జూనియర్ ఆఫీసర్ అసిస్టెంట్: **14 పోస్టులు**
20. ల్యాబొరేటరీ అటెండెంట్: **4 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: గ్రూప్-ఎ పోస్టులకు 62 ఏళ్లు; గ్రూప్-బి పోస్టులకు 35 ఏళ్లు; గ్రూప్-సి పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తు చివరి తేదీ: జూలై 19
వెబ్‌సైట్: https://uohyd.ac.in/

జాబ్ కార్నర్

ఎండీఎస్ఎల్‌లో అప్రెంటిస్‌లు

ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ట్రేడులు: డ్రాఫ్ట్స్‌మన్(మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పైప్ ఫిట్టర్, స్ట్రక్చరల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, రిగ్గర్, వెల్డర్ ఎలక్ట్రికల్.
అర్హత: ఖాళీని అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి గ్రూప్-ఎ 15 నుంచి 19 ఏళ్లు; గ్రూప్-బి 16-21 ఏళ్లు, గ్రూప్ సి 14-18 ఏళ్ల మధ్య ఉండాలి.
దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ, ఈబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 26
వెబ్‌సైట్: https://www.mazagondock.in/



నౌకరు తెలివి

రామాపురంలో ఒక భూస్వామి ఉండే వాడు అతనికితాను అందరికన్నా తెలివైన వాడినని చాలా నమ్మకం. తన దగ్గర పనిచేసే నౌకర్లను, వారి తెలివి తక్కువ పనులను ఎపుడూ హేళన చేస్తూ, తన మిత్రుల ముందు వారిని తిడుతూ ఉండేవాడు. ఒకరోజు తనకు ఓ మిత్రుడు కానుకగా పంపిన కోడికూరను ద్రాక్షారసాన్ని నౌకరు చేత ఇంటికి పంపుతూ నౌకరుతోఇలా చెప్పాడు' ఈ బుట్టలోఉన్నగిన్నెలో ఒక పిట్ట, సీసాలో విషం ఉన్నాయి. జాగ్రత్తగా తీసుకువెళ్లి ఇంట్లో ఇవ్వు, ఆ రెంటి మూతలు అసలు తెరిచి చూడకు ప్రమాదం, పిట్ట ఎగిరిపోతే కష్టం' అన్నాడు. నౌకరు అలా వెళ్లగానే 'విషం అని చెప్పాను కాబట్టి నౌకరు అసలు మూత తెరిచి చూడడు ఎలా ఉంది మన తెలివి' అంటూ నవ్వాడు.

ఆ నౌకరు యజమాని కంటే తెలివైన వాడు. యజమాని ఇలా చెప్పాడంటే అందులో ఏముందో చూడాలి అనుకున్నాడు. దారిలో బుట్టలోపలి గిన్నె, సీసా తెరిచి చూడగా ఘుమఘుమలాడే మంచి కోడి కూర తో పాటు ద్రాక్షారసం కనిపించాయి. ఎంచక్కా ఆ రెంటినీ ఖాళీ చేసి, చెట్టు కింద పడుకుని నిద్ర పోయాడు. సాయంత్రం ఇల్లు చేరిన భూస్వామికి నౌకరు ఇంటికే రాలేదని తెలిసి,అతన్ని వెతుకుతూ వెళ్లాడు అతనికి నౌకరు ఒక చెట్టు కింద పడుకుని, హాయిగా నిద్ర పోతూ కనిపించాడు. ఏమైంది అని అడిగిన యజమానితో నౌకరు 'నేనుబుట్టతలపై పెట్టుకుని నడుస్తూ ఉండగా కాలికి రాయి తగిలి ముందుకు తూలగానే బుట్టలోని పిట్ట ఎగిరి పోయింది, అది తెలిసి మీరు తిడతారన్న భయంతో విషం తాగేశాను కానీ ఎందుకనో నేను బతికే ఉన్నానయ్యా' అన్నాడు. అనవసరంగా అబద్ధం చెప్పి నేనే నష్ట పోయాను కొంచెం జాగ్రత్తలు చెప్పి పంపితే అయిపోయేది అనుకున్నాడు భూస్వామి.

దారి కనుక్కోండి




10 తేడాలు గుర్తించండి!





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 349

6		8		2				7
	4	2					5	
	9				8			1
4			9				3	
			7		2			
	6				3			9
3			5				7	
	7					5	1	
5				1		9		4

సుడోకు - 348 సమాధానం

2	7	5	8	1	3	4	9	6
1	4	8	7	6	9	2	5	3
9	3	6	4	2	5	8	1	7
8	6	4	1	3	2	9	7	5
3	9	7	5	4	6	1	2	8
5	1	2	9	8	7	6	3	4
4	8	3	2	7	1	5	6	9
6	5	1	3	9	8	7	4	2
7	2	9	6	5	4	3	8	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.